ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole,Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-10-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 258 పేజీలు: 12 వెల: 8.00


నేటి నుంచి మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన 2లో

ట్రంప్‌తో భేటీ వేళ పుతిన్‌ను అరెస్టు చేస్తారా? 9లో

## పోలీసులకు బాదుడు అలవాటా?




### ఘాటుగా విమర్శించిన హైకోర్టు

### ఓ పిటిషనర్ ఇప్పటికి నడవలేక పోతున్నాడని వ్యాఖ్య

### పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదని సలహా

**విజయవాడ,అక్టోబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** పౌరులను అక్రమంగా నిర్బంధించి చితకబాదటం పోలీసులకు అలవాటుగా మారిందని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. న్యాయస్థానం లా న్యూస్ బులిటిన్ నేడు తెలిపిన సమాచారాన్ని అనుసరించి 2018లో పోలీసులు కొడితే పిటీషనర్ ఇప్పటికీ నడవలేని స్థితిలో ఉన్నారని న్యాయస్థానం వెల్లడించింది. కర్నూలు జిల్లా చిప్పగిరి గ్రామానికి చెందిన జయపాల్ యాదవ్‌ను కర్నూలు సీసీఎస్ పోలీసులు చితకబాదారని న్యాయస్థానం పేర్కొంది. ఎటువంటి కేసు అయినప్పటికి పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేందుకు వీల్లేదందని న్యాయస్థానం స్పష్టం చేసింది. హైకోర్టులో పనిచేసే ఓ డ్రైవర్‌పై మంగళగిరి సిఐ తాజాగా దాడి చేశారని,గుంటూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా తాము జోక్యం చేసుకుంటే ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశారని గుర్తు చేసింది. కేసు నమోదుకు జిల్లా ఎస్పీని పిలిపించి మాట్లాడాల్సి వచ్చిందని పేర్కొంది. డీజీపీతో మాట్లాడాక ఈ కేసులో దర్యాప్తు అధికారిని నియమించి,దాడికి పాల్పడిన సిఐని వీఆర్‌కు పంపారని తెలిపింది. పోలీసుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది తనను చిత్రహింసలకు గురిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని జయపాల్ యాదవ్ 2016లో పోలీసులకు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి యేళ్లు గడుస్తున్నా సకాలంలో తుది నివేదిక దాఖలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించింది. తన ముందు విచారణకు హాజరుకావాలని ఆదేశించాక కర్నూలుజిల్లా ఎస్పీ, సీసీఎస్ సిఐ దిగువ కోర్టులో ఈ ఏడాది అక్టోబర్ 14న తుది నివేదిక దాఖలు చేశారని ఆక్షేపించింది. ఆ నివేదికప్రతిని జయపాల్ యాదవ్‌కు >>2

# ఉద్యోగులకు వచ్చే నెల డిఎ



### శుభవార్త తెలిపిన సిఎం చంద్రబాబు

### ఉద్యోగనేతలతో చర్చల్లో ఒక డిఎ ఇచ్చేందుకు అంగీకారం

### ప్రతి నెల రూ.160 కోట్ల అదనపు భారం

### ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతి: సిఎం

**విజయవాడ, అక్టోబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** దీపావళి పండుగ వేళ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు డీఏ కానుక అందించింది. నవంబరు 1 నుంచి పెంచిన డీఏ చెల్లించనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శనివారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఉద్యోగ సంఘాలు, మంత్రివర్గ ఉపసంఘంతో భేటీ అనంతరం ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారు. దీనికి ప్రతీ నెలా రూ.160 కోట్ల వ్యయం అవుతుందని సీఎం వెల్లడించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ పోలీసులకు సరెండర్ లీవుల్లో ఒక ఇన్‌స్టాల్ మెంట్ క్లియర్ చేస్తాం. 2 విడతల్లో ఈ చెల్లింపులు చేస్తాం. ఈ ఏడాది నవంబరులో ఒక విడత, 2026 జనవరిలో మరో విడతను చెల్లిస్తాం. 1 సరెండర్ లీవ్ చెల్లింపుల నిమిత్తం రూ.210 కోట్లు వ్యయం అవుతుంది. ఉద్యోగుల హెల్త్ కార్డు పూర్తి స్థాయిలో అమల్లో ఉన్న ఇబ్బందులను పరిష్కరిస్తాం. దీన్ని 60 రోజుల్లోగా పూర్తి చేసేలా కెబినెట్ సబ్ కమిటీ చర్యలు తీసుకుంటుంది. 180 రోజుల చైల్డ్ కేర్ లీవ్స్ రిటైర్మెంట్ వరకు వినియోగించుకునే అవకాశం కల్పిస్తాం. చైల్డ్ కేర్ లీవ్స్ వినియోగంలో వయోపరిమితి లేదు. ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు క్లియర్ చేస్తాం. ఉద్యోగ సంఘాల భవనాలకు చెందిన ప్రాపర్టీ ట్యాక్స్ మాఫీ చేస్తాం. ఉద్యోగుల అందరి గౌరవాన్ని మరింత పెంచేలా కొన్ని నామన్ క్లేచర్లను రీ డెజిగ్నేట్ చేస్తాం అని స్పష్టం చేశారు.

**గత పాలనలో ఉద్యోగులూ బాధితులే**

"గత వ్యవస్థలో రాష్ట్రంతో పాటు ఉద్యోగులు కూడా బాధితులుగా మారారు. కనీసం ఉద్యోగులు తమ అభిప్రాయాలను కూడా చెప్పుకోలేని పరిస్థితిని గత పాలకులు కల్పించారు. ఉద్యోగుల బాధలు నాకు అర్థం అయ్యాయి. విధ్వంసాన్ని పూడ్చేందుకు 20 ఏళ్లు పడుతుందని చెప్పాను. ప్రతీ నెలా 1 తేదీనే ఉద్యోగులకు వేతనం చెల్లిస్తున్నాం, పెన్షన్ చెల్లింపులు చేస్తున్నాంరూ. రూ.15,921 కోట్ల బకాయిలు ఉద్యోగులకు క్లియర్ చేశాం. గతంలో పెట్టిన బకాయిలను రూ.23,556 కోట్లను సిస్టంలో అప్ లోడ్ చేశాం. రూ.9,371 కోట్ల పాత స్కీమ్‌లకు యూసీలు ఇచ్చాం. సూపర్ సిక్స్ లాంటి సంక్షేమ పథకాలను ప్రజలకు ఇస్తున్నాం. ఉద్యోగులకు మరింత సంక్షేమం అందివ్వాలన్న మనసు కూటమి ప్రభుత్వానికి ఉంది. మా ప్రభుత్వం ఉద్యోగులతో కలిసి పని చేస్తుంది. వెసులుబాటు వస్తే పీఆర్సీ కూడా ఇస్తాం. పీఆర్సీ విషయం నాకు వదిలిపెట్టమని ఉద్యోగులకు చెప్పాను. ఉద్యోగ సంఘాల సమస్యలపై కేబినెట్ సబ్ కమిటీ ఉంది. ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి వచ్చిన అంశాలపై నిర్ణయం తీసుకుంటాం. అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు ఉండాలనే ప్రభుత్వ ప్రయత్నం. ఇందులో ఉద్యోగులు కూడా భాగస్వాములే. గుంతలు పడిన రోడ్లు ఇతర రాష్ట్రాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని గుంతల మయం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో గుంతలు పూడ్చి అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తున్నాం. దీపావళికి ఉద్యోగులకు శుభవార్త చెప్పాలనే ఉద్దేశంతోనే వారితో భేటీ అయ్యాను. రాష్ట్రానికి ప్రధాన రథచక్రాలు ఉద్యోగులే. 16 నెలలుగా అందిస్తున్న సుపరిపాలన ద్వారా మాత్రమే ఈ స్థాయిలో పెట్టుబడులు వస్తు న్నాయి. ఆర్టీసీ సహా కొన్ని శాఖల ఉద్యోగులు అందిస్తున్న సేవలు అద్వితీయంగా ఉన్నాయి. మళ్లీ ఈ రాష్ట్రం వెనుకబడకూడదనే ధ్యేయంతో పని చేస్తున్నాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**రాష్ట్రాభివృద్ధి యజ్ఞంలో ఉద్యోగులూ భాగస్వాములే**

"గత పాలనలో జరిగిన విధ్వంసాన్ని సరిచేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది. రాష్ట్ర అభివృద్ధిలో ప్రధాన భాగస్వాములుగా ఉన్న ఉద్యోగులందరికీ ఎక్కడా ఇబ్బంది కలుగ కూడదనే ప్రయత్నం చేస్తున్నాం. ఆర్థిక అంశాలపై ఎలాంటి దాపరికం లేదు. రాష్ట్రాభివృద్ధి యజ్ఞం చేస్తున్నాం. ఉద్యోగులతో కలిసే >>2

## పేదరికాన్ని పూర్తిగా పారద్రోలుతాం

### జిఎస్టీ సంస్కరణలతో ప్రజలందరికి లాభమే: సిఎం చంద్రబాబు

**విజయవాడ,అక్టోబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిలపాలన్నదే తమ ప్రభుత్వ కీలక లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. రాష్ట్రాన్ని జీరో పావర్టీగా తీర్చిదిద్దాటాన్ని తాము అత్యంత ప్రాధాన్యతాంశంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రానికి అత్యంత పటిష్టమైన ఆర్థిక ఆదాయ వనరుగా వ్యవసాయం,,మత్స్యరంగాలను తీర్చిదిద్దుతామన్నారు. పారిశ్రామిక,సాంకేతిక,,కృత్రిమ మేధో రంగాల్లో అత్యున్నత స్థితి ఉంచుతామన్నారు. ఉపాధి,ఉద్యోగ కల్పన అవకాశాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రధాని రాష్ట్ర పర్యటన విజయవంతం కావడం,అమరావతిలో సీఆర్డీఏ భవనం కార్యకలపాల ప్రారంభ. విశాఖలో గూగుల్ ఒప్పందం తదితరంశాలపై శనివారం సీఎం చంద్రబాబు అధికారులతో,మంత్రులు, టీడీపీ నేతలతో సమీక్షించారు. పేదరిక నిర్మూలన అంటే కేవలం ఆర్థిక సాయం చేయడం కాదు వారి ఆత్మగౌరవాన్ని కాపాడటం, ఎదగడానికి అవకాశాలను కల్పించడం, అందరితో సమానంగా ముందుకు నడిపించడమని సీఎం చంద్రబాబు అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047లోని ప్రధాన లక్ష్యం పేదరిక నిర్మూలన అని అన్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు కూటమి ప్రభుత్వం మొదటి రోజు నుంచి పని చేస్తోందని వెల్లడించారు. 16 నెలల్లో రూ.1 లక్ష కోట్లకు మించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేనటువంటి విధంగా నెలనెలా రూ.2,758 కోట్లతో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నామని సీఎం తెలిపారు. ఒకే దేశం - ఒకే పన్ను - ఒకే మార్కెట్ నినాదంతో వచ్చిన జీఎస్టీ పన్ను విధానంలో ప్రస్తుత సంస్కరణల వల్ల 99 శాతం వస్తువులు సున్నా నుంచి 5 శాతం పన్ను పరిధిలోకి వచ్చాయన్నారు. తద్వారా అన్ని వస్తువుల ధరలు తగ్గాయని సీఎం అన్నారు. జీఎస్టీ 2.0తో పన్నులు తగ్గి పేదలు, మధ్యతరగతికి గణనీయంగా ఉపశమనం కలిగిందని అటు వ్యాపారులు, ఎంఎస్ఎంఈ వర్గాలకూ ప్రయోజనం చేకూరుతోందని స్పష్టం చేశారు. విద్యార్థులు, రైతులు, చిరుద్యోగులు, చిరు వ్యాపారులు, వృద్ధులు, కూలీలు, కార్మికులు ఇలా అన్ని వర్గాలకు లబ్ది కలిగించేలా సంస్కరణలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రతీ కుటుంబానికి రూ.15 వేల వరకూ ఆదా అవుతుందని స్పష్టం చేశారు. దసరా నుంచి దీపావళి వరకూ జీఎస్టీ సంస్కరణల్ని పండుగలా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 98 వేల ఈవెంట్లు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు.



## పిజి వైద్యవిద్యలో కొత్తగా 106 సీట్లు

### మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, అక్టోబరు18, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ వైద్య విద్యలో సీట్లు భారీగా పెరిగాయి. గైనిక్, జనరల్ మెడిసిన్, ఇతర స్పెషాల్టీ కోర్సుల్లో ప్రస్తుతం ఉన్న వాటి కంటే అదనంగా 106 సీట్ల (బ్రాడ్ స్పెషాల్టీ కోర్సులు) భర్తీకి జాతీయ వైద్య కమిషన్ ఆమోదం తెలిపిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో వెల్లడించారు. ఇందులో 5 వైద్య కళాశాలల్లో కొత్తగా వచ్చిన సీట్లు 60 వరకు ఉన్నా యని పేర్కొన్నారు. ప్రస్తుతం పీజీ వైద్య విద్యలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 1,763బ్రాడ్ స్పెషాల్టీ, 4 డిప్లొమా కోర్సు సీట్లు ఉన్నాయి. కిందటేడాది >>2

# 359 'రూర్బన్' పంచాయతీలు

**విజయవాడ,అక్టోబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థలో ఏపీ ప్రభుత్వం కీలక సంస్కరణలు చేపట్టింది. పంచాయతీ కార్యదర్శుల్లో ప్రస్తుతం ఉన్న ఆరంచెల వ్యవస్థను నాలుగు అంచెల వ్యవస్థగా మార్పు చేయనున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పట్టణాలకు దీటుగా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. గ్రామాలను అభివృద్ధి చేసే సందర్భంగా వాటి పరిధి విస్తరణ, పలు సదుపాయాలకు కల్పన తదితరంశాలపై ప్రణాళిక బద్ధ వ్యవహరిస్తామని వెల్లడించారు. ఇటీవల సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పంచాయతీ కార్యదర్శుల్లో నాలుగు అంచెల వ్యవస్థగా మార్పు చేసే అంశాన్ని విశ్లేషణాత్మక వివరించారు. ఆయన ప్రతిపాదన సీఎం ఆమోదం తెలిపారు. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని 26 జిల్లాల జిల్లా పంచాయతీ అధికారుల నుంచి సమగ్ర సమాచారాన్ని కూడా ఇప్పటికే ప్రభుత్వానికి చేరినట్లు సమాచారం, వచ్చే వారంలో దీనికి సంబంధించిన తుది ఉత్తర్వులు వెలువడనున్నాయని సమాచారం. నూతన వ్యవస్థలో గ్రామీణ స్థాయిలో అర్బన్ స్థాయి కలిగిన పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా పరిగణిస్తారు. వీటిని రూర్బన్ (రూరల్, అర్బన్ - ఆర్ అర్బన్) పంచాయతీలుగా నిర్దేశించారు. ఈ పంచాయతీల కార్యదర్శిని రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా (ఆర్‌యుడిఒ) పిలుస్తారు. ప్రస్తుతం ఎ గ్రేడ్ పంచాయతీ కార్యదర్శులను ఆర్‌యుడిఒగా నియమిస్తారు. రూర్బన్ పంచాయతీలంటే పది వేల జనాభాపైన ఉండి మండల పరిధిలో అత్యధిక ఆదాయం కలిగి ఉండాలి. ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 359 పంచాయతీలను ఇప్పటికే గుర్తించారు. ఈ పంచాయతీల కార్యదర్శులు గెజిటెడ్ హోదా కలిగి ఉంటారు. డిప్యూటీ ఎంపిడిఒలను కూడాఈ పంచాయతీలకు కార్యదర్శులుగా నియమించడానికి కసరత్తు జరుగుతోంది. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో నాలుగు స్థాయిలో కార్యదర్శులుగా పనిచేస్తున్నారు. వీరితోపాటు ఆరేళ్ల క్రితం సచివాలయాల్లో ఎంపిక అయిన పం చాయతీ కార్యదర్శులను ఐదు, ఆరు కేటగిరిలో ఉంచారు. ఆరో కేటగిరి కార్యదర్శి చాలా సచి వాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌గా కంప్యూటర్‌కు సంబంధించిన అంశాల్లో వినియోగిస్తున్నారు. మొత్తం ఆరెంచల వ్యవస్థను నాలుగు అంచెలుగా మారుస్తున్నారు.



### పంచాయతీ కార్యదర్శుల్లో ఇక నాలుగంచెల వ్యవస్థ

### కార్యదర్శుల పోస్టులు పిడిఒగా మార్పు

### ఉద్యోగుల సర్వీసుల్లోనూ భారీ మార్పులు

### డిప్యూటీ సిఎం పవన్ ప్రతిపాదనలు అమలుకు సిద్ధం

**రద్దు కానున్న క్లస్టర్ విధానం:** ఈ మార్పులతో ఇప్పటి వరకు ఉన్న గ్రామ పంచాయతీల క్లస్టర్ విధానం రద్దు కానుంది. ప్రస్తుతం ఉన్న 7,244 క్లస్టర్ పంచాయతీల విధానాన్ని రద్దు చేసి, 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర పరిపాలనా యూనిట్లుగా ఏర్పాటు >>2



## పండుగలా ధాన్యం సేకరణ

### మంత్రి నాదెండ్ల

**విజయవాడ, అక్టోబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. విజయవాడలోని హోటల్ వివాంతలో శనివారం మంత్రి అధ్యక్షతన అధికారులకు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాప్‌ను ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై కార్పొరేషన్, సివిల్ సప్లై డిపార్ట్మెంట్ సంయుక్తంగా నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ గత >>2

## ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం

### మళ్లీ భారీ వర్ష సూచన

**విజయవాడ,అక్టోబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:** ఆగ్నేయ బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని,దీని ప్రభావంతో వచ్చే మంగళవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం.. ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది ఆతదుపరి 48 గంటల్లో పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ దక్షిణ మధ్య బంగాళాఖాతం,పశ్చిమమధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో వాయుగుం డముగా బలపడే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో బుధవారం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారఆదివారం శ్రీకా కుళం, విజయనగరం, కోనసీమ, తూర్పుగో దావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, అన్న మయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడు గులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతాజిల్లాల్లో కొన్నిచోట్ల తేలిక >>2



## బ్రహ్మోస్ కదిలితే

# పాక్ మసి

### దాయాది ప్రతి అంగుళం మన క్షిపణి రేంజ్‌లోనే

### రక్షణమంత్రి రాజ్‌నాథ్ హెచ్చరిక

**లక్నో, అక్టోబరు 18:** పాకిస్థాన్‌లోని ప్రతి అంగుళం బ్రహ్మోస్ మిస్సైల్ పరిధిలోనే ఉన్నట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇక ఆపరేషన్ సింధూర్ సమయంలో జరిగింది కేవలం ట్రైలర్ మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. లక్నోలోని సరోజిని నగర్‌లో ఉన్న బ్రహ్మోస్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించిన రాజ్‌నాథ్ అక్కడ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. భారతీయ >>2

# ఓ కుటుంబం కులబహిష్కరణ!

### కట్టుబాట్లు తప్పి కుమారునికి పెళ్లి నిశ్చయించారని కులపెద్దల ఆగ్రహం

### జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధిత ఎంబిసి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జోగి వెంకటేష్

**ఉరవకొండ, అక్టోబరు 18 ప్రభాతవార్త:** సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతూ ప్రపంచమే ఒక కుగ్రామంగా మారుతున్న ఈరోజుల్లో ఉరవకొండలో జరిగిన అనాగరిక, అమానుష ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. విద్యావంతుడైన తన కుమారుడికి మంచి చదువుకున్న అమ్మాయిను చూసి పెళ్లి చేయాలని ఆ తండ్రి నిర్ణయించి నిశ్చితార్థం చేయడమే నేరమైంది. ఉన్న ఊరు, కట్టుబాట్ల మేరకు కాకుండా బయటి ఊరికి వెళ్లి ఎలా వివాహాన్ని నిశ్చంచావంటూ సదరు కుటుంబాన్ని కుల పెద్దలు కులం నుంచి 12 సంవత్సరాలు బహిష్కరించడం సంచలనం రేకెత్తిస్తోంది. ఉరవకొండ పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో నివాసముంటున్న మాజీ వార్డు సభ్యులు, ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జోగి వెంకటేష్ కుటుంబానికి జరిగిన అన్యాయం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు తనకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను సైతం ఆశ్రయించడం ఆసక్తికరంగా మారింది. బాధిత జోగి వెంకటేష్ తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో నివాసముండే వ్యవసాయం ద్వారా జీవనం సాగిస్తున్న ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జోగి వెంకటేష్ ఎంసీఏ వరకు చదివిన తన కుమారుడికి కర్నాటక రాష్ట్రంలోని స్థిరంగా ఉండే కుటుంబంలో చదువుకున్న అమ్మాయితో వివాహం చేయడానికి నిశ్చయించారు. ఈ విషయం కులంలోని పెద్దలకు నచ్చకపోవడంతో నీవు కట్టుబాట్లు తప్పి మన గుంపులో అమ్మాయిను కాకుండా వేరే గుంపులోని సంబంధాలు కలుపుకోకూడదంటూ కులం నుండి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఖంగుతిన్న బాధిత జోగి వెంకటేష్ నేను మన కులానికి చెందిన అమ్మాయితోనే నా కుమారుడికి పెళ్లి చేయాలనుకోవడం ఎలా తప్పవుతుందని పెద్ద మనుషులను ప్రశ్నించారు. దీంతో పెద్ద మనుషులు ఉద్యాల గ్రామంలో గత నెల 17న పంచాయతీ పెట్టి నీవు అక్కడికి రావాలని ఆదేశించగా ఆయన అక్కడికి పలువురు పెద్ద మనుషులతో కలిసి వెళ్లగా వివాహ నిశ్చయ తాంబూలాల సమయంలో తన వెంట వచ్చిన కుటుంబాలు సైతం కట్టుబాట్లు తప్పాయంటూ వారినుండి 1,200 రూపాయలు చొప్పున తప్పు కట్టించుకున్నారు. ఎవరూ తప్పు చేయకున్నా కేవలం తన వెంట వచ్చినందుకు తప్పు ఎలా వసూళు చేస్తారని తాను ప్రశ్నించగా నీవు పెళ్లి చేయాలని నిర్ణయించిన కుటుంబం జోగి కులం అని ఎలా నిరూపిస్తావని చెప్పారని దీంతో >>2

## నాగార్జునసాగర్‌లో గవర్నర్ నజీర్ పర్యటన

**నాగార్జునసాగర్ ప్రభాతవార్త అక్టోబరు 18:** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ శనివారం కుటుంబ సమేతంగా నాగార్జునసాగర్ ను సందర్శించారు. వీరి రాక సందర్భంగా స్థానికంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ముందుగా వీరు స్థానికంగా ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్లే గ్రౌండ్లో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకోగానే వీరికి నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా >>2

19-10pg2exHMNWJQE 2_19-10pg2exHMNWJQE.qxd 10/19/2025 12:44 AM Page 1



## నేటి నుంచి 24 వరకు
# మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన

### ఆస్ట్రేలియా వర్సిటీల్లో అధునాతన బోధనా పద్ధతులపై అధ్యయనం

### సిఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ విజయవంతంపై రోడ్‌షోలకు హాజరు

**విజయవాడ,అక్టోబరు18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్,విద్య,ఐటీ,ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్దమయ్యారు. ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా వివిధ దేశాల్లో పర్యటిస్తూ ఇతర రాష్ట్రాల్లో కూడా పర్యటిస్తూ వచ్చిన ఆయన కీలక పెట్టుబడులను సైతం సాధించగలిగారు. ఇక తాజాగా మరోసారి విదేశీ పర్యటనకు వెళ్ళనున్నారు. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఆస్ట్రేలియాలో మంత్రి లోకేష్ పర్యటించబోతున్నారు. స్పెషల్ విజిట్స్ ప్రోగ్రాంలో పాల్గొనాల్సిందిగా ఇటీవలే ఆస్ట్రేలియా ప్రభుత్వం తరపున ఆస్ట్రేలియా హైకమీషనర్ ఫిలిప్ గ్రీన్ ఏపీ మంత్రి నారా లోకేష్‌కు ఆహ్వానం పంపించారు. మానవ వనరులు, సాంకేతిక, ఆర్థికాభివృద్ధి రంగాల్లో ఏపీ నాయకత్వాన్ని ప్రశంసించిన ఆస్ట్రేలియా గవర్నమెంట్ ,స్పెషల్ విజిట్ ప్రోగ్రాంలో భాగస్వామ్యం కావాల్సిందిగా నారా లోకేష్ పంపిన ఆహ్వానంలో పేర్కొంది. దీంతో,రేపటి నుంచి ఈ నెల 24వ తేదీ వరకు ఆస్ట్రేలియాలో పర్యటించి. వివిధ యూనివర్సిటీలను సందర్శించనున్నారు. ఏపీ విద్యాశాఖమంత్రి...ఆయా యూనివర్సిటీల్లో ఆధునాతన విద్యావిధానాలపై అధ్యయనం చేయనున్నారు. మరోవైపు,వచ్చే నెల అంటే నవంబరు 14,15 తేదీల్లో విశాఖపట్నం వేదికగా నిర్వహించే సిఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ విజయవంతం చేయాలని కోరుతూ రోడ్‌షోలో పాల్గొననున్నారు. కూటమి సర్కార్ ఏర్పడిన తర్వాత విద్యాశాఖలో కీలక మార్పులు చేసిన మంత్రి నారా లోకేష్ ఈ పర్యటన తర్వాత మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అంశం ఉందనే చర్చ సాగుతోంది. పెట్టుబడులే లక్ష్యంగా పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ విదేశాలకు వెళ్తున్నట్లు సమాచారం.



సిఎం చంద్రబాబుకు ఆహ్వాన పత్రం అందిస్తున్న కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి

## అమీన్ పీర్ దర్గా ఉర్సుమహోత్సవాలకు సిఎంకు ఆహ్వానం

### ముఖ్యమంత్రిని కలిసిన కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి

**విజయవాడ,అక్టోబరు18, ప్రభాతవార్తప్రతినిధి:** కడప అమీన్ పీర్ దర్గా ఉర్సు మహోత్సవాలకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆహ్వానించారు. సీఎం చంద్రబాబును కడప అమీన్ పీర్ దర్గా పిఠాధిపతి హజ్రత్ కేఎస్ఎస్ హరిఫుల్లా హుస్సేనీ కలిసి ఆహ్వానం అందించారు. జాతీయ స్థాయిలో పేరొందిన ఈ ఉర్సు మహోత్సవాలు వచ్చే నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరుగుతున్నాయని ఈ ఉర్సు మహోత్సవాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ముఖ్యమంత్రిని కోరారు. ఉర్సు మహోత్సవ ఏర్పాట్లు ఏ విధంగా జరుగుతున్నాయని సీఎం వారిని అడిగి తెలుసుకున్నారు. ఉర్సు మహోత్సవాలకు సహకారం అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రిని కలిసినవారిలో అమీన్‌పీర్ దర్గా మేనేజర్ మొహమ్మద్ అలీఖాన్,బాఖీ ఉల్లాఖాన్ తదితరులు ఉన్నారు.

## హోంమంత్రి, టిటిడి ఉద్యోగుల పేరుతో భక్తులకు బురిడీ

**సేవాటిక్కెట్లు ఇప్పిస్తానని రూ.4.10లక్షలు మోసం**

**తిరుమల,అక్టోబరు 18ప్రభాతవార్తప్రతినిధి:** ఏడు కొండల వేంకటేశ్వరస్వామి దర్శనాలు, సేవా టిక్కెట్లు ఇప్పిస్తానని హోంమంత్రి,టిటిడి ఉద్యోగుల పేరుతో భక్తులను దళారీ మోసం చేస్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన భక్తుడి నుండి ఏకంగా 4.10లక్షలు రూపాయలు గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా వసూలుచేసి ఆ తరువాత సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేసేసి పరారయ్యాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీవారి సేవా టిక్కెట్లు ఇప్పి స్తానని దళారీ అశోక్ తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన బజ్రంగ్ అమన్‌గోయల్‌ను దళారీ నమ్మించాడు. నిజమేనని నమ్మిన గోయాల్ అతనికి అడిగిన 4.10లక్షలు రూపాయలు నగదును పంపాడు. చివరకు దర్శనాలు చేయించకపోగా సేవా టిక్కెట్లు ఇప్పించలేదు. దీంతో మోసపోయామని గ్రహించి టిటిడి విజిలెన్స్ వింగ్‌కు ఫిర్యాదు చేశాడు. విజిలెన్స్ ఫిర్యాదుతో తిరుమల వన్ టౌన్ పోలీసులు కేసునమోదు చేశారు. ఇలాంటి దళారీల పట్ల భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి తెలిపింది.

# 359 'రూర్బన్' పంచాయతీలు

>> చేస్తారు. గ్రామ పంచాయతీలకు గ్రేడింగ్ విధానం కొత్తగా తీసుకొస్తున్నారు. నూతనంగా ఏర్పాటు కానున్న రూర్బన్ పంచాయతీలకు రూరల్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆఫీసరుగా గ్రేడ్1 కార్యదర్శులను నియమిస్తారు. రూర్బన్ పంచాయతీలు కాకుండా మిగిలిన పంచాయతీలను మూడు గ్రేడులుగా పునర్వర్గీకరణ చేస్తారు. ఈ మేరకు పంచాయతీల్లోని ఉద్యోగులు, అధికారుల పోస్టుల అప్‌గ్రేడేషన్, పునర్వ్యవస్థీకరణకు జిల్లాల నుంచి ప్రభుత్వం ఇటీవల ప్రతిపాదనలు స్వీకరించింది. ఆయా పోస్టులకు ప్రత్యేక స్కేల్స్ నిర్ణయించింది. అదనపు ఆర్థిక భారం లేకుండా అధికారుల పేర్లు, హోదాను మార్పు చేయనున్నారు. ఇక మీదట పంచాయతీ సెక్రటరీ పోస్టు పేరును పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (పిడిఒ)గా మార్చనున్నట్లు సమాచారం.

జూనియర్ అసిస్టెంట్ పోస్టుల అప్‌గ్రేడేషన్‌లో భాగంగా 1,097 సాంక్షన్డ్ స్ట్రెంగ్త్ నుండి 359 జూనియర్ అసిస్టెంట్/జూనియర్ అసిస్టెంట్‌కమ్‌బిల్ కలెక్టర్ పోస్టులను సీనియర్ అసిస్టెంట్ పోస్టులుగా ఉద్యోగోన్నతి కల్పించి రూర్బన్ పంచాయతీల్లో నియమిస్తారు ఉద్యోన్నతులకు శిక్షణ తప్పనిసరి చేసింది. ఇందులో భాగంగా ఇంటర్‌కేడర్ ఉద్యోగోన్నతులకు రెండు వారాల సంస్థాగత శిక్షణ, ఒక సంవత్సరం ఆన్‌జాబ్ శిక్షణ అవసరమని నిర్ణయించింది. వేతన స్కేలు మార్పు లేకుండా మినిస్టీరియల్ సిబ్బందికి ఫీల్డ్ అనుభవం, ఎగ్జిక్యూటివ్ సిబ్బందికి ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ ఇస్తారు. కొత్తగా డిప్యూటీ ఎంపిడిఒలను ఎంపిక చేయనున్నారు. ఇందులో భాగంగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులైన డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు ఫౌండేషన్ శిక్షణ పూర్తయిన తర్వాత కనీసం మూడు సంవత్సరాల పాటు రూర్బన్ పంచాయతీల్లో పిడిఒలుగా సేవలందించాలని, గ్రామ పంచాయతీల పర్యవేక్షణలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి వీరు పాటుపడాలని నిర్ణయించారు. పంచాయతీల్లో డెడికేటెడ్ ఐటి విభాగం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సర్‌ప్లస్ డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బందిని ఉపయోగించి గ్రామ పంచాయతీ రికార్డులను, పరిపాలనా ప్రక్రియలను డిజిటలైజ్ చేయిస్తారు. వర్క్‌ఫ్లో ఆటోమేషన్, రియల్‌టైమ్ పర్యవేక్షణకు ఒక డెడికేటెడ్ ఐటి విభాగాన్ని ఏర్పాటు చేయడానికి డిజిటల్ అసిస్టెంట్ల సేవలను వినియోగించుకుంటారు. కొత్త విధానం ప్రకారం గ్రామ జనాభా, ఆదాయానికి తగ్గ సిబ్బంది అందుబాటులో ఉండేలా పంచాయతీ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించనున్నారు. వార్షికాదాయం ఆధారంగా వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో వర్గీకరించిన క్లస్టర్ విధానానికి స్వస్తి పలికారు. కొత్త విధానంలో మొత్తం పంచాయతీలను స్పెషల్‌తోపాటు మరో మూడు గ్రేడ్లుగా విభజించనున్నారు. పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారి పీడీఓగా పేరు మార్చుతున్నారు. కొత్త విధానంలో ప్రజలకు మెరుగైన సేవలతో పాటు సిబ్బందికి ఎప్పటికప్పుడు పదోన్నతులు లభించనున్నాయి.వైఎస్సార్సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 7 వేల 244 క్లస్టర్ల స్థానంలో 13 వేల 351 గ్రామ పంచాయతీలు స్వతంత్రంగా పని చేసేందుకు వీలుగా చేసిన ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించడంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ తదుపరి చర్యలకు సిద్ధమవుతోంది. కొత్త వ్యవస్థలో మొత్తం 13 వేల 351 మంది కార్యదర్శులు ఉంటారు. స్పెషల్ గ్రేడ్ పంచాయతీల్లో 359, ప్రథమ గ్రేడ్ పంచాయతీల్లో 3 వేల 82, ద్వితీయ గ్రేడ్ పంచాయతీల్లో 3వేల 163, తృతీయ గ్రేడ్ పంచాయతీల్లో 6 వేల 747 మంది సిబ్బంది ఉంటారు. వీరికి అనుబంధంగా స్పెషల్ గ్రేడ్‌లో 18 మంది, ప్రథమ గ్రేడ్‌లో 17 మంది, ద్వితీయ గ్రేడ్‌లో 8 మంది, తృతీయ గ్రేడ్‌లో ఆరుగురు సిబ్బంది సేవలందిస్తారు.

10 వేలకు పైగా జనాభా, కోటి రూపాయల కంటే ఎక్కువ వార్షిక ఆదాయం కలిగిన పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ విభాగంలో చేర్చనున్నారు. అలాగే 5 వేలకు పైగా జనాభా కలిగిన గిరిజన ప్రాంతం కూడా స్పెషల్ గ్రేడ్ కిందికే రానుంది. 3 వేల నుంచి10 వేల లోపు జనాభా ఉండి, 30 లక్షల నుంచి కోటి వార్షిక ఆదాయం ఉండే మండల కేంద్రంలోని పంచాయతీని ప్రథమ గ్రేడ్‌గా పరిగణించనున్నారు. 2 వేల 500 నుంచి 5 వేల జనాభా ఉండే మండల కేంద్ర గిరిజన పంచాయతీనీఈ కేటగిరీలోకే చేర్చనున్నారు. 2 నుంచి 3 వేలలోపు జనాభా ఉండే పంచాయతీని, 15 వందల నుంచి 2 వేల 500 లోపు జనాభా ఉండే గిరిజన పంచాయతీని ద్వితీయ గ్రేడ్‌గా పరిగణించనున్నారు. ఇక 2 వేల లోపు జనాభా కలిగిన పంచాయతీలు, 15 వందల లోపు జనాభా కలిగిన గిరిజన పంచాయతీలను తృతీయ గ్రేడ్ కేటగిరీలోకి చేర్చనున్నారు.స్పెషల్, గ్రేడ్1 పంచాయతీలను పట్టణ తరహా సేవలందించే రూర్బన్ వ్యవస్థగా తీర్చిదిద్దనున్నారు. వీటిలో పురపాలక తరహాలో పరిపాలన, గ్రామీణ ప్రణాళిక, ప్రజారోగ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, ఇంజినీరింగ్ విభాగాలు ఏర్పాటు చేస్తారు. పురపాలక తరహాలోనే ఇళ్లు, భవనాల నిర్మాణానికి అనుమతులు, అక్రమ నిర్మాణాల నియంత్రణకు పంచాయతీల్లో కంట్రీ ప్లానింగ్ ఎగ్జిక్యూటివ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రణాళిక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గ్రేడ్1 పంచాయతీల్లో పనిచేస్తున్న 359 మంది కార్యదర్శుల వేతనశ్రేణి పెంపుతోపాటు డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి క్యాడర్‌లో పదోన్నతి కల్పించనున్నారు. వీరిని రూర్బన్ పంచాయతీల్లో నియమిస్తారు. వీరితో పాటు 359 మంది జూనియర్ అసిస్టెంట్‌కమ్ బిల్ కలెక్టర్ల శ్రేణిని పెంచి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించనున్నారు. మినిస్టీరియల్, క్షేత్రస్థాయి సిబ్బంది పోస్టుల మధ్య పరస్పర ఉద్యోగోన్నతులకు అవకాశం కల్పించనున్నారు.

## రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలని సీఎం చంద్రబాబుకు వినతి

### పరిశీలిస్తామని హామీ ఇచ్చిన సీఎం

**అనంతపురం, అక్టోబర్ 18, ప్రభాతవార్త బ్యూరో:** ఏపీ వెటరన్ జర్నలిస్టుల యూనియన్ నాయకులు శనివారంమంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి, రిటైర్ అయిన జర్నలిస్టులకు పెన్షన్ పథకం ప్రవేశపెట్టమని కోరారు. జర్నలిస్టుగా 20 ఏళ్ల అనుభవం ఉండి, 58 సంవత్సరాలు పూర్తి చేసినవారు రాష్ట్రంలో 500 మందికి మించి ఉండరని తెలిపారు. ఈ పథకం వల్ల ప్రభుత్వానికి పెద్ద ఆర్థిక భారం ఉండదని చెప్పారు. దేశంలో 19 రాష్ట్రాలలో ఈ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రిటైర్ అయిన జర్నలిస్టుల పరిస్థితిని, ఇతర రాష్ట్రాలలో ఇస్తున్న పెన్షన్ వివరాలు, వాటికి సంబంధించిన జీవోలతో కూడిన ఒక వినతి పత్రాన్ని సీఎంకు అందజేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. పరిశీలిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఏపీ వెటరన్ జర్నలిస్టుల యూనియన్ గౌరవాధ్యక్షులు శిరందాసు నాగార్జున రావు, జనరల్ సెక్రటరీ జి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు కాకర్ల వెంకటరత్నం, జి.రామారావు, ట్రెజరర్ ఎంపీ రామారావు తదితరులు ఉన్నారు .





నాగార్జునసాగర్ పర్యటనకు విచ్చేసిన గవర్నర్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

# చిన్నారి వరల్డ్ రికార్డు
## అలవోకగా సంస్కృత శ్లోకాల పఠనం

**శ్రీకాకుళం, అక్టోబరు 18 ప్రభాతవార్త:** సంస్కృత శ్లోకాలను రెండేళ్లు కూడా నిండని చిన్నారి అలవోకగా చెప్పేసి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. శ్రీకాకుళంజిల్లా పలాసకాశీబుగ్గకు చెందిన సీర సంజీవ్, డాక్టర్ వడిశ శాంతిల కుమార్తె సీర మయూరి (22నెలలు) అద్భుత ప్రదర్శన కనబర్చి ఏకధాటిగా 15కు పైగా శ్లోకాలను ఆలపించి నోబుల్ వరల్డ్ రికార్డ్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కైవసం చేసుకుంది. వృత్తిరీత్యా మయూరి తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. చిన్నతనం నుంచే శ్లోకాలు, పద్యాలు పాడేది. ఆమెలోని ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ఆమెకు శ్లోకాల పఠనంలో తర్ఫీదు నిచ్చారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మయూరి 15 శ్లోకాలు వినిపించింది. అత్యంత




పిన్నవయసులో ఈ ఘనత సాధించినందుకుగానూ నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. దీంతో పాటు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుల్లోనూ ఆమె పేరు నమోదైంది. ఇటీవల ఈ చిన్నారికి నిర్వాహకులు ధ్రువపత్రాన్ని అందించారు.

## పోలీసులకు బాదుడు అలవాటా?

>> అందచేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్,సీసీఎస్ ఇనస్పెక్టర్‌కు తదుపరి విచారణకు హాజరు నుంచి మినహాయింపునిచ్చారు. కర్నూలు సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్) పోలీసులు తనను అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురి చేశారని, భాధ్యులైన పోలీసులపై కేసు నమోదు చేసేలా ఆదేశించాలని,చిప్పగిరి గ్రామానికి చెందిన గొల్ల జయపాల్ యాదవ్ 2016లో హైకోర్టులో వ్యాజ్యం వేశారు. ఆ తర్వాత కేసు నమోదు చేసిన పోలీసులు కర్నూలు ఎస్ఐ ఇచ్చిన నివేదికను పరిగణలోకి తీసుకొని అది తప్పుడు కేసుగా పేర్కొంటూ 2018లో ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ బట్టు దేవానంద్...ఏ వివాలను ఆధారం చేసుకుని తప్పుడు కేసుగా తేల్చారన్న వివరాలు కోర్టు ముందు ఉంచలేదన్నారు. తుది నివేదికను దిగువ కోర్టులో దాఖలు చేయకపోవడంపై వివరణ ఇచ్చేందుకు ఎస్పీ,సీసీఎస్ ఇనస్పెక్టర్‌ను తమ ముందు హాజరుకావాలని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన విచారణకు వారిరువురూ హాజరయినట్లు సమాచారం, పిటీషనర్ తరపున సీనియర్ న్యాయవాది వి.రఘునాత్ పోలీసుల తరపున జయంతి వాదనలు వినిపించారు.

## ఓ కుటుంబం కులబహిష్కరణ!

>>తమ కుల ఆచారం ప్రకారం కర్నాటక రాష్ట్రం మొలకల్‌మూర్‌లో సూగేశ్వరస్వామి మఠంలో మన కుటుంబ వివరాల గ్రంథంను పరిశీలించండని కోరానని జోగి వెంకటేష్ తెలిపారు. ఈనెల 9వ తేదీన కుల పెద్దలు మఠంకు వెళ్లి వాటిని పరిశీలించగా తాను సంబంధం కలుపుకుంటున్న వారిది కూడా జోగి కులంగా నిర్ణయించారన్నారు. అయితే చాలా సంవత్సరాలుగా మన 6 గ్రామాల కులస్థులతోనే పెళ్లి చేసుకుంటున్నాము కనుక కొత్తవారితో మన కులం అయినా సంబంధాలు కలుపుకోవద్దని చెబుతూ తన కుటుంబంతోపాటు తన వెంట వచ్చిన వారిని కూడా కుల బహిష్కరణ చేశారని బాధిత జోగి వెంకటేష్ తెలిపారు. తన ఇంట్లో పెళ్లిళ్లు, చావులకు కనీసం తన ఇంటిలో మంచినీళ్లు తాగినా, భోంచేసినా వాళ్లు ఒక లక్ష రూపాయలు తప్పు చెల్లించి 12 సంవత్సరాలు కులబహిష్కరణకు గురి కావాల్సి వస్తుందని తన కుటుంబాన్ని 12 సంవత్సరాలు బహిష్కరించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈక్రమంలో బాధితుడు జోగి వెంకటేష్ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈనెల 13వ తేదీన పిర్యాదు చేయగా వారు విచారణకు ఆదేశించినట్లు సమాచారం. దీపావళి పండుగ తరువాత ఈ విషయమై అధికారులు విచారణ చేసి తగిన ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిసింది.

## బ్రహ్మోస్ కదిలితే పాక్ మసి

>> సైనిక బలగాలకు బ్రహ్మోస్ ఓ పిల్లర్‌లా మారిందన్నారు. ఇది దేశ విశ్వాస సామర్థ్యాన్ని పెంచిందన్నారు. కలలను నిజం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. బ్రహ్మోస్ ఏరోస్పేస్‌లో తయారీ అయిన ఫస్ట్ బ్యాచ్ క్షిపణులకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ పచ్చజెండా ఊపారు. ఈ కార్యక్రమంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పాల్గొన్నారు. బ్రహ్మోస్ ఏరోస్పేస్ నుంచి ఫస్ట్ బ్యాచ్ మిస్సైల్ సిస్టమ్ విజయవంతంగా తయారీ అయ్యినట్లు తెలిపారు. బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్‌ను మే 11వ తేదీన ప్రారంభించారు. మిస్సైల్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్, ఫైనల్ క్వాలిటీ చెకింగ్‌కు కావాల్సిన అన్ని ఆధునిక సదుపాయాలు ఉన్నాయి. విజయవంతంగా టెస్టింగ్ జరిగిన తర్వాత, ఆ మిస్సైళ్లను భారత సైనిక దళాలు మోహరించనున్నాయి. లక్నోలో జరిగిన కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాతక్, మంత్రి నంద గోపాల్ గుప్తా నంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పండుగలా ధాన్యం సేకరణ

>> ఏడాది ధాన్యం కొనుగోలు సమయంలో క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను ఈ ఏడాది ముందస్తు ప్రణాళికలతో పరిష్కరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా గన్ని బ్యాగులు, లేబర్, ట్రాన్స్‌పోర్ట్ వంటి సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గన్ని బ్యాగ్స్ సరఫరాలో దళారులను అరికట్టడానికి జాయింట్ కలెక్టర్లు చొరవ తీసుకోవాలని, దీనికి సంబంధించి జిల్లా పోలీసు శాఖ నుంచి ప్రత్యేక టీమ్‌ విడుదల చేస్తామని తెలిపారు. ఎస్ఓపీ బియ్యం రీసైక్లింగ్‌కు వ్యతిరేకంగా రైస్ మిల్లర్లు ఇచ్చిన హామీని అమలు చేయాలని అధికారులను మంత్రి తెలిపారు.. ఈ అంశాన్ని అగ్రిమెంట్లలో స్పష్టంగా పొందుపరచాలని ఆదేశించారు. పీడీఎస్ కు 60 రోజుల్లో బియ్యం సరఫరా చేసే రైస్ మిల్లులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పర్యవేక్షి స్తామని, ప్రతి అంశం డాష్‌బోర్డులో అందుబాటులో ఉంటుందని చెప్పారు. పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన అధికారులు పిలుపునిచ్చారు. గత ఏడాది అకాల వర్షాల కారణంగా 30,000 టార్పాలను పంపిణీ చేసినట్లు గుర్తు చేస్తూ, ఈసారి కూడా అవసరాన్ని బట్టి ముందస్తుగా టార్పాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వంలో రైతులు ధాన్యం విక్రయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం "ఫార్మర్ ఫ్రెండ్లీ" విధానాల ద్వారా రైతులకు స్వేచ్ఛను కల్పించిందని అన్నారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు, నచ్చిన సమయంలో ధాన్యం విక్రయించుకునే అవకాశం కల్పించామని చెప్పారు. రైతులు సులభంగా వాట్సాప్‌లో హాయ్" పంపడం ద్వారా ధాన్యం విక్రయ ప్రక్రియలో చేరే సౌకర్యాన్ని కల్పించామని, విక్రయించిన 24 నుండి 48 గంటలలోపే రైతు ఖాతాల్లో నగదు జమ చేసిన విషయాలను గుర్తు చేశారు. ఈ వర్క్‌షాప్‌లో పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ , సివిల్ సప్లై కార్పొరేషన్ జుది లీదీ ఢిల్లీ రావు వ్యవసాయ శాఖ ఎండి మంజీర్ జిలాని, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్. గోవిందరావు, విజయ్ కుమార్ యాదవ్, ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని 26 జిల్లాల జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లై , వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పిజి వైద్యవిద్యలో కొత్తగా 106 సీట్లు

>> చివర్లో కూటమి ప్రభుత్వం పీజీ వైద్య విద్యలో అదనపు సీట్ల మంజూరుకు అనుమతి కోరుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసి) కి కళాశాలల వారీగా దరఖాస్తు చేసింది. ఈ మేరకు ఎన్ఎంసీ నుంచి తాజాగా వచ్చిన సమాచారంలో 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కలిపి 106 సీట్లు కొత్తగా వచ్చాయి. మొత్తమ్మీద జనరల్ మెడిసిన్ కోర్సులో 20, గైనిక్లో 20, పీడియాట్రిక్26, ఎనస్థీషియా 12, రేడియాలజీలో 4, ఇతర విభాగాల్లో మరికొన్ని సీట్లు ఎన్ఎంసి మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలకు పీజీ సీట్లు తొలిసారిగా వచ్చాయి. మచిలీపట్నం కళాశాలలో 12, నంద్యాల16, రాజమహేంద్రవరం16, విజయనగరం12, ఏలూరు వైద్య కళాశాలలో నాలుగు చొప్పున సీట్లు కొత్తగా ఎన్ఎంసి కేటాయించింది. గుంటూరు మెడికల్ కళాశాలలో రేడియోలజీ 4, ఆంధ్ర మెడికల్ కళాశాలలో ఎమర్జెన్సీ మెడిసిన్ 4, పీడియాట్రిక్ లో 4 చొప్పున సీట్లు వచ్చాయి. అనంతపురం వైద్య కళాశాలకు 15, కడప 7, కర్నూల్ 4, శ్రీకాకుళం కళాశాలకు 8 చొప్పున సీట్లు అదనంగా వచ్చాయి. రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ కు కేంద్ర ప్రభుత్వంతో ఉన్న పరిచయాలు కూడా రాష్ట్రానికి అధిక సంఖ్యలో సీట్లు వచ్చేందుకు దోహద పడ్డాయి.తిరుపతి స్విమ్స్ మరో 13 పీజీ వైద్య విద్యలో సీట్లకు ఎన్ఎంసీ ఆమోదం తెలిపింది. ఎనస్తీషియా, ఈఎన్టీ, గైనిక్, ఆర్థో, ఆప్తమాలజీ, పీడియాట్రిక్స్ కోర్సుల్లో ఈ సీట్లు ఉన్నాయి.

## అఫ్ఘాన్‌పాక్ యుద్ధం ఆపడంనాకో లెక్కకాదు: ట్రంప్

**వాషింగ్టన్, అక్టోబరు 18:** అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రతరమయ్యాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాకిస్థాన్ అఫ్ఘాన్‌పై వైమానిక బాంబు దాడులు చేసింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. రెండుదేశాలమధ్య యుద్ధం ఆపడం దాడులు కట్టడిచేయడం తనకో లెక్కకాదని చాలా సులువు అని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే డ్యురాండ్ లైన్ వెంబడి అఫ్ఘాన్‌లోని పాక్టికా ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాల్లో పాక్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడిలో ముగ్గురు అఫ్ఘాన్ దేశవాళీ క్రికెటర్లు సహా మొత్తం పది మంది మరణించారు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు.

## వారం - వర్జ్యం

19-10-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
త్రయోదశి మ. 1.54
ఉత్తరఫల్గుణి సా. 5.51
వర్జ్యం : రా. 3.07-తె. 4.52
దు.సా. 4.07-సా. 4.54
శుభసమయం:ఉ. 6.00-7.00,సా. 7.00-8.00
రాహుకాలం - సా. 4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. తొందరపాటు వద్దు.

**వృషభం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. ః వాహనసౌఖ్యం.

**మిథునం:** సాంకేతిక విద్యావకాశాలు లభిస్తాయి. ప్రయాణాలు.

**కర్కాటకం :** పరిశ్రమలలో ఎదురైన ఆటంకాలు పరిష్కార దశకు వస్తాయి.

**సింహం:** క్రయ విక్రయాలలో ః లాభాలు రావు. ఉద్యోగులకు బదిలీలు.

**కన్య :** అనుకోని అవకాశాలు లభిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**తుల :** బాధ్యతాయుతంగా ప్రవర్తించి కార్యాలయంలో గౌరవాన్ని పెంపొందించుకుంటారు.

**వృశ్చికం:** జీవితభాగస్వామితో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి.

**ధనుస్సు:** తరచు దూర ప్రాంత ప్రయాణాలు చేయవలసి రావడం వలన శ్రమ అధికమవుతుంది.

**మకరం:** నిలకడ లేని గెలుపు కన్న దైవాన్ని బాగా నమ్ముకొని లాభపడుతారు.

**కుంభం:** మిత్ర వర్గంతో కలిసి చర్చలు సాగిస్తారు, వ్యాపారానుకులత బాగుంటుంది.

**మీనం :** అధిక సర్దుబాటులు ఎంతో నేర్పుగా చేస్తారు. అనేక విషయాలలో సంయమనం పాటిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## వచ్చే నెల డిఎ

>>రాష్ట్రాన్ని తదుపరి అభివృద్ధి స్థాయికి తీసుకెళ్లగలం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మరోవైపు సీఎంతో భేటీకి ఏపీఎన్జీవో, ఏపీజేఏసీ అమరావతి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, సచివాలయ ఉద్యోగ సంఘం సహా ఉపాధ్యాయ సంఘాల నేతలు హాజరయ్యారు. అటు మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## అల్పపీడనం

>> ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసేప్పుడు ప్రజలు చెట్ల క్రింద నిలబడరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారంసాయంత్రం 5గంటలకు విజయనగరం(జి) నెల్లిమర్లలో 49.7మిమీ, కృష్ణా(జి) ఘంటసాలలో 44.7మిమీ, తిరుపతి(జి) 27.7మిమీ వర్షపాతం నమోదైందని తెలిపారు.

## నాగార్జునసాగర్‌లో గవర్నర్ నజీర్ పర్యటన

>> త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ నారాయణ అమిత్‌లు గవర్నర్ దంపతులకు పుష్పగుచ్ఛమిచ్చి ఘన స్వాగతం పలికారు ఆ తర్వాత వీరు పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం నేరుగా స్థానిక లాంచి స్టేషన్ కు బయలుదేరి నాగార్జున కొండను సందర్శించి అక్కడ పురావస్తు శాఖ మ్యూజియాన్ని సందర్శించి అక్కడి బుద్ధుని విశేషాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత సాయంత్రం తెలంగాణ పర్యాటక శాఖ విజయ విహార్ గెస్ట్ హౌస్ లో బస చేసి తిరిగి ఆదివారం ఉదయం నాగార్జునసాగర్ ప్రాజెక్టు, బుద్ధవనాన్ని సందర్శించి మధ్యాహ్నం మూడు గంటలకు ఆంధ్రప్రదేశ్ బయలుదేరనున్నారు.

## పిఎం కిసాన్ పక్కదారి

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ కింద ఇచ్చే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం ద్వారా దేశవ్యాప్తంగా కోట్లాది మంది లబ్ది పొందుతున్నారు. ఇప్పటికే 20 సార్లకు పైగా కేంద్రం ఈ నిధుల్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. కేంద్రం ఇస్తున్న డబ్బులకు తమ వంతుగా కొంత డబ్బులు జమ చేసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇస్తున్నాయి. అయితే ఇందులోనూ అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంతో కేంద్రం అప్రమత్తమైంది. దీంతో పీఎం కిసాన్ నిధుల లబ్ధిదారుల ఖాతాల్ని పరిశీలిస్తోంది. ఇందులో 31 లక్షల ఖాతాలపై కేంద్రం అనుమానాలు వ్యక్తం చేసింది. వీటిలో తాజాగా దాదాపు 19.02 లక్షల మంది లబ్దిదారుల ఖాతాల్ని తనిఖీ చేయగా వీటిలో దాదాపు 93 శాతం ఖాతాల్లో అంటే 17.87 లక్షల మంది అనర్హత లేని భార్యా భర్తలైన లబ్దిదారులు ఇద్దరూ వేర్వేరుగా ఈ పథకం కింద వస్తున్న డబ్బుల్ని అక్రమంగా తీసుకుంటున్నట్లు తేలింది.



# స్వచ్ఛతలో దేశంలోనే ఉత్తమం శ్రీకాకుళం

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** శ్రీకాకుళం కార్పోరేషన్ పరిధి అసరవల్లి నుండి ఖాజీపేట రహదారిలో స్వచ్ భారత్, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి పరిసరాలను శుభ్రం చేశారు. రోడ్డును ఆనుకుని మొక్కను నాటారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం మొత్తం మూడవ శనివారం స్వచ్ఛంధ్ర కార్యక్రమం పంచాయితీ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ జరుగుతూ లక్ష్యాల సాధన దిశగా సాగుతోందని స్పష్టం చేశారు. స్వచ్ఛత మన నిజ జీవితంలో భాగం కావాలని మన ప్రతీ ఆలోచనలో కూడా స్వచ్ఛత ఉండాలని రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. నేడు వాయు కాలుష్య నివారణ థీమ్‌తో స్వచ్ఛ భారత్ కార్యక్రమం జరుగుతోందని, పట్టణీకరణ పెరిగిన నేపథ్యంలో వాయు కాలుష్యం కూడా పెరుగుతూ ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఢిల్లీ ఈ తరహా వాయు కాలుష్య ఇబ్బందితో బాధపడుతూ ఉందని తెలిపారు. ఇప్పటికే ఈ సమస్యపై మేల్కొని కాలినడక, సైకిల్ వాడకంపై దృష్టి సారించాలని కోరారు. డస్ట్ పొల్యూషన్ కూడా వాయు కాలుష్యానికి మరో కారణం అని, నిర్మాణాలు చేపట్టే సమయంలో చుట్టూ పరదాలతో కప్పి ధూళిని నియంత్రించాలని కోరారు. తల్లి పేరుపై ఓ చెట్టు నాటాలి అనే బృహత్తర కార్యక్రమానికి ప్రధాని మోదీ పిలుపునిచ్చారనీ, మన కుటుంబాలలో జరిగే శుభకార్యాలలో సైతం పర్యావరణ హితమైన కార్యక్రమాలు చెయ్యడం అలవాటు చేసుకోవాలని కోరారు. గత సీజన్లో శ్రీకాకుళంలో ఇరవై ఐదు లక్షలలో పైగా మొక్కలను నాటడం జరిగిందని, ఇవి సమీప భవిష్యత్తులో మంచి ఫలితాలు ఇస్తాయని స్పష్టం చేశారు. శనివారం అరసవల్లి పరిసరాల్లో స్వచ్ఛతహి సేవ కార్యక్రమం ద్వారాఇటు పర్యావరణం బాగు అవ్వడంతో పాటు మైదానం కూడా అందుబాటులోకి వచ్చిందని అన్నారు. దేశంలోనే టాప్ 10లో శ్రీకాకుళం నిలవాలనే లక్ష్యంతో ముందుకు వెళ్దామని రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలో సైక్లింగ్ ట్రాక్‌లు అందుబాటులోకి తీసుకువచ్చి ఇటు పర్యావరణానికి, అటు ఆరోగ్యానికి మేలు కలిగేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. సండేను అందరూ సైకిల్‌డేగా మార్చుకోవాలని కోరారు. గూగుల్ విశాఖకు రావడం చారిత్రాత్మకం అన్న రామ్మోహన్ నాయుడు ఈ విషయంలో కొందరు విమర్శలు చేస్తుండటం బాధాకరం అని అన్నారు. ఇండస్ట్రియల్ హబ్‌గా మారడం ద్వారా పవర్ ఇండస్ట్రీ, ఫుడ్ ఇండస్ట్రీ, టూరిజం ఇండస్ట్రీలు కూడా ఏర్పాటు అవుతాయని, తద్వారా 1.88 వేల మందికి ఉద్యోగాల కల్పన సాధ్యం అవుతుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. అన్ని జిల్లాలకు సమాంతరంగా ఐటి విప్లవం విస్తరిస్తోందని, నా వరకు కూడా జిల్లాకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. పలాస విమానాశ్రయ ఏర్పాటు కోసం అందరితో కలసి ముందుకు వెళ్తున్నామని అందరికీ న్యాయం చేసే అడుగు ముందుకు వేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఈఓ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## రేపు ఆలయంలో దీపావళి ఆస్థానం - ఆర్జిత సేవలు రద్దు



**తిరుమల,అక్టోబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపావళి ఆస్థానం సోమవారం (రేపు)ఆగమోక్తంగా నిర్వహిస్తున్నారు. దీపావళిపండుగ సందర్భంగా ఈ వైదిక కార్యక్రమం చేపడతారు. దీపావళిరోజు సోమవారం ఉదయం బంగారువాకిలిలో ఘంటా మండపంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఆస్థానంలో భాగంగా మలయప్పస్వామి శ్రీదేవిభూదేవులతో కలసి ఘంటా మండపంలో ఏర్పాటుచేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపుచేస్తారు. సేనాధిపతి విశ్వక్సేనులు స్వామివారి ఎడమపక్కన మరొక పీఠంపై దక్షిణ అభిముఖంగా వేంచేపుచేస్తారు. ఆ తరూవాత స్వామికి ప్రత్యేక పూజ,హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది. సాయంత్రం ఉత్సవర్లు సహస్రదీపాలంకారసేవలోపాల్గొని ఆలయ మాఢవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. కాగా సోమవారం దీపావళి ఆస్థానం సందర్భంగా ఆలయంలో జరిగే కల్యాణోత్సవం,ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలు రద్దయ్యాయి. సుప్రభాతం, అర్చన,తోమాల సేవలు ఏకాంతంగా జరుగుతాయి.

## ముద్రణాలయంలో ఆయుధపూజ




**తిరుమల,అక్టోబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** దార్మికసంస్థ టిటిడి సమాచార విభాగంలో కీలకమైన ముద్రణాలయంలో శనివారం ఉదయం ఆయుధపూజ ఘనంగా జరిగింది. టిటిడి పరిపాలన భవనం ఎదురుగా ఉన్న ఈ ముద్రణాలయాన్ని అందంగా అలంకరించి అర్చకులు పూజలు చేశారు. అనంతరం డిటిపి, ఆఫ్‌సెట్; మిషన్‌సెక్షన్, ఆర్టిస్టు, బైండింగ్ విభాగాల్లోని యంత్రాలకు పూజలు నిర్వహించారు. ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, ముద్రణాలయం డిప్యూటీ ఇఒ విజయకుమార్, పిఆర్‌ఒ నీలిమ,యూనియన్‌నాయకులు శ్రీనివాసన్, వికె శ్రీనివాసులు, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి



**తిరుమల,అక్టోబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందరిపై ఉండాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. పెరటాసిమాసం చివరిశనివారం ఉదయం తిరుమలకు వచ్చిన పలువురు ప్రముఖులు కేంద్ర సహాయమంత్రి ఎల్.మురుగన్, ఎమ్మెల్యేలు కళావెంకట్రావు, జైసూర్య, కర్నాటక బెంగూళూరు ఎమ్మెల్సీ గోవిందరాజు కుటుంబంతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దళారులను నమ్మొద్దు - అనుమానం వస్తే 155257కు చేయండి!




**తిరుమల,అక్టోబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదమొక్కులవాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలు, వసతి కల్పిస్తామని దళారులు ఎవరైనా మాయమాటలు చెప్పినా నమ్మొద్దని, అనుమానం వస్తే 155257 టోల్‌ఫ్రీనంబర్‌కు తెలియజేయాలని టిటిడి విజ్ఞప్తి చేసింది. టిటిడి ఉద్యోగులు, అర్చకులపేరుతో కొందరు దళారులు మాయమాటలు చెప్పి భక్తులను మోసం చేస్తున్నారనేది ఫిర్యాదులు అందాయన్నారు. టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు అందిన ఫిర్యాదులతో భక్తులు ఎవరూ కూడా శ్రీవారి దర్శనం, ఆర్జితసేవలు, వసతి కోసం దళారులను నమ్మిమోసపోవదద్దని కోరారు. నకిలీ వ్యక్తుల నుండి భక్తులు డబ్బులు ఇవ్వరాదని, దళారులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులు దర్శనం, వసతి,ఆర్జితసేవలకు "టిటిడిదేవస్థానమ్స్.ఏపి.జిఓవి.ఇన్‌లోనే బుక్‌చేసుకోవాలన్నారు. తిరుమలను శుభ్రంగా ఉంచడానికి అందరూ సహకరించాలని కోరారు. ఇటీవల అశోక్ అనే దళారీ తెలంగాణ భక్తుల నుండి నాలుగులక్షలు రూపాయలువసూలుచేసి పరారైన ఉదంతంతో టిటిడి విజ్ఞప్తిచేసింది.

# బ్రహ్మోత్సవ బహుమానం పెంపుపై వీడని సందిగ్ధత!

## - రూ.18వేలు ఇవ్వాలంటున్న ఉద్యోగ సంఘాలు



**తిరుమల,అక్టోబర్ 18ప్రభాతవార్తప్రతినిధి::** నిత్యకల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ఏడాదిలోవరుసగా తొమ్మిదిరోజులు జరిగే సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఇటీవల దిగ్విజయంగా ముగిశాయి. అశేష సంఖ్యలో దేశం నలుమూలల నుండి తరలి వచ్చిన భక్తులకు చిన్నపాటి అసౌకర్యం, లోటుపాట్లు లేకుండా చక్కటి ఏర్పాట్లుచేసిన టిటిడి యంత్రాంగం ,ఉద్యోగులు, జిల్లా యంత్రాంగం పనితీరును స్వయంగా సిఎం చంద్రబాబు నాయుడు కూడా ప్రశంసించారు. ఇదే సమయంలో ఈ ఏడాది బ్రహ్మోత్సవాల బహుమానం కూడా టిటిడి ఉద్యోగులకు 18వేల రూపాయలు మంజూరు చేయాలనేది టిటిడి ఉద్యోగ సంఘాల విజ్ఞప్తులు. గత ఏడాది 15,400 రూపాయలు బ్రహ్మోత్సవ బహుమానం అధికారులు మంజూరుచేశారు. ఈ ఏడాది టిటిడి ధర్మకర్తలమండలి ఉండటంతో తమకందరికీ, తమ సేవలకు గుర్తింపుగా కొంత వరకు పెంచి బహుమానం ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నాయకులు చీర్లకిరణ్, నాగార్జున, వెంకటేశ్,రవికుమార్, పవన్ తదితరులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి ఏడాడి బ్రహ్మోత్సవాల అనంతరం ఉద్యోగులకు గౌరవార్థంగా ఆన వాయితీగా బహుమానం మంజూరుచేయడం జరుగుతుంది. ఈ ఏడాది తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాల్లో 16 వాహనసేవలను,మూలవిరాట్టును లక్షలాదిమంది భక్తులు ప్రశాంతంగా, సంతోషంగా వీక్షించడంలో ఉద్యోగుల సేవలు అనిర్వచనీయమనేది ఉద్యోగుల నేతలు నొక్కివక్కాణిస్తున్నారు. సెప్టెంబర్ 24వతేదీ నుండి అక్టోబర్ 2వరకు తొమ్మిదిరోజులు పాటు 7.30లక్షల మంది భక్తులు మూలవిరాట్టును,వాహనసేవలను దర్శనం చేసుకున్నారు. కానుకల ద్వారా హుండీ ఆదాయం 30.51కోట్ల రూపాయలు చేకూరింది. గరుడసేవరోజుమాత్రమే మూడులక్షలమంది భక్తులు గరుడసేవను గ్యాలరీల్లోఉండి వీక్షించడం ప్రత్యేకత. 26లక్షలమందిపైగా భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీచేశారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను సమష్టిగా అందరి సహ కారంతో విజయవంతంగా నిర్వహించామనేది టిటిడి బోర్డు, అధికారులు అభిప్రాయం. టిటిడిలో 6,800మంది వరకు వివిధ హోదాల్లో శాశ్వత ఉద్యోగులు పనిచేస్తున్నారు.

## కల్తీ మద్యం సూత్రధారులు, పాత్రధారులకు చుక్కలు చూపిస్తాం : మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,అక్టోబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** కల్తీ మద్యంలో సూత్రధారులు,పాత్రధారులందరికీ చుక్కలు చూపిస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. మద్య నిషేధం అమలు చేశాకే 2024లో ఓట్లు అడుగుతామని చెప్పి,కల్తీ మద్యం అమ్మిన నీచ చరిత్ర వైకాపాదని ధ్వజమెత్తారు. పేర్ని నానికి మతి భ్రమించి ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదన్నారు. రూ.99 బ్రాండ్లు నిలిపివేశామనడం అతని అజ్ఞానానికి నిదర్శనమని దుయ్యబట్టారు. డిజిటల్ పేమెంట్లు ఎవరి హయాంలో లేకుండా చేశారో ప్రజల్ని అడిగితే చెబుతారన్నారు. ఇండెంట్ ప్రకారమే మద్యం సరఫరా చేస్తారనే కనీస జ్ఞానం లేదా? అని ప్రశ్నించారు. గత ఐదేళ్ళు కల్తీ మద్యం అమ్మిందెవరో ప్రజలు గుర్తించే వైకాపాను తరిమికొట్టారని తెలిపారు. ములకల చెరువు,ఇబ్రహీంపట్నం ఘటనల విచారణ పారదర్శకంగా జరుగుతోందని వెల్లడించారు. సిట్ విచారణను కూడ తప్పుదోవ పట్టించేలా వైకాపా సోషల్ మీడియా కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా నేతల ప్రోత్సాహంతోనే కల్తీ మద్యం తయారు చేసినట్లు జనార్ధనరావు అంగీకరించాడన్నారు. ప్రభుతాన్ని అస్థిరపర్చేందుకే కల్తీ మద్యం తయారుచేసినట్లు అంగీకరించాడని వ్యాఖ్యానించారు. హోలోగ్రామ్,ట్రాక్ అండ్ ట్రేస్ విధానం 2014-19లోనే తీసుకొచ్చామని గుర్తు చేశారు.

## ఎపిఎస్ఐడిసిలో 8 సబ్ డివిజన్ల మూసివేత

### ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**విజయవాడ,అక్టోబరు 18,పభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ పరిధి లోని 8 సబ్‌డివిజన్‌లను మూసివేసేందుకు వీలుగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇందులో పనిచేస్తున్న రెగ్యులర్ సిబ్బంది ఎస్ఈ క్యాడర్ వరకు ఉన్నవారిని, పొరుగుసేవల సిబ్బందిని జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ (సీఈ)లకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కొవ్వూరు, రాజమహేంద్రవరం, మాచర్ల, చిలకలూరిపేట, నందిగామ, జగ్గయ్యపేట ,అనంతపురం, నందికొట్కూరు సబ్ డివిజన్లను మూసేస్తారు. ఈ కార్యాలయాలన్నీ అద్దె భవానాల్లోనే కొనసాగుతున్నాయి. కార్పొరేషన్‌కు బడ్జెట్ లేకపోవడంతో పాటు ఆయా పథకాలు చేపట్టే సమయంలో అందులో 15% నిర్వహణ వ్యయం కింద ఈ కార్పొరేషన్‌కు చెల్లిస్తారు. ప్రస్తుతం ఆ రూపేణా నిధులు రాకపోవడంతో సిబ్బందికి జీతాలు ఇవ్వడం కష్టమైంది. చాలా నెలలుగా వీరికి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ డివిజన్ల పరిధిలో ఉన్న ఎత్తిపోతల పథకాలనూ సీఈల పరిధిలోకి తీసుకువస్తున్నారు. ఈ సిబ్బందికి అవసరమైన జీతాలు,నిర్వహణ ఖర్చులు ఏడాదికి రూ.12 కోట్లు చిన్న నీటిపారుదల విభాగం సీఈ నుంచి బడ్జెట్ కేటాయించేలా ఏర్పాటు చేసేందుకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులిచ్చారు. ఈ కార్పొరేషన్‌ను 1974లో ఏర్పాటు చేశారు. ఈ సంస్థ కింద 1,007 ఎత్తిపోతల పథకాలున్నాయి. 8.31 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఇవి నీరందిస్తాయి.

కార్పొరేషన్‌లో 22 మంది రెగ్యులర్ సిబ్బంది,మరో 155 మంది పొరుగుసేవల సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ కార్పొరేషన్ చేసే పనుల విలువలో 15% నిర్వహణ ఖర్చులకు వినియోగిస్తున్నారు.

ఈ కార్పొరేషన్ ఎండి ఆధ్వర్యంలో రిజిష్టర్ కార్యాలయాన్ని సంబంధిత సిబ్బందితో కొనసాగిస్తారు. 2014 రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ప్రకారం తుది విభజన జరిగే వరకు ఈ సంస్థలో సాంకేతిక, పాలనాపరమైన కార్యకలాపాలు కొనసాగుతాయి. చిన్న నీటిపారుదల, మధ్యతరహా నీటిపారుదల విభాగం చీఫ్ ఇంజినీరు వై.శ్రీనివాస్‌కు ఏజీ విజిలెన్స్ కమీషన్ లోని చీఫ్ టెక్నికల్ అధికారిగా అదనపు భాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

# పరకామణి చోరీ కేసు వివాదం

## ఎందరికి గుదిబండో!? - సిఐడి విచారణకు దిగితే ఏం జరగనుందో!? - టిటిడి, పోలీస్, విజిలెన్స్ వర్గాల్లో అంతర్మథనం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకలుగా హుండీకి సమర్పించుకునే కరెన్సీ నోట్లు,నాణేలు వేరుచేసి లెక్కించే పరకామణిలో 2023లో జరిగిన చోరీ ఉదంతం ఇప్పుడు ఎందరికి గుదిబండగా మారనుందనే ఆందోళన సర్వత్రా చర్చ మొదలైంది. ఈ వ్యవహారంలో తొలినుండి అటు టిటిడి విజిలెన్స్,గత టిటిడి బోర్డుపెద్దలు, టిటిడి ఉన్నతాధికారి, కొందరు పోలీసు అధికారులు కలసి క్రిమినల్ కేసును లోక్‌అదాలత్‌లో మధ్యవర్తిత్వం జరిపి రాజీకుదుర్చడం వెనుక పెద్ద తతంగమనే నడిచిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు వందకోట్లరూపాయలుపైగానే పరకామణిలోనుండి అమెరికా విదేశీ డాలర్లు చోరీ చేసి అక్రమంగా ఆస్తులు కూడగట్టినట్లు ఆరోపణలు వినిపించడం, ఇందులో కేవలం 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను నేరస్తుడి నుండి వేంకటేశ్వరస్వామికివిరాళంగా అందించామని బోర్డులో తీర్మానం చేయడం వంటివి ఇప్పుడు హైకోర్టు ముందు కీలకంగా రానున్న చర్చ. ఈ బాగోతంపై హైకోర్టు న్యాయమూర్తి తీర్పు ఎలా ఉండబోతోందనేది అందరిలోనూ అంతర్మథనం మొదలైంది. సాధారణంగా దేవుని సొమ్మును కాజేసిన వాడెవడైనా చట్టప్రకారం శిక్షించాల్సిన బాధ్యత పోలీసుశాఖపై ఉంది. అయితే 2023లో తిరుమలలో విజిలెన్స్ విభాగం కూడా అప్పటి చోరీ కేసు సిసిపుటేజీలు మాయం చేశారనేది ఇప్పుడు గుప్పుమంటోంది. హైకోర్టు ఈ కేసును తిరిగి దర్యాప్తుకు సిఐడికి అప్పగిస్తే ఎవరెవరినీ విచారణ చేయనున్నారు?ఎందరి హస్తం ఉందనేది ?ఒక్కొక్కరు ఏ మేరకు నిందితుడు రవికుమార్ నుండి లాభపడ్డారనేది కూడా వెలుగుచూడనుంది.. పరకామణి కుంభకోణంపై తొలినుండి వివాదమే రగులుతున్నా గత వైసిపి ప్రభుత్వంలో, టిటిడి బోర్డులో పెద్దల అండతో ఏమీ పట్టించుకోలేదనేది ప్రధాన ఆరోపణలు. ఇటీవల కొందరు ఈ వ్యవహారంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో పోలీసుల నుండి రికార్డులు స్వాధీనం చేసుకుని హైకోర్టుకు సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశాలను పట్టించుకోకపోవడం కూడా విమర్శలకు తావిస్తోంది.

## నేటి నుంచి సీమ మీదుగా ఇంకొన్ని పండుగ ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 18, ప్రభాత వార్త:** ప్రస్తుత పండుగల సీజన్ లో ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ రాయలసీమ జిల్లాల మీదుగా వివిధ ప్రాంతాలకు నేటి నుంచి పండుగ ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి గుల్బర్గా నుంచి ధర్మవరం యశ్వంతపూర్ వెళ్ళే నెంబర్ 06204 ప్రత్యేక ఎక్స్ ప్రెస్ ఈనెల 19న ఆదివారం ఉదయం 09:35 గంటలకు గుల్బర్గా నుంచి బయలుదేరి అదే రోజు రాత్రి 08:30 గంటలకు యశ్వంతపూర్ చేరుకుంటుంది. మార్గమధ్యంలో ఈరైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు,ఆదోని, మంత్రాలయం, రాయచూరు, క్రిష్ణా,యాద్గిర్, షాహ్ బాద్ స్టేషన్లలో నిలుస్తోంది.

**యశ్వంతపూర్‌బనారస్ ప్రత్యేక రైళ్లు:** 19,26 తేదీల్లో ఆదివారాల్లో యశ్వంతపూర్ నుంచి బనారస్ కు బయలుదేరే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ యశ్వంతపూర్ నుంచి ఉదయం 07:00 గంటలకు బయలుదేరి, బనారస్‌కు 05:00 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బనారస్ నుంచి బెంగళూరు కంటోన్మెంట్‌కు బయలుదేరే ప్రత్యేక రైలు 22,29 తేదీల్లో బనారస్ నుంచి బయలుదేరి, బెంగళూరు కంటోన్మెంట్ చేరుకుంటుంది.

## పరిశుభ్రత జీవన విధానంలో భాగం కావాలి

### - సమాచార పౌర సంబంధాల సంచాలకుడు కె ఎస్ విశ్వనాథన్



స్వచ్ఛమైన గాలిపై ప్రతిన చేయిస్తున్న సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుడు విశ్వనాథన్

**విజయవాడ,అక్టోబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:** మన ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. పరిశుభ్రత మన జీవన విధానంలో ఒక భాగం కావాలని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛమైన గాలి (క్లీన్ ఎయిర్) ఇతివృత్తంతో శనివారం నగరంలోని ఎన్టీఆర్ పరిపాలనా భవనంలో ఉన్న సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ ఉద్యోగులతో కలిసి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంచాలకులు మాట్లాడుతూ మన పరిసరాల పరిశుభ్రత, మనం కూర్చునే ప్రదేశంలో స్వచ్ఛతను ఉద్యోగులు విధిగా పాటించటం వల్ల రాష్ట్రం, దేశం పరిశుభ్రంగా మారుతాయన్నారు. దీనివల్ల ఆఫీసు ఆవరణలో మంచి గాలి, వెలుతురు లో పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. పేపర్ రహిత విధానంలో కార్యాలయ కార్యకలాపాలు నిర్వహించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని దీనివల్ల పేపర్, ప్లాస్టిక్ వాడకం తగ్గించటం వల్ల పర్యావరణహితానికి తోడ్పడిన వాళ్లమోతామన్నారు. కార్యాలయ పరిసరాల్లో వినియోగంలో లేని ఎలక్ట్రానిక్ పరికరాలను అవసరమైతే చిన్నపాటి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని సాధ్యంకాని పక్షంలో తొలగించాలన్నారు. వినియోగంలో లేని పాత కంప్యూటర్లు, ప్రింటర్లు వంటి ఈ వేస్ట్ ను శాస్త్రీయ పద్ధతిలో తొలగించాలన్నారు.

## గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ప్రభుత్వ విధి విధానాలపై స్పష్టత - జాబ్ చార్ట్ విడుదల చేసిన ప్రభుత్వం

**విజయవాడ,అక్టోబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ప్రభుత్వ విధి విధానాలపై స్పష్టతను ఇచ్చింది. వారి పని ఒత్తిడి తగ్గించే దిశలో జాబ్ చార్ట్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో క్షేత్రస్థాయిలో ప్రజలకు 24 అందుబాటులో ఉండే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది. అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు వారికి పనులు చెబుతున్నారు. ఇది ఒత్తిడి పెంచుతోంది. దీని నుంచి వారిని బయటపడేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏఏ పనులు చేయాలనే విషయాలపై క్లారిటీ ఇస్తూ జాబ్ చార్ట్‌ను విడుదల చేసింది. అంతకు మించి పనులు ఇస్తే వాటిని రద్దు చేయొద్దని కూడా పేర్కొంది. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. వారి వద్ద ఆ ప్రాంత డేటా ఉంటుందన్న కారణంతో అన్ని శాఖల అధికారులు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిపై ఆధారపడుతున్నారు. దీంతో వారు ఒకే సమయంలో వివిధ శాఖల పనులు చేయాల్సి వస్తోంది. ఇది వారిని మానసికంగా కుంగదీయడమే అన్నారు.

# 21 నుంచి 31 వరకు పోలీసు సంస్మరణ దినోత్సవాలు : డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

## - విజయవాడలో ఓపెన్ హౌస్ (ఎగ్జిబిషన్) పేరుతో అవగాహన కార్యక్రమాలు

**విజయవాడ, అక్టోబర్ 18, ప్రభాతవార్తప్రతినిధి::** దేశ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కోసం శాంతి భద్రతల పరిరక్షణలో అసాంఘిక శక్తులతో ప్రతి రోజూ ధైర్యంగా పోరాడుతూ తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పోలీసు సిబ్బందికి నివాళులర్పించేందుకు అక్టోబర్ 21వ తేదీని "పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం"గా నిర్వహిస్తున్నట్లు ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ దినం పోలీసు సేవలో అత్యున్నత త్యాగం చేసిన వీర జవాన్లను స్మరించుకునే రోజు మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడటానికి వారు చూపిన సేవా భావానికి చిహ్నం. 1959 అక్టోబర్ 21న లడాఖ్ ప్రాంతంలోని హాట్ స్ప్రింగ్స్ వద్ద భారత సరిహద్దులను కాపాడుతున్న దిళిశినీ విభాగానికి చెందిన సబ్ ఇన్స్పెక్టర్ కరమ్ సింగ్ నేతృత్వంలోని పెట్రోల్ పార్టీపై చైనా దళాలు ఆకస్మికంగా మెరుపుదాడి చేశాయి. ఆ సమయంలో అత్యంత ప్రతికూల వాతావరణంలో, సముద్రమట్టానికి 16,000 అడుగుల ఎత్తులో, ఆ పార్టీకి చెందిన పది మంది ధైర్యవంతమైన జవాన్లు శత్రువుతో చివరి శ్వాసవరకు పోరాడి వీరమరణం పొందారు. వారి అమరత్యాగాన్ని స్మరించుకునే సూచకంగా అక్టోబర్ 21వ తేదిని దేశం మొత్తం "పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం"గా పాటించడం జరుగుతోంది. ఈ నెల21 న ప్రారంభమయ్యే సంస్మరణ కార్యక్రమాలు జాతీయ ఐక్యతా దినోత్సవం ఈ నెల 31న ముగుస్తాయి. అన్ని పోలీసు జిల్లాలు/కమిషనరేట్లు, బెటాలియన్లు మరియు శిక్షణ కళాశాలలు/కేంద్రాలలో ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. 2. దేశ భద్రత కోసం వారు చేసిన త్యాగాల గురించి సమాజంలో అవగాహన కల్పించేందుకు అమరవీరుల స్మారకార్థం పోలీసు సిబ్బంది ఈ రోజుల్లో వరుస కార్యక్రమాలను చేపడతారు. అక్టోబర్ 21వ తేదీన 6వ బెటాలియన్, మంగళగిరిలో స్మృతి పరేడ్ నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా దేశంలో గత సంవత్సరంలో ప్రాణాలను అర్పించిన సిబ్బంది అందరి వివరాలను చదివి శ్రద్ధాంజలి ఘటిస్తారు. స్మృతి పరేడ్ ఆవరణలో అసువులు బాసిన అమరుల చిత్రపటాలను ప్రదర్శించడంతో పాటుగా వారు ప్రజా శ్రేయస్సు కోసం శాంతి భద్రతల స్థాపనకోసం చేసిన కృషిని కథనాల రూపంలో ప్రదర్శించడం జరుగుతుంది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ అధికారులు రోజువారీ విధుల్లో, రెస్క్యూ ఆపరేషన్లలో, ప్రకృతి విపత్తులలో చేసిన ఉత్తమ పనితనాన్ని కూడా ఫోటోల రూపంలో ప్రదర్శించడం జరుగుతుంది. అలాగే పోలీస్ అధికారులు తమ అధికార పరిధిలోని అమరవీరుల పోలీసు సిబ్బంది గ్రామాలు/పట్టణాలు/పాఠశాలలను సందర్శిస్తారు మరియు అక్టోబర్ 22 నుండి 30 మధ్య కాలంలో సంబంధిత పోలీస్ స్టేషన్లలో వారి ఫోటోలను ఉంచడం, అమరులయిన పోలీసుల త్యాగాలను, వారు సమాజహితం కోసం చేసిన గొప్ప పనులను స్థానిక ప్రజానీకానికి వివిధ మాధ్యమాల ద్వారా తెలియజేస్తారు. పోలీసు అమరవీరుల త్యాగాలను తెలియజేస్తూ అక్టోబర్ 22 నుండి 31 వరకు విజయవాడలో "ఓపెన్ హౌస్" (ఎగ్జిబిషన్) పేరుతో అవగాహన కార్యక్రమం.



మావోయిస్టుల కట్టడికి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తనవంతుగా పోలీసు విభాగాలకు సహాయం అందించడం మరో విశేషం. ఈ విషయంలో తెలంగాణ పోలీసు తరపున మొదటి అడుగు పడగా ఆ తరువాత ఇతరరాష్ట్రాలు కూడాలబ్ధిపొందాయని చెప్పాలి. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిషా, ఛత్తీస్‌ఘడ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలలో మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా వుండగాఈ సమస్య నుంచి గట్టేందుకు ఆయా రాష్ట్రాలు అనేక ఇబ్బందులు పడ్డాయి. అయితే వై.ఎస్‌రాజశేఖర్ రెడ్డి ఉమ్మడిఎపికి సిఎంగావున్న సమయంలో జరిగిన చర్చలు, అనంతర పరిణామాల నేపథ్యంలో నక్సలైట్ల ఉనికి చాలావరకు తగ్గింది. ఇదే సమయంలో నల్లమల అడవుల్లోని అనేక



ప్రాంతాలలో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో అనేకమంది మావోయిస్టుఅగ్రనాయకులు హతమవడం, ఇదే సమయంలో చాలామందిమావోయిస్టులు లొంగిపోవడం జరిగాయి. ఇలా జరగడానికి అప్పట్లో ఉమ్మడి ఎపి పోలీసు విభాగం ఉపగ్రహాల సహాయం తీసుకోవడం కారణమని హక్కులసంఘాలు వెల్లడించాయి. ఉపగ్రహాల సహాయంతో నక్సలైట్ల కదలికలపై నిఘా వుంచి వారిని మట్టుపెట్టారని ఆరోపణలు వచ్చాయి. నక్సలైట్ల కదలికలపై ఎప్పటికప్పుడు వివరాలు సేకరించేం దుకు ఇస్రోకు సంబంధించిన ఫోటోలను వాడుకోవాలని నిర్ణయించిన పోలీసు బలగాలు ఈ విషయంలో మెరుగైన ఫలితాలు అందుకున్నాయి.

# వరుస ఎన్‌కౌంటర్లు... భారీగా లొంగుబాట్లు

**డి.మురళీధర్ అమర్‌నాథ్**

విప్లవాల యుగం మనది విప్లవిస్తే జయం మనది" అంటూ భూమికోసం, భుక్తికోసం, పీడిత జనం విముక్తి కోసం అడవిబాట పట్టిన అన్నలపై పెరిగిన రాజ్యహింసతో అడవిలో అలజడి మొదలైంది. ప్రభుత్వం అడవుల్లో సైనిక క్యాంపులు పెట్టి డ్రోన్స్ అత్యాధునిక పద్ధతిలో ఏరివేతకు దిగడంతో ఏడాదిగా నక్సలైట్లకు వరుస దెబ్బలు తగులుతున్నాయి. వచ్చేఏడాది మార్చి నాటికి భారత్‌ను నక్సల్ రహిత దేశంగా మారుస్తామని కేంద్రం ప్రకటించి అందుకు తగినట్లుగా ఆపరేషన్ కగార్‌ను కొనసాగిస్తుండగా దీని కారణంగా ఓవైపు వరుస ఎన్‌కౌంటర్లలో పదుల సంఖ్యలో నక్సలైట్లు మరణిస్తుండగా ఇంకోవైపు అంతకు రెట్టింపు సంఖ్యలో మావోయిస్టులు పోలీసులకు లొంగిపోతున్నారు. తమపై పోరాటం ఆపితే చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించగా వారికి మద్దతుగా ప్రజా సంఘాలు సైతం ఆందోళన చేసినా కేంద్రం ససేమిరా అనడంతో పోలీసుల కూంబింగ్ నిరంతరంగా కొనసాగుతూనే వుంది. ఈ క్రమంలో ఒకప్పుడు దేశంలోని అనేక రాష్ట్రాల్లో సమాంతర ప్రభుత్వాలను నడిపిన మావోయిస్టులు నేడు ఉనికి కోసం పోరాటం చేయాల్సి వస్తోందని నిపుణులు అంటున్నారు. ఇదే సమయంలో వేల నుంచి వందలకు పడిపోయిన నక్సలైట్ల సంఖ్య పోలీసు గణాంకాల ప్రకారం పదులకు చేరింది. మావోయిస్టు పార్టీ గురించి దేశంలో అందరికి తెలిసిందే. ఒకప్పటి పీపుల్స్ వార్‌గా వుండి ఆ తరువాత సిపిఐ (ఎంఎల్)తో కలిసి మావోయిస్టుగా ఏర్పాటయ్యాక మావోయిస్టు పార్టీ ఓ వెలుగు వెలిగింది. 2004లో మావోయిస్టు పార్టీ ఏర్పాటవగా దాని తరువాత ఆ పార్టీ దేశంలోని అనేక రాష్ట్రాలలో తమ పట్టును కొనసాగించింది. ఆ సమయంలోనే ఉమ్మడి ఎపి సిఎం వై,ఎస్ రాజశేఖర్ రెడ్డి మావోయిస్టులతో జరిపిన చర్చలు దేశ వ్యాప్తంగా సంచలనం రేపడంతో పాటు తీవ్రచర్చకు దారితీసింది. 1960లో బెంగాల్‌లో చారు మజుందార్ నాయకత్వంలో నక్సలైట్ల ఉద్యమం మొదలయ్యాక అనేక మార్పులకులోనైన మావోయిస్టు పార్టీ 2004లో పటిష్టమై ఆ తరువాత ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో వరుసగా ఎదురు దెబ్బలు తినాల్సి వచ్చింది.

2004కు ముందే నక్సలైట్ల ఏరివేతకు ఏర్పాటైన గ్రే హౌండ్స్ చర్చల విఫలం తరువాత మావోయిస్టులపై వరుసగా దాడులు చేస్తూ వారి ఉనికిని ఉమ్మడి ఎపిలో నామమాత్రంగా చేయడంలో సఫలమయ్యింది. టెక్నాలజిని, ఉపగ్రహాలను వాడి పోలీసులు నక్సలైట్లపై పైచేయి సాధించారు. ఈ నేపథ్యంలోనే ఒకప్పుడు ఉమ్మడి ఎపిలో నల్లమలఅడవుల్లో పూర్తి ఆధిపత్యం కనబరచిన మావోయిస్టులు ఆతరువాత పట్టును



కోల్పోయి ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్, మహారాష్ట్రలకు వలసవెళ్లారు. ప్రస్తుతం నక్సలైట్ల ప్రభావిత జిల్లాలు ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్, సుకుమా, నారాయణపూర్‌లకే పరిమితమయ్యాయి. 2004 తరువాత మావోయిస్టులు కొంతకాలం ఉమ్మడి ఎపిసహా పలు ఒడిషా, బెంగాల్‌లలో పోలీసులపై దాడులకు పాల్పడ్డా 2014లో ఆపరేషన్ గ్రీన్ హంట్ మొదలవడంతో నక్సలైట్లపై పోలీసులు పైచేయి సాధించారు. ఈ సమయంలోనే సిఆర్‌పిఎఫ్‌లో కోబ్రా పేరిట ప్రత్యేక బలగాన్ని ఏర్పాటు చేసినక్సలైట్ల ఏరివేతకు రంగంలో దించారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను రద్దుచేశాక ప్రస్తుతం కగార్ కొనసాగుతోంది. మావోయిస్టుపార్టీ గురించి పోలీసులవద్ద వున్న గణాంకాల ప్రకారం ఛత్తీస్‌ఘడ్‌లోనే వారి ఉనికి వుంది. దీని తరువాత మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లో కొంతమేర వుంది. ఉమ్మడి ఎపి సహా ఒడిషాలో వారి సానుభూతిపరులు కొంతమేర వున్నారు.

అయినప్పటికీ ఈ మూడు రాష్ట్రాలలో నక్సలైట్ల వ్యతిరేక విభాగం బలంగానే వుండడంతో పాటు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో నిత్యం కూంబింగ్ చేస్తూనే వున్నారు. మావోయిస్టు పార్టీ గురించి పోలీసుల వద్ద వున్న రికార్డుల ప్రకారం కేంద్ర కమిటీలో 18 మందివరకు వుండగా ఇందులో తెలంగాణకు చెందిన వారు 12 మంది వున్నారు. వీరిలో పార్టీలో ఇటీవల తీవ్రంగా విబేధించిన మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ అభయ్, అలియాస్ భూపతితోపాటు మరో సీనియర్ నాయకుడు తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్నలు తమ అనుచరులతో కలిసి ఆయుధాలతోసహా మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ పోలీసులకు లొంగిపోయారు. ఇదే సమయంలో మావోయిస్టు పార్టీ దివంగత నేత మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్ జీ సతీమణి పోతుల సుజాత సహా మరో ముగ్గురు ముఖ్య నాయకులు తెలంగాణ పోలీసులకు లొంగిపోయారు. వీరిబాటలో మరో 200మంది నక్సలైట్లు త్వరలో లొంగిపోతున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఢిల్లీలో ప్రకటించారు. ఇక మావోయిస్టు పార్టీ ప్రస్తుత కార్యదర్శి తిప్పిరి తిరుపతి నియమితు డైనట్లు వార్తలు వచ్చినా దీనిని పోలీసులు ఇంకా ధృవీకరించలేదు. తిరుపతి నియామకాన్ని మల్లోజుల వేణుగోపాల్ రావు వ్యతిరేకించినట్లు వార్తలు రావడంతో ఈ కారణంగానే ఆయన తన అనుచరులతో ఆయుధాలతో సహా లొంగిపోయినట్లుగా పోలీసులు చెబుతున్నారు. ఆ పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాళ్ల కేశవరావు అలియాస్ బసవరాజ్ రెండు నెలల క్రితం ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాక ఆయన స్థానం చాలా రోజుల పాటు ఖాళీగా వుంది. గతంలో నక్సలైట్ల ఉద్యమం మొదలైన తొలినాళ్లలో పార్టీ అగ్రనేతగా వున్న చారు మజుందార్ పోలీసు కాల్పుల్లో మరణించగా ఆ తరువాత ఆ స్థాయి నాయకుడుగా వున్న బసవరాజ్ ఎదురుకాల్పుల్లో మరణించారు. మావోయిస్టు పార్టీ తెలంగాణ యూనిట్ వరకు వస్తే 72మంది వున్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా పార్టీలో వున్న వారి సంఖ్య 400 లోపేనని గణాంకాలు చెబుతున్నాయి. దీనిని మావోయిస్టు పార్టీఖండించడం గమనార్హం. అయితే ఛత్తీస్‌ఘడ్‌లో ఆ పార్టీ ఉనికి ఇంకా బలంగానే వుందని పోలీసులు చెబుతున్నారు. ఛత్తీస్ ఘడ్‌తో పాటు మహారాష్ట్రలోని గడ్చిరోలిలో కొంతభాగం కలిపివున్న నక్సలైట్ల కోట అబూజ్‌మడ్‌లో పోలీసులు ఇప్పటికేచాలా భాగాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. అబూజ్‌మడ్ పరిధిలో దివంగత మావోయిస్టు అగ్ర నాయకులు అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ సహా అనేకమంది స్తూపాలు వుండగా వాటిని పోలీసులు బుల్డోజర్లతో కూల్చి వేశారు. ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో పోలీసు క్యాంపులు ఏర్పాటు చేసి వేల సంఖ్యలో పారా మిలటరీ బలగాలను మొహరించారు. ఒకప్పుడు ఇదే అబూజ్‌మడ్‌లో జనత సర్కారు పేరిట మావోయిస్టు పార్టీ దశాబ్దాల పాటు సమాంతర సర్కారు నిర్వహించడం విశేషం. ఇప్పుడు ఇదేప్రాంతంలో వారు ఉనికి కోసం పోరాటం చేస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. అబూజ్‌మడ్‌లో నక్సలైట్ల ఏరివేతకు పోలీసులు డ్రోన్లను వాడడంతో పాటు స్థానికులతోకలిసి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడం గమనార్హం. ప్రస్తుతం ఆపరేషన్ కగార్ ఛత్తీస్‌ఘడ్‌తో పాటు మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లో వేగంగా సాగుతోంది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ ప్రాంతంలో నక్సలైట్లు లేకుండా చేయాలని కేంద్రం నిర్ణయించడంతో దానికి అనుగుణంగా పోలీసు బలగాలు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఓవైపు నక్సలైట్ల ఏరివేతకు కూంబింగ్ నిర్వహిస్తూనే మరోవైపు పార్టీలోవున్నకొద్దిమంది అగ్రనాయకులను కూడా జనజీవన స్రవంతిలోకి వచ్చేలా వారి కుటుంబ సభ్యులు, స్నేహితులచేత ఒత్తిడి తీసుకువచ్చేందుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించింది. చిన్నాచితక నాయకులకన్నా ముఖ్య నాయకులుగా వయోభారంతో వున్న సెంట్రల్ కమిటీ సభ్యులు, రాష్ట్రస్థాయి నాయకుల లొంగుబాటుకు పోలీసుశాఖ తెరవెనుక వ్యూహాలను అమలుచేయసాగింది. లొంగిపోయిన నేతలకు భారీ పునరావాసప్యాకేజి అందించడంతోపాటు అవసరమైతే వారువిదేశాల్లో నివసించేందుకు ఏర్పాట్లు చేసేందుకు కూడా కేంద్రం అంగీకరించిందని తెలుస్తోంది. మావోయిస్టు పార్టీపై ఆపార్టీకిచెందిన వారిచేత విమర్శలు చేయించడం, లొంగిపోయిన వారిచేతపార్టీ తప్పిదాలను చెప్పించడం వంటివి చేయించాలని కేంద్రంవ్యూహాల్లో భాగంగా కనిపిస్తోంది. ఈ విషయంలో పోలీసుబలగాలు ఇప్పటికే కొంతమేరవిజయం సాధించగా దీనిని మరింతగా అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ●

బీహార్

# కింగా! మేకరా?

**ఎ.వి.వి ప్రసాద్**

ఇప్పుడు దేశంలో అందరి దృష్టి బీహార్ ఎన్నికల పైనే. అటు అధికార ఎన్డీయే కూటమి, ఇటు విపక్ష మహాఘట్ బంధన్ హోరాహోరీ పోరు నడుమ 'జన్ సురాజ్' అనే కొత్త పార్టీ రంగంలోకి ప్రవేశించడమే అందుకు కారణం. ఆ పార్టీ వ్యవస్థాపకుడైన ప్రశాంత్‌కిశోర్ (పికె)కు 'ఎన్నికల వ్యూహ కర్త' గా దేశమంతా పేరు రావడంతో ఆయన పార్టీ కూడా 'ఆప్' తరహాలోనే ప్రారంభంనుంచే సంచలనం సృష్టించింది. అయితే ఆయన వ్యక్తిగతంగా తెచ్చుకున్న పేరు ఎన్నికల్లో పార్టీకి ఎన్నిఓట్లు, సీట్లు సాధించగలదన్నదే ప్రశ్న. సుదీర్ఘ పాలనానుభవం గల నేతగా జెడి(యు) అధినేత నితీశ్ కుమార్ మరోసారి సిఎం కావడానికి యధాశక్తి ప్రయత్నిస్తుండగా, మహాఘట్ బంధన్‌లోని ఆర్జేడీ నేత, లాలూ కుమారుడైన తేజస్వి యాదవ్ కూడా ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో పావులు కదుపుతున్నారు. అయితే ఆ కూటమిలోని కాంగ్రెస్ ఆలోచనలు భిన్నంగా కనిపిస్తున్నాయి. రాహుల్ జరిపిన ఓట్ అధికార యాత్ర తరువాత ఆ పార్టీ పరిస్థితి కొంత మెరుగుపడినట్లు కనిపించినా మొత్తంమీద గత ఎన్నికల్లో వచ్చిన19సీట్ల కంటే మించకపోవచ్చనీ, రెండు మూడు సీట్లు అదనంగా వస్తే రావచ్చనీ పరిశీలకులు భావిస్తున్నారు. ఆర్జేడీకి 75, బిజెపికి 74 సీట్లు ఉండడంతో ఈసారి కూడా అదే తరహాలో పోటీ ఉండవచ్చనుకొంటున్నారు. దానికి ముందు 2015 ఎన్నికల్లో ఆర్జేడీకి 80రాగా, జెడియుకు 71, కాంగ్రెస్‌కు 27సీట్లు లభించాయి. అదే 2024 పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి, జెడియుకు సమానంగా చెరో 12 సీట్లు లభించగా, ఆర్జేడీకి 4, కాంగ్రెస్‌కు 3 మాత్రమే లభించాయి. దీనిని బట్టి చూస్తే బిజెపి, జెడియు ఒక పక్క, ఆర్జేడీ, కాంగ్రెస్ మరో పక్క తమ బలాబలాలు తేల్చుకోవడానికి రంగం సిద్ధం చేసుకున్నట్లు స్పష్టమవుతుంది. బిజెపి, జెడియుకు కొన్ని పర్యాయాలు సీట్లలో హెచ్చు తగ్గులు ఉన్నా స్పష్టమైన ఓటుబ్యాంకు ఉంది. అలాగే ఆర్జేడీ, కాంగ్రెస్‌కు కూడా నికరంగా లభించే ఓట్లు ఉన్నాయి. ముఖ్యంగా అధికశాతం ఉన్న యాదవ ఓట్లు ఆర్జేడీకే ఎక్కువగా లభించడం గత ఎన్నికల్లో కనిపిస్తుంది. దశాబ్దాలుగా బీహార్ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఒబిసిల్లో యాదవులు అత్యధికంగా దాదాపు 15 శాతం ఉన్నారు. తర్వాత కోయిరీలు దాదాపు 5 శాతం ఉన్నారు. ముస్లింలు దాదాపు 18 శాతంతో కీలకపాత్ర వహిస్తున్నారు. 2020 ఎన్నికల్లో ముస్లిం ఓట్లను ఆర్జేడీ కూటమి 74శాతం పొందగా, ఎన్డీయే కూటమికి 5 శాతం లభించాయి. అంటే ముస్లిం ఓట్లు ఎటువంటి కీలకపాత్ర పోషిస్తున్నాయో అర్థమవుతుంది. బహుశా అందుకే కావొచ్చు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఈసారి 100 సీట్లలో పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పరిస్థితిలో జన్ సురాజ్ పోషించే పాత్ర ఏమిటన్నదే ప్రశ్నార్థకంగా మారింది.



ప్రశాంత్ కిశోర్

18 యేళ్లుగా అధికారంలో ఉన్న నితీశ్ కుమార్‌వల్ల బీహార్ సాధించిన అభివృద్ధి ఏమీ లేదనీ, నిరుద్యోగం, వలసలు పెరిగిపోయాయనీ పికె తన ప్రచారంలో ప్రధానంగా ఆరోపిస్తున్నారు. కులం, కుటుంబ రాజకీయాల నుంచి బీహార్‌కు విముక్తి కలిగించవలసిన సమయం ఆసన్నమైందంటున్నారు. ఊరూరా పాదయాత్రలు చేస్తూసుపరిపాలన, సామాజిక న్యాయం, యువత, మహిళా సాధికారత వంటి అంశాలపై క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. ఆయన సొంత పార్టీ జన్ సురాజ్ ను స్థాపించి యేడాది మాత్రమే అయింది. గత సంవత్సరం అక్టోబర్ 2న పార్టీ ప్రారంభించినప్పటి నుంచి సామాజిక వేత్తలు, మేధావులు, మాజీ ఉన్నతాధికారులను ఏకం చేసే ప్రయత్నం చేశారు. అధికార, విపక్షాలకంటే ముందుగానే అభ్యర్థుల జాబితా ప్రకటించారు. అన్ని స్థానాలకు పోటీ చేయడంతో పాటు 150 సీట్లు తమకు కచ్చితంగా వస్తాయంటున్నారు. అభ్యర్థుల జాబితాలో వెనుకబడిన తరగతులు, ముస్లిం, షెడ్యూలు కులాల వారు ఎక్కువ. ఎటువంటి నేరచరిత్ర లేనివారికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. తానుపోటీ చేయడంలేదనీ, పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యమనీ అంటున్నారు. తాను ఏ పార్టీతో జతకట్టబోనని పికె ప్రకటించినా, ఆర్జేడీ, కాంగ్రెస్‌తో ఆయన లోపాయికారీగా ఒక అవగాహనకు వచ్చారనే అభిప్రాయం వినిపిస్తోంది. అదేనిజమైతే అధిక సీట్లు సాధించి కింగ్ కావడం కంటే, ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమిని అధికారంలోకి తేవడానికి ప్రశాంత్ కిశోర్ కీలక పాత్ర పోషించగలరని తెలుస్తోంది. ఆయన చెబుతున్నట్లుగా జన్ సురాజ్‌పార్టీకి 150 సీట్లు వచ్చే పరిస్థితి లేకపోయినా మూడులేదా నాలుగుశాతం ఓట్లతో 20 నుంచి 25 సీట్లు సాధించగలదని అంటున్నారు. గతంలో ప్రధాని మోడీకి చాలా సన్నిహితంగా ఉన్న పికెతర్వాత విభేదాలు వచ్చినా తిరిగి చేతులుకలపడానికి కూడా అవకాశాలున్నాయి. రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే. పికె ఇప్పుడు సొంతపార్టీ రాజకీయవ్యూహంతో సాగుతున్నారు గనుక ఎన్నికల అనంతరం సమీకరణాలు ఎలామారినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఆర్జేడీ, బిజెపిమధ్య బలాబలాలు తేలవలసివచ్చినప్పుడు పికె ఎటు మొగ్గుచూపుతారనే అంశంపైనే కొత్త ప్రభుత్వం ఆధారపడి ఉంటుందనవచ్చు. రాహుల్ గాంధీ కూడా ఓట్ల చోరీ ప్రచారంతో కొంత సంచలనం సృష్టించినా, చెప్పిన ' హైడ్రోజన్ బాంబు' ఇప్పటికీ పేల్చకపోవడంతో ఆయన మాటలపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతున్నట్లే కనిపిస్తోంది. అంటే కాంగ్రెస్ కంటే జన్ సురాజ్ పార్టీయే ఎన్నికల అనంతరం కీలక పాత్ర పోషించవచ్చనీ, పికె కింగ్ మేకర్ పాత్రకే ప్రాధాన్యమిస్తారనీ భావిస్తున్నారు. బీహార్ రాజకీయాల్లోకి వేటగానిగా ప్రవేశించానని చెప్పిన పికె ఎంత వేటాడుతారో, లేక ఆయన్నే మిగిలిన పార్టీలు ఆడుకుంటాయో చూడాలి. బీహార్ ప్రజలు కూడా ఈసారి ఎవరిని విశ్వసించాలో తెలియని అయోమయంలో పడినట్లు కనిపిస్తోంది. ఈసారి అంచనాలకు భిన్నమైన ఫలితాలే లభించగలవని పరిశీలకులు అంటున్నారు. ●

పెరూ

# కొత్త అధ్యక్షుడికీ 'జెన్‌జడ్' సవాళ్లు!

**గన్ని మోహన్**

దక్షిణ అమెరికా ఖండంలో చిన్న దేశం అయిన పెరూలో కూడా ఇప్పుడు జన్‌జడ్ ఆందోళనలు మిన్నంటాయి. ఫలితంగా ఉన్న అధ్యక్షురాలు పరారై ఇతర దేశానికి ఆశ్రయంకోసం పోవాల్సి వచ్చింది. ప్రస్తుత అధ్యక్షుడు జోస్ జెరీ కూడా రాజీనామా చేయాలన్నఆందోళనలు జెన్‌జడ్ కొనసాగిస్తోంది. పట్టుమని పదిరోజులు కూడా కాకముందే కొత్త అధ్యక్షుడికి జెన్‌జడ్ నిరసనల సెగ తీవ్రస్థాయిలోనే ఎదురైంది. నేపాల్, ఫిలిప్పీన్స్, ఇండోనేసియా, కెన్యా, మొరాకోల్లో భారీఎత్తున ఎగిసిపడిన ఈ జన్‌జడ్ ఆందోళనలు పెరూను కూడా చుట్టుముట్టాయి. ఆందోళనకారులు నల్ల జెండాలు ధరించి వీధుల్లోకి వచ్చి నినాదాలు ర్యాలీలతో హోరెత్తిస్తున్నారు. ఒకప్పుడు శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో చోటు చేసుకున్న ఘర్షణలు హింసాత్మక సంఘటనలే ఇప్పుడు పెరూలో కూడా నెలకొన్నాయి. సుమారు వందమందికిపైగా గాయపడ్డారు. వీరిలో 80 మందివరకూ పోలీసులు పదిమంది జర్నలిస్టులు కూడా ఉన్నారు. మంచి వేతనాలు, పింఛన్లు అమలుచేయాలని, అవినీతిని అరికట్టాలని, అవినీతిని నిర్మూలించలేని ప్రభుత్వం మాకొద్దు అంటూ జన్‌జెడ్ యువతరం తమ ఆందోళనలు కొనసాగిస్తోంది. ఇందులో భాగంగానే దశాబ్దకాలంలో ఏడో అధ్యక్షుడు కొద్దిరోజుల క్రితమే ప్రమాణం చేసిన జోస్‌జెరీ కూడా రాజీనామా చేయాలంటూ నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో అతడు ఒక మహిళపై లైంగిక దాడి చేసాడని, పదవిలో కొనసాగేందుకు ఎంతమాత్రం అర్హుడు కాదని, అలాగే సంక్షేమకారక ప్రభుత్వం దిశగా తాను పనిచేస్తానని చెప్పినా నిరసనకారులు విశ్వసించడంలేదు. ప్రమాణం చేసిన వారం రోజుల్లోపే ఆయనతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు మొత్తం దిగిపోవాలంటూ నిరసనకారులు మరింత రెచ్చిపోతున్నారు. అవినీతిని సమూలంగా నిర్మూలించే ఆరుచట్టాలను నిర్వీర్యంచేసారని తక్షణమే ప్రస్తుత ప్రభుత్వం దిగిపోవాలంటూవారు డిమాండ్ చేస్తున్నారు. నేరాలను కట్టడిచేయాలని, తుదముట్టించేందుకు తనకు కొన్ని విస్తృత అధికారాలు కావాలని పార్లమెంటులోకూడా ప్రసంగించేందుకు వచ్చిన జోస్‌జెరీ ఆందోళనకు జడిసేది లేదని, రాజీనామా చేసే ప్రసక్తేలేదని మొండికేసారు. అయితే ఆందోళనల్లో కాల్పుల సంఘటనపై విచారణ జరిపిస్తామని హామీ మాత్రం ఇచ్చారు. చనిపోయింది హిప్‌హాప్ గాయకుడు ఎడ్యురాడో రూయిజ్ కావడంతో నిరసనలు మరింతపెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో చెలరేగిన యువతరం ఆందోళనలతరహాలోనే ఇప్పుడు పెరూలో కూడా ఉన్నాయి. ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్, ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం ఉన్న దేశంగా నిలిచింది. అయితే దేశంలో ప్రజ్వరిల్లిన ఈ ఉద్యమం మళ్లీ ప్రభుత్వాన్ని కుప్పకూల్చే స్థితికితెచ్చింది.



జోస్ జెరీ

బ్రెజిల్ అర్జంటీనాల తర్వాత దక్షిణ అమెరికా ఖండంలో మూడో అతి పెద్ద దేశం అయినా ఇటీవలికాలంలో చెలరేగిన హింస గతంలో ఎన్నడూ కూడా సంభవించ లేదు. కారణం ప్రభుత్వాల్లో పారదర్శకత ఉండా లని, ప్రజల సంక్షేమం, ఉపాధికల్పన వంటివి రానురాను కనుమరుగవుతున్నాయన్న ఆక్రోశం అక్కడి యువతలో పేరుకునిపోయాయి. గత అధ్యక్షురాలు డినా బోలువార్టేను పెరూకాంగ్రెస్ తొలగించి ఆయన స్థానంలో 38ఏళ్ల న్యాయవాది జోస్‌జెరీని నియమించింది. నేరాలను కట్టడి చేయడంలో డెన్ బోలువార్టే ప్రభుత్వం విఫలమైందని ప్రభుత్వంలో ఎంతమాత్రం కొనసాగేందుకు వీలులేదంటూ ప్రవేశపెట్టిన పదవీచ్యుతి తీర్మానం మెజార్టీ సభ్యులు ఆమోదించడంతో వెంటనే తొలగించడం, ఆపై జోస్‌జెరీ నియామకం చకచకా జరిగిపోయాయి. అయితే జెరీ నాయకత్వంపై జెన్‌జెడ్‌కు నమ్మకంలేదు. ఎందుకంటే దేశంలో ప్రజలను బెదిరించి దోపిడీ చేస్తున్న ఫిర్యాదులు 15,989కిపైగా వచ్చాయి. గత ఏడాదికంటే 28శాతం పెరిగిపోయాయి. రెండేళ్ల క్రితం కూడా ఇలాంటి ఉద్యమమే నడిచింది. అయితే ఆనాటి ఉద్యమాన్ని ప్రభుత్వం అణిచివేసింది. ప్రభుత్వం అధికార దమనకాండ నిర్వహించిందన్న విమర్శలు కూడా ఉన్నాయి. 50మందికిపైగా ఆనాడు చనిపోయారు. అయితే ఇప్పటి ఆందోళన వేరుగాఉంది. అవినీతి, నేరాలను సమూలంగా కట్టడిచేసే ప్రభుత్వం కావాలని, అలాగే యువతరానికి ఉపాధి భరోసాతోపాటు పింఛన్లు కూడా కల్పించాలంటూ ఆందోళనలు కొనసాగాయి. కొత్త ఉద్యమం నెలరోజులనుంచే ప్రారంభమైనా పెరూలో కొత్తఅధ్యక్షుడికి సైతం ఈనిరసన సెగలు తగిలాయి. అందుకు కారణాలు కూడా అనేకం కనిపిస్తున్నాయి. జోస్‌జెరీదికూడా నిరంకుశ మనస్తత్వమేనని, గతంలో ఒక మహిళపై అత్యాచారం చేసారన్న ఆరోపణలున్నాయి. పెరూలో లైంగిక హింస ఆరోపణలను తీవ్రంగా పరిగణిస్తారు. అందువల్లనే ఇప్పుడు జెన్‌జడ్‌తరం ప్రస్తుత అధ్యక్షుడు కూడా దిగిపోవాలని, అసలు మొత్తంప్రభుత్వం రాజీనామాచేసి తిరిగి ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌తో ఉన్నారు. అంతేకాకుండా జోస్‌జెరీ రద్దుచేసిన చట్టాలను పునరుద్ధరించాలని, నేరాలను కట్టడిచేయాలంటే ఈచట్టాలే ముఖ్యమని ఆందోళనకారులు చెపుతున్నారు. వీటిని రద్దుచేయడంవల్ల క్రిమినల్ ముఠాలకు మద్దతిచ్చినట్లయిందని జోస్‌పై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు జెన్‌జడ్ నిరసనల్లో పాల్గొంటున్న మహిళలే అధికశాతం జోస్‌ని అంగీకరించడంలేదు. రేపిస్ట్ జెరీ అని నినాదాలుచేస్తూ చప్పట్లు కొడుతూ దిగిపోవాలంటూ డిమాండ్ చేస్తుండటం కొత్త అధ్యక్షుడికి ఆదిలోనే సవాళ్లు ఎదుర్కొనక తప్పడంలేదు. కేవలం పింఛన్‌ఒక్కటే కాకుండా ఇతరత్రా ప్రజల్లో అభద్రతాభావం పెరిగింది. ప్రభుత్వ సామర్థ్యంపై అపనమ్మకం ఏర్పడింది. అవినీతిని కట్టడిచేయలేని ప్రభుత్వం మాకొద్దు అంటూ ఈయువతరం వీధుల్లోకి రావడంతో ఇపుడు పెరూ మొత్తం అసంతృప్తిజ్వాలల్లో రగిలిపోతున్నది. రాజీనామాకు మొండికేసిన కొత్త అధ్యక్షుడు జోస్‌జెరీ ఈసవాళ్లను ఎలా ఎదుర్కొంటారన్నదే ఇప్పుడు ఆదేశంలోరాజకీయ పరిశీలకులకు అంతుబట్టకుండా ఉంది. ●

# బిసి రిజర్వేషన్ల రక్షణ కవచం తొమ్మిదో షెడ్యూల్

**పుల్లెంల గణేష్**

భారతీయ పౌర సమాజంలో ప్రస్తుతం అంతర్గతంగా దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలల్లో అతిపెద్దది కుల గణనతో కూడిన జనగణన. మరీ ముఖ్యంగా చెప్పాలంటే బీసీ కులాల సమస్యలే నేడు దేశసమస్య. మరిఇంత పెద్ద సమస్యకి శాశ్వత పరిష్కార మార్గం చూపించకుండా, అగ్రకుల పాలకవర్గాలు తరతరాలుగా బీసీల స్థితిగతులను మార్చడానికి పాటుపడడం లేదు అంటే ఉద్దేశపూర్వకంగానే ఆయా రాష్ట్రాలను, కేంద్రాన్ని పాలిస్తున్న అగ్రకుల పాలక వర్గాలు పార్టీలకతీతంగా బీసీ కులాల అభివృద్ధి వ్యతిరేకులుగా నిరూపించుకుంటున్నారు కదా. ప్రస్తుతం తెలంగాణ రాజకీయ సమకాలీన అంశాల్లో బీసీకులాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్స్ కల్పించాలనే అంశం విపరీతంగా చర్చకు వస్తున్నది. అందుకు ప్రధాన కారణం 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఏఐసిసి కమిటీ తీర్మానంలో భాగంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తదనంతరం బీసీ కులాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్స్ కల్పిస్తామని మేనిఫెస్టోలో పెట్టడం జరిగింది. అందులో భాగంగా ముందుగా వివిధ సామాజిక వర్గం వారీగా కులగణన చేపట్టి 56 బీసీ కులాలు, 18ఎస్సీ కులాలు, 12ఎస్టి కులాలు, 15అగ్రకులాలు ఉన్నాయని లెక్కించడం జరిగింది. ఐతే భారత రాజ్యాంగంలో 50 శాతం పైబడి రిజర్వేషన్లు దాటకూడదని ఎక్కడ లేనప్పటికీ ఇందిరా సహాని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పులో(1992) ప్రభుత్వ విద్య, ఉద్యోగాల్లో 50శాతం రిజర్వేషన్లు మించకూడదని తీర్పునివ్వగా, నేడు స్థానిక సంస్థల్లో కూడా 50 శాతం రిజర్వేషన్స్ మించకూడదని ఆధునిక అనాగరిక చర్యకు నిదర్శనం. ఎందుకంటే భారతదేశం అంటేనే విభిన్న సంస్కృతుల సమ్మేళనం కాబట్టి జనాభా దామాషా ప్రకారం ప్రతి కులానికి వారి జనాభా ప్రకారం సామాజిక, రాజకీయ, ఆర్థిక ఇలా సమస్తరంగాల్లో సమాన వాటా దక్కాలి. అదే స్వేచ్ఛ సమానత్వ సోదరభావ ప్రజాస్వామ్య పార్లమెంటరీ ప్రభుత్వంతో కూడిన స్వాతంత్ర, గణతంత్ర రాజ్యానికి నిదర్శనం. కాబట్టి భారతీయ కుల, మత అసమానత సమాజంలో సామాజిక రుగ్మతలని రూపుమాపడానికి సమసమాజ నిర్మాణంలో భాగంగా భారత రాజ్యాంగంలో రిజర్వేషన్స్ పొందుపరచబడం వాటి ఉద్దేశం తప్ప, ఆర్థికంగా వెనుకబడ్డారని నెపంతో రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ మౌలిక సూత్రానికి విరుద్ధం, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా అగ్రకులాలని ఆకర్షించడానికి 5 శాతంకూడా లేని అగ్రకుల పేదల కోసం ఆర్థిక అంశాల పేదరికన్ని జోడించి ఈ ఈ బ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకురావడం అంటే ఒక రకంగా దేశంలో తరతరాలుగా ఏ ఆధారం లేక కడు పేదరికంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు అడ్డుకుంటున్నాయి. అగ్రకులాల నుండి ఎలాంటి సామాజిక రాజకీయ పోరాటలు జరగనప్పటికీ కేంద్ర బిజెపి ప్రభుత్వం రెండవ సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తదనంతరం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తీసుకొచ్చి, ఒకవిధంగా అణగారిన వర్గాల రిజర్వేషన్స్ పెంచకుండా అగ్రకులాల అభివృద్ధికి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు మరింత ఉపయోగకరంగా ఉండడం గమనర్హం. ఇకపోతే నేడు తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్స్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకి ఇస్తామని జీవో.9 ను తీసుకురవడం గమనార్హం. కానీ ఈ ఒక్క జీవో హైకోర్టులో టెక్నికల్‌గా బలపడలేక కోర్టు ఈ ఒక్క అంశంపై స్టే ఇవ్వడం జరిగింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లినా అక్కడ కూడా హైకోర్టు తీర్పును సమర్థించడం అంటే, తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ బీసీల 42 శాతం రిజర్వేషన్ల పట్ల నిబద్ధతతో లేదని నిరూపించుకుంది. నిజంగా కాంగ్రెస్ పార్టీకి, అగ్ర నాయకత్వం అయిన రాహుల్ గాంధీ, రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీల అభివృద్ధిపట్ల చిత్తశుద్ధి, నిబద్ధత ఉంటే కేంద్రప్రభుత్వంపై సామాజిక, రాజకీయ పోరాటం చేసి పార్లమెంటు చట్టం ద్వారా 9వ షెడ్యూల్లో బీసీ




రిజర్వేషన్ల అంశాన్ని పెట్టించి శాశ్వత పరిష్కార మార్గం చూపే వజ్రకవచం లాంటి రక్షణ చట్టాన్ని తేవాల్సి ఉండే, కానీ కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం, రాష్ట్ర నాయకత్వం బీసీల అభివృద్ధి పట్ల నిబద్ధతో లేదని స్పష్టంగా నిరూపితం అవుతున్నది. అదేవిధంగా రాష్ట్రంలో సామాజిక, రాజకీయ పోరాటం చేసే బీసీ సంఘాలు, నాయకులు కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకి 42 శాతంరిజర్వేషన్స్ ఇవ్వాలనే అంశంపై దృష్టి పెడుతున్నారు తప్ప, విద్యా, ఉద్యోగ అంశాల్లో కూడా సమాజంలో 56 శాతం ఉన్న బీసీలకు కనీసం 42శాతం ఐన విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు ఇవ్వాలనే అంశంపై పోరాటం చేయకపోవడం రాష్ట్రంలో బీసీ సమాజంలో సరైన అవగాహన, చైతన్యం లేదని చెప్పడానికి నిదర్శనం. నాడు స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా అంబేద్కర్ వెంట ఎస్సీ, ఎస్టీలు ఉండబట్టి రాజ్యాంగబద్ధ విద్యా, ఉద్యోగ, రాజకీయ అంశాల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు దక్కాయి. కానీ అంబేద్కర్ వెంట నడవకుండా, అగ్రవర్ణ నాయకుల పెత్తనం ఉండే కాంగ్రెస్‌లోని పెద్దల మాయలోపడి నాడు బీసీలు విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు సాధించుకోలేకపోయారు. తర్వాత మండల కమిషన్ ఉద్యమంలో బీసీలు అధికంగా పాల్గొని జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్స్ సాధించుకోలేకపోయారు. గతంలో మండల కమిషన్ సిఫారసులని అమలు చేయాలని మాన్యశ్రీ కాన్షీరాం దాదాపు రెండు నెలల పాటుపార్లమెంట్ ముందు టెంట్ వేసుకొని ధర్నా చేయడం మూలంగా వి.పి.సింగ్ ప్రభుత్వం ఓబిసిలకి విద్య, ఉద్యోగాల్లో 27 రిజర్వేషన్లు ఇవ్వడానికి చట్టం చేయడం గమనించడం. అందులో భాగంగానే ఆయా రాష్ట్రాల్లో ఉన్న బీసీకులాలకు తగిన విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు ఇవ్వగలుగుతున్నాయి. కానీ ఒక తమిళనాడు రాష్ట్రంలో మాత్రం ఆ రాష్ట్రంలో ఉన్న సామాజిక, రాజకీయ చైతన్యం మూలంగా పార్టీలకతీతంగా నాటి ముఖ్యమంత్రి ఐన జయలలిత కేంద్ర ప్రభుత్వంతో పోరాడి బీసీల కోసం 69 శాతం రిజర్వేషన్స్ సాధించుకొని రక్షణ కవచం లాంటి 9వ షెడ్యూల్లో పెట్టించుకోవడం గమనార్హం. తమిళనాడు రాష్ట్రం మాదిరిగా తెలంగాణలో కూడా 9 వ షెడ్యూల్లో బిసి రిజర్వేషన్స్ అంశాన్ని పెట్టించి బలమైన రక్షణ కవచం తీసుకురావాలని కొందరు పెద్దలు 42 శాతం రిజర్వే షన్స్ సాధన సమితి పేరుతో బలమైన సామాజిక, రాజ కీయ పోరాటలు చేస్తూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కానీ బీసీల విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతంరిజర్వేషన్స్ సాధించడం కోసం పార్టీలకి అతీతంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాకపోవడం అంటే అగ్రకుల పార్టీలలో ఉండే ఆధిపత్య పాలక వర్గాల మధ్య ఉండే సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక స్వార్థ స్వభావం ఏవిధంగా ఉందో బహిర్గతంగా నిరూపణ కబడుతున్నది. కానీ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకి, బిఆర్‌ఎస్ నాయకులకు, బిజెపి నాయకులకు బీసీల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి, నిబద్ధత ఉంటే ఎందుకు కేంద్ర ప్రభుత్వంపై బలమైన సామాజిక రాజకీయ పోరాటాలుచేసి బీసీలకు 42 శాతం విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్స్ సాధించలేకపోతున్నారు. ఇందులో ఉన్న సత్యాన్ని గ్రహించి 56 శాతం ఉన్న బీసీ సమాజం అగ్రకుల నాయకులకు అభిముఖంగా స్వశక్తిగా, స్వధర్మంతో స్వీయ రాజకీయ వేదికతో పోరాటం చేసి బీసీ సమాజమే తమ హక్కులను సాధించుకోవాలి తప్ప, అగ్రకుల పార్టీ నాయకులపై ఆధారపడడం అంటే, బలమైన జనబలాన్ని కలిగిఉండి, తమశక్తిని తాము తెలుసుకోకపోవడం అంటే బీసీలు స్వీయ పరీక్ష చేసుకోవాలి. ఇకనైనా బిసి సమాజం ఈ అగ్రకుల పాలక వర్గాలైన రెడ్డి, వెలమ, కమ్మ భూస్వామ్య రాజకీయ, పెట్టుబడిదారుల క్షుద్ర రాజకీయాలను గమనిస్తూ స్వీయ రాజకీయ పార్టీ వేదికగా స్వశక్తి, స్వధర్మ రాజకీయాలు చేస్తూ.. ఉత్తరప్రదేశ్, బీహార్, తమిళనాడు వంటి బీసీ నాయకత్వం కలిగిన ప్రభుత్వాలని ఆదర్శంగా తీసుకొని తెలంగాణరాష్ట్రంలో కూడా బీసీ కులాల ఆధ్వర్యంలో బలమైన నాయకత్వాన్ని నడిపిస్తూ, రాష్ట్రంలో అగ్రకులాలకి అభిముఖంగా బీసీలసామాజిక, రాజకీయ, సాంస్కృతిక చైతన్యాన్ని, ఐక్యతని ప్రదర్శించి రాష్ట్రం, కేంద్రంలో బీసీల నాయకత్వాన ప్రభుత్వాలనిఏర్పా టు చేసినప్పుడే ఒక్క బీసీలవే కాదు, ఎస్సీ, ఎస్టీల అణగారిన వర్గాల తరతరాల సకల సమస్యలకి శాశ్వత పరిష్కార మార్గం చూపబడుతాది అనే చారిత్రక సత్యాన్నిఅందరూ గ్రహించాలి. ●

5_5.qxd 10/19/2025 12:18 AM Page 1



# రిమ్స్‌కు వీల్‌చైర్స్, బెడ్ షీట్లు వితరణ



ఒంగోలు, ప్రభాతవార్త

ప్రీతమ్ వర్షిత హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాల(రిమ్స్)కు వీల్ చైర్స్ బెడ్ షీట్లు వితరణ.. ప్రీతమ్ వర్షిత హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంకాయలపాటి సాంబశివరావు కవిత దంపతుల కుమార్తె వర్షిత 17వ జన్మదినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు(రిమ్స్) ఐదు వీల్ చైర్స్ బెడ్ షీట్స్ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.మాణిక్యరరావుకు అందజేయడం జరిగింది. రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈకార్యక్రమం వర్షిత అత్త మామ కొమ్మి రమణయ్య, రాజేశ్వరిల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని డాక్టర్ ఎం.మాణిక్యరరావు, డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, డాక్టర్ మాధవిలత మాట్లాడుతూ పుట్టిన రోజులు సందర్భంగా ఆర్భాటాలు పోకుండా వర్షిత కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాల ద్వారా రిమ్స్ కు వీల్ చైర్లు బెడ్ షీట్లు అందించి పది మందికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. పేలప్రోలు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు మంచినేని మాధవి మాట్లాడుతూ వర్షిత కుటుంబ సభ్యులు వారి పిల్లల పుట్టిన రోజులు ప్రతి సంవత్సరం ఆర్భాటాలు పోకుండా నిస్సయిలైన పేదలకు ఆర్ధికంగా అండగా నిలిచి సేవా కార్యక్రమాల ద్వారా పుట్టిన రోజులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ ప్రీతమ్ వర్షిత హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఏడు సంవత్సరాల నుంచి పేద దివ్యాంగుల జంటలకు అన్ని తామై వివాహాలు జరిపించి మానవత్వం చాటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మారెళ్ళ రాజేశ్వరి, డాక్టర్ డాక్టర్ ఏడుకొండలు, బి.ప్రసాద్, చిక్కాల కిరణ్ కుమార్, భారతి తదితరులు పాల్గొన్నారు.

# ధరలు పేలి.. నిబంధనలు పేలి..

## - వందల్లో దుకాణాలు.. టన్నుల్లో విక్రయాలు

## - అంతా'మామూళ్లే' అంటున్న వ్యాపారులు

ఒంగోలు, ప్రభాతవార్త

అంతటా దీపావళి సందడి మొదలైంది. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ వందల సంఖ్యలో బాణసంచా దుకాణాలు వెలుస్తున్నాయి. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా సుమారు 600లకు పైగాబడి ఉండవచ్చని అంచనా. దీపావళి ముందు రోజున ఊరూరా అనధికారికంగా వెలిసే దుకాణాలు వందల్లోనే ఉంటాయి. ఆ పూట ఎవరైనా అధికారులు వచ్చి అడిగితే ఎంతో కొంత ముట్టచెప్పి పంపేందుకు చిన్న వ్యాపారులు సిద్ధమవుతున్నారు. మామూళ్ల మోజులో అధికారులు కూడా ఏ వ్యాపారి ఎంత మేర విక్రయాలు చేసిన సరుకు నిల్వ చేసినా చూసిచూడనట్లు వదిలేయడం పరిపాటిగా మారింది. ఏటా దీపావళి రోజుల్లో కిరణా వ్యాపారస్తులు కూడా బాణసంచా దుకాణం ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది బాణసంచా ధరలు ఎలా ఉన్నాయని ఒక వినియోగదారుడు ఓ షాపు యజమానిని అడిగి ఆరా తీయగా లైసెన్సుల కోసం వెచ్చించేది వెయ్యి అయితే దానికి ఐదారురేట్లు మామూళ్లు సమర్పించుకోవాల్సి వస్తుంది. అవన్నీ భరించలేక ఈ సారి దుకాణం ఏర్పాటు చేయలేదని చెప్పినట్లు తెలిసింది. బాణసంచా వ్యాపారంలో మామూళ్ల పర్వం ఏ స్థాయిలో ఉందో తెలిపే ఉదాహరణ ఇది. రిటైల్ దుకాణాల్లో 600 కిలోల వరకు సరుకు మాత్రమే ఉంచి విక్రయించాలని లైసెన్సు నిబంధనల్లో పేర్కొంటారు. కాని కొన్ని చోట్ల టన్నుల కొద్ది విక్రయాలు జరుగుతుంటాయి. ఇవ్వన్నీ అధికారులకు తెలియదా అంటే మౌనమే సమాధానం అవుతుంది. జిల్లాలో ఏ పట్టణాన్ని తీసుకున్నా సగటున 50 వరకు రిటైల్ దుకాణాలు పెడుతుంటారు. అన్ని చోట్ల పరిమితికి మించి టపాసులను విక్రయాలకు ఉంచుతున్నారు. గత ఏడాది పోలిస్తే టపాసుల ధలు 20 నుంచి 25 శాతం వరకు పెరిగాయని ఐదారు రకాలకే 1500 నుంచి రూ.2 వేల వరకు వెచ్చించాల్సి వస్తుందని కొనుగోలు దారులు వాపోతున్నారు. బాణసంచా పెట్టేలపై ముద్రించే ఎమ్మార్పీకి వాటి అసలు ధరకు ఏ మాత్రం పొంతన ఉండదు. దీనిని ఆసరా చేసుకుని కొందరు వ్యాపారులు 50 శాతం కన్నా తక్కువ ధరకే విక్రయాలు అంటు ప్రచారం చేస్తున్నారు. ఉదాహరణకు క్రాకర్స పెట్టేపై రూ.200లు ఎమ్మార్పీగా ఉంటే దానిని వంద వరకు విక్రయిస్తారు. వాస్తవానికి దాని ధర రూ.50ల లోపే ఉంటుందని చెప్తున్నారు. ధరల విషయంలో ఎలాంటి కట్టడి లేకపోవడమే దీనిని ప్రధాన కారణం. దీనిపై అగ్నిమాపక సిబ్బంది స్పందిస్తూ నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించేలా చూస్తామన్నారు.

# యర్రగొండపాలెంలో అక్రమంగా ఇసుక డంపు

## - లబో దిబోమంటున్న లారీ యజమానులు

## - టన్ను రూ.1500 ధర నిర్ణయించి ఇసుక అమ్మకాలు


## - ప్రజలు మా డంపులోనే ఇసుక కొనాలనే నిబంధనలతో కూడిన బోర్డు






యర్రగొండపాలెం, అక్టోబరు 18, ప్రభాతవార్త

యర్రగొండపాలెం మండలంలో ఇసుక మాఫియా పెట్రేగి పోతుంది. స్థానికంగా ఉన్న లారీలలో వస్తున్న ఇసుకను లారీల యజమానులు సామాన్యప్రజలకు అమ్ముకోకుండగా ఇక్కడి ఇసుక నిల్వల ముఠా అడ్డగించి తాముచెప్పిన ధరకే తాము ఏర్పాటు చెసుకున్న డంపులలో ఇసుక పడేయాలని హుకూం జారీ చేసి దౌర్జన్యంగా దించు కుంటున్నారని లారీ యజమానులు వాపోతున్నారు. ఇక్కడ ముఠాగా ఏర్పడిన కొంతమంది ఇసుక దందా చేసేవాళ్లు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందామని పట్టణ శివారు ప్రాంతంలో భారీ మొత్తంలోఇసుక డంపులను ఏర్పాటు చేసుకున్నారు. వినియోగ దారులపై భారం తగ్గించాల్సిన ప్రజాప్రతినిధులు, దళారి మూకకు అండదండలను అందించి జనాల కష్టాలతో మాకు సంబంధం ఏంటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే చర్చ జరుగుతుంది. యర్రగొండపాలెం పట్టణంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయం ఎదురు కొందరు పబ్లిక్‌గా బోర్డు పెట్టి మాకు అన్ని రకములైన అనుమతులు ఉన్నాయని భారీ మొత్తంలో ఇసుకను డంపు చేశారు. అమరావతి, నెల్లూరులతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ఇసుకను లారీ యజమానుల దగ్గర టన్ను రూ.800లకు కొనుగోలు చేసి డంపులో దించుకొని ప్రజలకు టన్ను 1500 వందలకు యదేచ్ఛగా అమ్ముకొని దర్జాగా సొమ్ముచెసుకుంటున్నారని లారీ యజమానుల ఆరోపిస్తున్నారు. తొలుత ఇక్కడ స్థానికంగా ఉండే కొందరు అధికారపార్టీ అండదండలతో ఈ ఇసుక డంపును ఏర్పాటు చేసుకుని ఉండటంతో జనంనుంచి వారిపై అభియోగాలు రావాడంతో స్థానికంగా ఉంటే కుదిరే వ్యవహారం కాదని, లోపకారి ఒప్పందంతో స్థానికేతరులకు ఈ ఇసుక డంపును స్వాదీన పరచినట్లు విశ్వసనీయ సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గరనుంచి ఇసుకను భారీ మొత్తంలో డంప్ చేసి దౌర్జన్యకరంగా అమ్ముకోవాడం తెలిసిందే. ఇసుక సరఫరా కొంతమంది దయదాక్షి ణ్యాలపై ఆధారపడి ఉండటంతో సామాన్యప్రజలు వారు చెప్పిన ధరకు కొనుగోలు చెయాల్సిన పరిస్థితి నెలకొంది. లారీలలో డంపుకు చేరిన ఇసుకను జెసిబి సాయంతో ట్రాక్టర్లు ద్వారా ఇసుకను అమ్మకం జరుపుతున్నట్లుగా తెలుస్తుంది. ఈ రవాణా కోసం జెసిబి, ట్రాక్టర్లను వినియోగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ అక్రమ దందాను కట్టడి చేయడంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నరంటు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ ఫ్రీ ఇసుక అని చెబుతున్నప్పటికీ, ప్రభుత్వ మాటను ఖతారు చెయకుండగా అక్రమంగా ఇసుకను ఎక్కువ ధరకు అమ్ముకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని అక్రమ డంప్ దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# వైయస్సార్ కాంగ్రెస్ బీసీ సెల్ కార్యదర్శులుగా

# తెల్ల మేకల, సోమా





చీమకుర్తి, అక్టోబర్18, ప్రభాతవార్త

జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా తెల్ల మేకల గాంధీ, కార్యదర్శిగా సోమా శేషాద్రిలు నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ప్రకాశం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు సమన్వయకర్త, మాజీ మంత్రి మేరుగ నాగార్జున ల సహకారంతో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు బొట్ల సుబ్బారావు ఈ నియామకాలు ప్రకటించారు. చీమకుర్తికి చెందిన తెల్ల మేకల గాంధీ, సోమ శేషాద్రి లు మాట్లాడుతూ తమకు ఈ అవకాశం ఇచ్చిన బూచేపల్లికి డాక్టర్ మేరుగకు పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

# వెలుగొండ నిర్వాసితుల గోడు పట్టించుకోరా...

- రాజకీయ కక్షతోనే అవార్డులో కొందరి పట్ల వివక్షత..
- గజిట్ లో పేర్లు ఉన్న అవార్డులో ఎందుకు ప్రకటించలేదు
- 10 కోట్ల నిర్వాసితుల నుంచి నొక్కేశారు
- నిర్వాసితులందరికీ న్యాయం చేయకపోతే ప్రాజెక్ట్ వద్ద ఆందోళన చేస్తా..
- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్





మార్కాపురం, ప్రభాతవార్త

వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితుల గోడు కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, 17 నెలలుగా కాళ్ల అరిగేలా కార్యాల చుట్టూ తిరుగుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. మార్కాపురం మండలం రాయవరం సమీపంలోని భూసేక విభాగం కార్యాలయాన్ని శనివారం సాయంత్రం ఎమ్మెల్యే సందర్శించారు. అవార్డులో పెండింగ్ లో ఉన్న 1350 మంది నిర్వాసితుల గురించి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణతో చర్చించారు. 2005వ సంవత్సరం నుండి గజిట్ లో పేరున్నఅవార్డులో చేర్చకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు ఇప్పటివరకు పరిహారం అందజేయని ప్రభుత్వం ప్రాజెక్టు ఎప్పటికీ పూర్తి చేస్తుందని ప్రశ్నించారు. అవార్డులో ఉన్న వారిని సైతం పక్కన పెట్టి, వచ్చే అరకొర నిధులను తెలుగుదేశం పార్టీ వారికే పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండి అవార్డు కాని వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. నిర్వాసితులకు సరైన న్యాయం జరగడం లేదని, లంచాల బస్సులపై ఉన్న మోజు నిర్వాసితుల సమస్యలపై లేదన్నారు. నిర్వాసితుల నుంచి ఒక్కొక్కరి వద్ద నుంచి 20 వేల చొప్పున 5000 మంది నుంచి 10 కోట్లు వసూలు చేశారన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కలెక్షన్ కింగ్ గా ఇన్చార్జి మారిపోయారన్నారు. భూములు వదిలేశారు., ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేశారనీ వారికి అన్యాయం చేస్తే తగిన శాస్త్రి జరుగుతుందన్నారు. ఏ ఒక్కరికి అన్యాయం జరిగిన ప్రాజెక్టు వద్ద ఆందోళన చేస్తానన్నారు.గజిట్ లో పేరు ఉన్న అవార్డులో ఎందుకు పేర్లు ప్రకటించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన ఎందుకు వివక్షత చూపుతున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు బరితెగించి లంచాల రూపంలో వసూలు చేస్తూ కొందరి పట్ల వివక్షత చూపుతున్నారన్నారు.నిబంధనలు ఉల్లంఘించి కొంతమందికి అవార్డు పాస్ చేసి, మరికొందరి పట్ల ఎందుకు వివక్ష చూపిస్తున్నారని ప్రశ్నించారు..2005 నుంచి 2006 వరకు డబ్ల్యూ ఏపీ కార్డులు ఆధారంగా అవార్డు పాస్ చేయాల్సి ఉండగా, 2016లో జారీ చేసిన జెఏపి కార్డు పై పరిహారం ఎలా ఇచ్చేందుకు సిఫార్సు చేశారని ఎస్ డి సి సత్యనారాయణ నిలదీశారు. తానుబాధ్యతలు చేపట్టే నాటికే అవన్నీ జరిగిపోయాయని ,తాను మాత్రం అన్ని నిబంధనల మేరకు మాత్రమే పరిహారానికి సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. ఆరు నెలల క్రితం నిర్వాసిత గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి ధ్రువీకరణ పత్రాలు స్వీకరించామన్నారు. ఆ పత్రాలు ఆధారంగా అవార్డుకు సిఫార్సు చేశామన్నారు. ఎన్నో పర్యాయాలు తమధృవీకరణ పత్రాలు నిబంధనల మేరకు సమర్పించిన అవార్డులో మాత్రంతమకు అన్యాయం జరుగు తుందంటూ ఎమ్మెల్యే ఎదుట పలు గ్రామాల నిర్వాసితులు గగ్గోలు పెట్టారు. అధికారులంతా ఏకపక్షంగా వ్యవహరిస్తూ నిబంధనల మేరకు ధృవీకరణ పత్రాలు సమర్పించిన అవార్డు పాస్ చేయడం లేదని వాపోయారు. రేషన్ కార్డులు ఓటర్ ఐడి అన్ని సమర్పించిన అధికారుల మొండి చేయి చూపుతున్నారని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తుందన్నారు.దేవాలయ భూములు, ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు సృష్టించి కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని కూటమి నాయకులు నొక్కేశారన్నారు. 1300 మంది నిర్వాసితుల పేర్లను అవార్డులో చేర్చకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు.అన్ని అర్హతలు ఉన్న ప్రతి ఒక్కరికి నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. దండుకోవడం దాచుకోవడమే కూటమినేతల అలవాటుగా మారిందన్నారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కలెక్షన్ కింగ్ గా మారిపోయారన్నారు. గజిట్ లో ఉండి అవార్డు ఆ చేయకుండా పెండింగ్ లోఉన్న వారికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు..నష్టపరిహారం మంజూరులోనూ టిడిపి వారికే ప్రాధాన్యత ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు. అన్ని పత్రాలు సమర్పించిన అవార్డు ప్రకటించకుండా నిరక్ష్యం చేస్తున్న అధికారులను సైతం తాము వదిలిపెట్టమన్నారు. రెవిన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ కొందరికి న్యాయం చేయడం తగదన్నారు. కాటంరాజు తాండ, చింతలముడిపి తండా నిర్వాసితుల వ్యవహారంలో రెవెన్యూ అధికారుల పాత్ర స్పష్టంగా కనిపిస్తుంద న్నారుఆ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా పరిహారంపంపిణీ చేశారన్నారు.. నిర్వాసితులందరికీ నిష్పక్షపాతంగా అవార్డు ప్రకటించకపోతే వెలుగొండ ప్రాజెక్టు వద్ద ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. డబ్బులు ఇస్తేనే అవార్డులో పేరు ఉంటుందని, ఇవ్వకపోతే ఎన్ని పత్రాలు ఇచ్చిన అవార్డులో పేరు ఉండదని బహిరంగంగానే టిడిపి నేతలు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. నిబంధనలకు లోబడి అన్ని ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన 17 నెలలుగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ లో రాజకీయ కక్షతోనే కొంతమందిని చేర్చలేదన్నారు. నిర్వాసితులకు అండగా నిలిచి పోరాడుతామన్నారు. అన్యాయం జరిగిన సహించే ప్రసక్తే లేదని, కూటమినేతల అవినీతి అక్రమాలను ఎండగడతామన్నారు. కూటమి ప్రభుత్వ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని ప్రతి కార్యకర్తకు ప్రతినిర్వాసితుడికి వెన్నంటే ఉండి న్యాయం చేస్తానన్నారు. ఎమ్మెల్యేతో పాటు పెద్దారవీడు మండల పార్టీ కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి. పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల...

మార్కాపురం, అక్టోబరు 18,ప్రభాతవార్త

మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి శనివారం మార్కాపురం పట్టణం మరియు పరిసర గ్రామాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నూతన దిశలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉన్న తమ కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోందని ఆయన తెలిపారు.స్వచ్ఛ ఆంధ్ర – క్లీన్ ఎయిర్, క్లీన్ మార్కాపురం కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ ఉదయం మార్కాపురం పట్టణంలోని దోర్నాల బస్టాండ్ వద్ద ప్రారంభమైన “క్లీన్ ఎయిర్ – క్లీన్ మార్కాపురం“ కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వయంగా సైకిల్ నడిపారు. దోర్నాల బస్టాండ్ నుండి కంభం బస్టాండ్ వరకు ప్రజల మధ్య సైకిల్ యాత్ర కొనసాగించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు వైసిపి నాయకులు మెడికల్ కాలేజీ పేరిట కోటి సంతకాల డ్రామాలు చేసినా ఒక్క మెడికల్ కాలేజీ కూడా ప్రారంభించలేకపోయారు. కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడుపుతోంది. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం కూడా అభివృద్ధికి ఒక భాగమే,“ అని తెలిపారు. బస్సు నడిపిన ఎమ్మెల్యే – ఆర్టీసీ బస్టాండ్‌లో శ్రమదానం :సైకిల్ యాత్ర అనంతరం కంభం బస్టాండ్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఎమ్మెల్యే స్వయంగా బస్సు నడిపారు, డ్రైవర్ల కష్టాలను మానసికంగా అనుభవిస్తూ వారి సేవలను అభినందించారు. ఆర్టీసీ బస్టాండ్ లో చేరిన అనంతరం ఆయన చీపురు పట్టి, స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో ఇందులో భాగమయ్యారు. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే :మార్కాపురం పవర్ ఆఫీస్ లో జరిగిన “సూపర్ జీఎస్టీ – సూపర్ సేవ్“ కార్యక్రమంలో పాల్గొన్న కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ –ఇప్పటి వరకు విద్యుత్ పరికరాలపై 12!! జీఎస్టీ ఉండగా, ఇప్పుడు దాన్ని కేవలం 5!!కి తగ్గించడం వల్ల సామాన్య ప్రజానికానికి మేలే కాదు, విద్యుత్ వినియోగంలో మరింత సమర్థత కూడా పెరుగుతుంది. ఈ ఘనత పూర్తిగా కూటమి ప్రభుత్వానిదే,“ అని స్పష్టం చేశారు. ఈ రోజు మొత్తాన్ని ప్రజల మధ్య గడిపిన శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరు తమ పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత నుండి విద్యుత్ వినియోగం వరకు – ప్రతి అంశంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ముందడుగులు ప్రజలకు శ్రేయస్కరంగా నిలుస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ డి వి ఎస్ నారాయణరావు, తాసిల్దార్ చిరంజీవి, రెవిన్యూ, సచివాలయ, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్స్, ప్రజలు పాల్గొన్నారు



# మెడికల్ కాలేజీలతో కూటమి ప్రభుత్వం పతనం




చీమకుర్తి, అక్టోబర్18, ప్రభాతవార్త

మెడికల్ కాలేజీ లను ప్రైవేటు వారికి కట్టబెట్టడం ద్వారా కూటమి ప్రభుత్వ పతనం ప్రారంభమైందని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దరిశి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ చీమకుర్తి గరికమిట్ట వద్ద శనివారం జరిగిన రచ్చబండ కార్యక్రమానికి పట్టణ పార్టీ అధ్యక్షులు క్రిష్టిపాటి శేఖరరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా చేసిన బూచేపల్లి మాట్లాడుతూ గత ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి పాలనలో భారత దేశంలో మరెవరు సాధించనంతగా పదిహేడు మెడికల్ కాలేజీలు మంజూరు చేయించారని అన్నారు. పేద విద్యార్థులు డాక్టర్ అవ్వాలని, పేదలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని జగనన్న కలలు కన్నారన్నారు. అయితే చంద్రబాబు నాయుడు సారద్యం లో కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో కమవారికి అప్పనంగా అప్పగించారని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని జగనన్న నాయకత్వంలో పూర్తి సంతకాల సేకరణ మహా ఉద్యమంలో నిర్వహిస్తున్నామని అన్నారు. మాజీ మంత్రి, సంతనూతలపాడు పార్టీ ఇంచార్జ్ డాక్టర్ మెరుగు నాగార్జున మాట్లాడుతూ పేదలను కొట్టి, పెద్దలకు మేత వేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో పాల్గొని సంతకాలు చేసి, ప్రజల నిరసనను ముఖ్యమంత్రి తెలిసేలా పోరాడాలని కోరారు. అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ పోరాటం చేస్తున్న దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నాయకత్వాలు వచ్చే ఎన్నికలలో అన్ని స్థానాలను గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇద్దామని నాగార్జున అన్నారు. జడ్పీ చైర్పర్సన్ మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొని కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. సంతనూతలపాడు నియోజక వర్గంలో నుంచి డాక్టర్ మెరుగు నాగార్జునను ఈ సారి ఎన్నికలలో ఘన విజయంతో గెలిపించడానికి ప్రతి కార్యకర్త నాయకుడు ఇప్పటినుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.రచ్చబండ కార్యక్రమానికి వచ్చిన బూచేపల్లి, మేరుగ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు 20వవార్డు కౌన్సిలర్ గంగిరెడ్డి ఇందిర సుందర రామిరెడ్డి, మారం శ్రీనివాసరెడ్డి,టౌన్‌వెంకారెడ్డి పలువురు నాయకులు స్వాగతం పలికారు. స్థానికంగా రామాలయంలో పూజలు నిర్వహించారు. వైయస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కోటి సంతకాల సేకరణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. జిల్లా పార్టీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, నియోజకవర్గ పరిశీలకు బోట్ల రామారావు, జడ్పిటిసి సభ్యులు వేమా శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి చంద్ర,వైస్ చైర్మన్ నలమోలు మాణిక్యం, నాయకులు గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, గోగినేని వెంకటేశ్వర్లు, ఓబులరెడ్డి మాస్టర్, దాకా రాజీవ్ రెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తెల్ల మేకల గాంధీ, కౌన్సిలర్ లు పాటిబండ్ల గంగయ్య, బెల్లం వెంకట్రావ్, సోమ శేషాద్రి,తప్పేట బాబురావు, మేకల ఎల్లయ్య, షేకు కాజా,కాశయ్య పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

## జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి. జవహర్




చీమకుర్తి, అక్టోబర్ 18, ప్రభాతవార్త

ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని డాక్టర్ జవహర్ కోరారు. చీమకుర్తిలోని గవర్నమెంట్ హై స్కూల్ నందు పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని శనివారం విడుదల చేసిన జనవిజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ జవహర్ మాట్లాడుతూ, విద్యార్థులు మూఢనమ్మకాలు అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడాలని, అలాగే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని ప్రజలను చైతన్యవంతం చేయాలని అన్నారు. జన విజ్ఞాన వేదిక గత 30 సంవత్సరాల పైగా తెలుగు రాష్ట్రాల్లో ప్రజ లను చైతన్యవంతం చేస్తూ మూఢనమ్మకాలపై ఉద్యమిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జె వి వి చీమకుర్తి మండల శాఖ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి చలువాది రమేష్, ట్రెజరర్ బి ఆంజనేయులు, అంబటి వీరారెడ్డి, హెడ్మాస్టర్ షణ్ముఖ కుమార్, కే వెంకటేశ్వర్లు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు హైస్కూల్స్ లోని 8,9,10 వ తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. నవంబర్ 1 న మండల స్థాయి, నవంబర్ 23న జిల్లాస్థాయి, డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయని తెలిపారు.

6_6.qxd 10/19/2025 12:15 AM Page 1



## కస్తూరిబా విద్యాలయాన్ని తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు

### - నిర్మాణంలో ఉన్న భవనాలు పరిశీలన
### - విద్యార్థులను అడిగి అవసరాల గుర్తింపు
### - విద్యార్థులకు భోజనాలు వడ్డించిన అధికారులు




**బల్లికురవ, అక్టోబర్18, ప్రభాతవార్త**
గ్రామీణ ప్రాంతాలలోని సరస్వతీ నిలయాలకు సరికొత్త హంగులు సమకూర్చేందుకు మహాకూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లా ప్రథమ పౌరుడిగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తనదైన మార్క్ అభివృద్ధిని, సంక్షేమ ఫలాలను గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అందించేందుకు తొలి అడుగు వేశారు. బల్లికురవ కస్తూరిబా గురుకుల విద్యాలయాన్ని శుక్రవారం నియోజకవర్గ ప్రత్యేక అధికారి, కస్తూరిబా గురుకుల విద్యాలయాల అడాప్షన్ అధికారి అయిన బి.వెంకటేశ్వర్లు అధికార యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక విద్యాలయంలోని విద్యార్థినుల అవసరాల గుర్తింపు, విద్యార్థులకు అందుతున్న బోధన అంశాల స్థితిగతులు, రోజువారి మెనూ వివరాలు, నిర్మాణంలో ఉన్న కళాశాల భవనాలను ఆయన తనిఖీ చేశారు. బల్లికురవ క్లస్టర్ ఇన్‌చార్జి, టీడీపీ సీనియర్ నేత మల్లీనీడి గోవిందరావు గురుకుల విద్యాలయ అవసరాలను ఆయనకు వివరించారు. పాఠశాల విద్యార్థులను బోధనా అంశాలపై పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యం, క్రీడలలో ప్రగతి, ఆరోగ్య పరిస్థితులను ఆరా తీశారు. ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కుసుమకుమారి, విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, కళాశాల ప్రత్యేక అధికారి సరళ సంబంధిత అధికారులు విద్యార్థులకు భోజనాలు వడ్డించిన అనంతరం సహపంక్తి భోజనం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన విద్యావసతులు, సౌకర్యాల కోసం ప్రత్యేకమైన ప్రణాళిక రూపొందించి, ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర అందరి బాధ్యత

### - ఎంపీడీవో కుసుమకుమారి



**బల్లికురవ, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం లక్ష్యాలను చేరుకునేందుకు ప్రజలంతా తమ వంతు సహకారం అందజేయాలని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొనిదెన ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా ప్రమాదకర సీజనల్ వ్యాధులు ధరిచేరకుండా ఆరోగ్యవంతమైన సమాజం నెలకొంటుంది అన్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామాలను ప్రజలు తమకు తాముగా రూపొందించుకున్న రోజున కాలుష్య భూతాన్ని తరిమికొట్టగలుగుతామన్నారు. తద్వారా స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్రలక్ష్యాలను విజయవంతంగా చేరుకోగలుగుతామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి




**వెలిగండ్ల, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం మండల కేంద్రమైన వెలిగండ్ల పంచాయతీలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సీజనల్ వ్యాధుల గురించిపరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తూ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో వెలిగండ్లలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి దాస్ ప్రసాద్, ఎస్సై కృష్ణ పావని, ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాస్ నాయక్, మండల పరిషత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం - గుంటక



**వెలిగండ్ల, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టి ఐదు సంవత్సరాల పరిపాలన కాలంలో ఐదు కాలేజీల నిర్మాణం పూర్తి చేసి పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్య పేద ప్రజలకు ఉచితంగా వైద్యాన్ని అందించడం జరిగిందని ప్రకాశం జిల్లా వైఎస్సార్ పార్టీ ఉపాధ్యక్షులు వెలిగండ్ల జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి అన్నారు.రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పిలుపు మేరకు శనివారం మండలంలోని గుడిపాటిపల్లి పంచాయతీలో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుంటక తిరుపతిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య, విద్య, పేద ప్రజలకు ఉచిత వైద్యం దూరం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నది గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేసే పేద వైద్య విద్యార్థులకు వైద్య, విద్య పేద ప్రజలకు ఉచిత వైద్యం అందని ద్రాక్షా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ పార్టీ ఉపాధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, మండల వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు గట్లు వెంకటరెడ్డి, కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కటికల వెంకటరత్నం, కార్యదర్శి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ పార్టీ యువత నాయకుడు గంజి రవీంద్రరెడ్డి, ఎలికా నారాయణ, వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్‌బాబు, తాతపూడి నాని, చెన్న కృష్ణయ్య, గోప జేమ్స్, గుడిపాటిపల్లి పంచాయతీ వైఎస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను పరిశీలించిన మండల విద్యాశాఖాధికారులు

**మార్కాపురం, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతి నెలలో మూడో శనివారం నిర్వహించాల్సిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణలో భాగంగా శనివారం మండలంలోని మార్కాపురం, ద్రోణాదుల, కొలలపూడి, వలపర్ల నాలుగు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ద్రోణాదుల కాంప్లెక్స్‌ను ఎంఈఓ-2 వస్రామ్ నాయక్, వలపర్ల కాంప్లెక్స్‌ను ఏ.శ్రీనివాసరావు, కొలలపూడి కాంప్లెక్స్‌ను బి.చలపతి, మార్కాపురం కాంప్లెక్స్‌కు కే.ప్రేమలత నోడల్ అధికారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి అనేక సంస్కరణలు, మార్పులు చేస్తున్న సందర్భంగా ఉపాధ్యాయులు కూడా ఆ దిశగా విద్యా బోధన చేయడానికి ప్రణాళిక ఏర్పాటు చేసుకొని, ప్రభుత్వం అందించిన అకాడమిక్ క్యాలెండర్, టీచర్స్ హ్యాండ్ బుక్స్, అసెస్మెంట్ బుక్‌లెట్స్‌ను అనుసరించి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు విద్యా ప్రమాణాలు పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిందిగా ఆదేశించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం ఉపాధ్యాయులకు కూడా గ్రేడింగ్ పాయింట్లు ఇవ్వనున్నందున ప్రతి ఉపాధ్యాయుడు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనల మేరకు విద్యాబోధన చేయాల్సిందిగా, మరి ముఖ్యంగా సి గ్రేడ్, డి గ్రేడ్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యా బోధన చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాలుగు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు జి.రమేష్, ఎస్.రామారావు, పి.శ్రీనివాసరావు, టి.తిరుపతమ్మ పాల్గొన్నారు.



## బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

### - ఎస్సై వి.మహేష్



**పెద్దదోర్నాల, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా, వ్యాపారులు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని దోర్నాల ఎస్సై వి.మహేష్ తెలిపారు. అనుమతులు లేకుండా బాణసంచాలు అమ్మడం, లేదా నిల్వలు ఉంచడం నేరమని ఆయన హెచ్చరించారు. అనుమతులు లేకుండా వ్యాపారం నిర్వహించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సై వి.మహేష్ మాట్లాడుతూ ప్రజల ప్రాణ, ఆస్తులు కాపాడటంలో దృష్ట్యా ప్రతి బాణసంచా వ్యాపారి తప్పనిసరిగా సంబంధిత శాఖల అనుమతులు పొందిన తర్వాతే దుకాణాలు ప్రారంభించాలని సూచించారు. నిర్దేశిత భద్రతా చర్యలు, అగ్నిమాపక పరికరాలు, సురక్షిత దూరం గాలి ప్రసరణ ఉండే ప్రదేశం వంటి అంశాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాణసంచా నిల్వ కేంద్రాలు విక్రయాలు నిర్ధేశించిన దూరంలో ఉండాలని అగ్ని ప్రమాదాలు జరిగితే చేపట్టాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులు అవగాహన కలిగి ఉండాలని దుకాణదారులు తగిన భద్రత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే చిన్న పిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణ ఉండాలని అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా చూసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై వి.మహేష్ కోరారు.

## పెద్దదోర్నాలలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర సైకిల్ ర్యాలీ





**పెద్దదోర్నాల, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర శుద్ధ గాలి కార్యక్రమంలో భాగంగా దోర్నాలలో శనివారం అధికారులు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రత, పర్యావరణ సంరక్షణ అవసరాన్ని తెలియజేయడం ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశం అని అధికారులు తెలిపారు. దోర్నాల గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ప్రదర్శనకు అధికారులు, విద్యార్థులు, గ్రామ పంచాయతీ సిబ్బంది హాజరయ్యారు. ర్యాలీ పంచాయతీ ఆఫీసు నుండి నటరాజ్ సెంటర్ పట్టణ వీధుల్లో సాగి ప్రజల్లో పరిశుభ్రతపై సందేశాన్ని పంచింది. ఎంపీడీవో నాసర్‌రెడ్డి మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం నివారించేందుకు ప్రతి ఇంట ప్రతి వీధి స్వచ్ఛంగా ఉంటేనే స్వర్ణాంధ్ర లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర ప్లాస్టిక్ నిషేధమే మన బాధ్యత అంటూ ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటి కాలుష్యం లేని వాతావరణాన్ని సృష్టించుకుందామన్నారు. పెద్దదోర్నాల మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నలగాటి శివ కోటేశ్వరావు మాట్లాడుతూ వాతావరణాన్ని కలుషితం చేస్తున్న ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వాహనాల వినియోగం తగ్గించి ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగిస్తే బాగుంటుందన్నారు. ఏదీ ఏమైనప్పటికి కాలుష్యం నివారణకు పరిశుభ్రతను పాటిస్తూ మొక్కలు నాటే ప్రక్రియ చేపట్టాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి నలగాటి శివ కోటేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బి.మస్తాన్ నాయక్, సర్పంచ్ చిత్తూరి హారిక, పెద్దదోర్నాల మండల కన్వీనర్ షేక్ మాబు, టీఎన్‌టీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్‌రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడి లక్ష్మయ్య, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డ శేషాద్రి, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు చంటి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, దేసు నాగేంద్రబాబు, మైనార్టీ నాయకులు షేక్ మౌలాలి, షేక్ రఫీ, జనసేన మండల కన్వీనర్ చేతి వెంకట మోహన్ మురళి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## టీబీజీ 104 రకం మినుము విత్తనాలు పంపిణీ



**కొనకనమిట్ల, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
మండలంలోని నాగంపల్లిలో రైతులకు టీబీజీ 104 రకం మినుము విత్తనాలను శనివారం పంపిణీ చేపట్టారు. దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం ఫ్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్, డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డిలు మాట్లాడుతూ టీబీజీ 104 అను మినుము రకం పంట కాలం 80-85 రోజులు ఉంటుందని, ఎకరాకు 6-8 క్వింటాలు దిగుబడి వస్తుందన్నారు. పల్లాకు తెగులుని తట్టుకుంటుందని తెలిపారు. మినుము పంటలో తీసుకోవాల్సిన సమగ్ర పంట యాజమాన్య పద్దతులను గురించి వివరించారు. జీవన ఎరువులు గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కే.ప్రకాష్‌రావు, చిన్నారికట్ల సింగిల్ విండో అధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఆయా గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

### - తహశీల్దార్ ఏ.సురేష్



**కొనకనమిట్ల, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ఖాళీ స్థలాలలో ఇంటి ఆవరణలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించుకోవాలని తహసీల్దార్ ఆవుల సురేష్ కోరారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తహసీల్దార్ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీవో డి.ఈశ్వరమ్మతో కలిసి చేపట్టారు. అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటడం ద్వారా శుభ్రమైన గాలి ప్రాధాన్యతపై వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి పథకం ఏపీవో, పలువురు టీఏ ఎఫ్ఏలతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.ఈశ్వరమ్మ పిచ్చి మొక్కలు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.శ్రీదేవి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కే.బుల్లెన్నరావు, ఎంఈఓ లు ఎస్కే దాంగే షరీఫ్, బరిగే నరసింహారావు, వెలుగు ఏపీఎం బి.సుధాకరరావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

## వాయు కాలుష్యాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

### - స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎంపీడీవో



**హనుమంతునిపాడు, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
వాయు కాలుష్యాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని ఎంపీడీవో రంగ సుబ్బరాయుడు అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం ప్రత్యేక ఇతివృత్తంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా ఈనెల క్లీన్ ఎయిర్ ఇతి వృత్తంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో రంగ సుబ్బరాయుడు తన సిబ్బందితో కలిసి మొక్కలు నాటి వాయు కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకునేలా బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తామని సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## పప్పెట్స్ తయారిపై అవగాహన




**నాగులుప్పలపాడు, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు ఎంపీపీఎస్‌లో ఎస్టీటీగా పని చేస్తున్న వై.మంజుల గత నెలలో సెప్టెంబ్ లో సీసీఆర్టీ ఢిల్లీలో పప్పెట్రి ట్రైనింగ్ పొంది డైరక్టర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా సర్టిఫికేట్ పొందిన సంగతి తెలిసిందే. నేర్చుకున్న విద్యను తన పాఠశాలలో పిల్లలకు బోధనలో ఉపయోగించడమే కాకుండా ఆ విద్యను అందరికి అందించాలని శనివారం నిడమానూరులో జరిగిన కాంప్లెక్స్ మీటింగ్లో ఎంఈఓ రవికుమార్, రమణయ్య, క్లస్టర్ హెచ్ఎం అనుమతితో క్లస్టర్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు కూడా బోధనకు ఉపయోగపడే పప్పెట్స్ తయారు చేసే విద్యను అందించడమైంది. అందరూ ఉపాధ్యాయులు ఎంతో ఆసక్తిగా పప్పెట్స్ తయారు చేసి ప్రదర్శించడం జరిగింది. అధికారులు అనుమతిస్తే మిగిలిన క్లస్టర్ లోని ఉపాధ్యాయులకు కూడా ఈ కళను అందిస్తానని మంజుల చెప్పారు.

## పొన్నలూరులో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం




**పొన్నలూరు,అక్టోబర్ 18, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన పొన్నలూరులో మండల అధికారుల ఆధ్వర్యంలో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛమైన గాలి,ఆరోగ్యమైన జీవనంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా మండల కార్యాలయ సముదాయాల వద్ద సైకిల్ ర్యాలీ నిర్వహించి,పర్యావరణ పరిశుభ్రత, స్వచ్ఛమైన గాలి కార్యక్రమాలపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మండల కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.పుల్లారావు, ఎంపీడీవో పి.సుజాత, ఏఎంసీ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ,మండల నాయకులు అనుమోలు సాంబయ్య, కర్ణ కోటిరెడ్డి,మండవ మురళి,పల్లపోతు ప్రసాద్,డిప్యూటీ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం,ఎంఈఓరవిచంద్రబాబు,ఏవో రాము, ఏపీవో సుధాకర్,పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలు,సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలను పూర్తి చేయాలి




**పొన్నలూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
గిరిజన ఆశ్రమ పాఠశాలకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేసి అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాలను నూతన భవనానికి తరలించాలని సిపిఎం, ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన పొన్నలూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాలను వారు శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాలలో 140 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారని, వారి అవస్థలు వర్ణనాతీతమని, విద్యార్థుల కోసం కట్టిన విద్యాలయం మాత్రం గొర్రెలకు నిలయమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరుకు గదులలో నిరుపేద విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను అనేక సార్లు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లినా స్పందన లేదన్నారు. నిరుపేద విద్యార్థులకు విద్యనందించాలనే లక్ష్యంతో గురుకుల పాఠశాల నిర్మాణం ప్రారంభించి 70శాతం పూర్తి చేసారని కాని గత 5 సంవత్సరాల కాలంగా ప్రభుత్వాలు నిధులు కేటాయించని కారణంగా ఆ భవనాలు పశువులకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైందన్నారు. నియోజకవర్గంలో పూర్తిగా మూతపడిన హాస్టళ్లకు నిధులు కేటాయించి మరమ్మత్తులు చేయిస్తూ విద్యార్థులు అధికంగా వున్న హాస్టళ్లను మాత్రం పట్టించుకోకపోవడంలేదని విమర్శించారు.కావున ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సత్వరమే భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.జి మస్తాన్,ఎస్ ఎఫ్ ఐ నాయకులు పాండు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## శనగ విత్తనాలకు దరఖాస్తు చేసుకోండి



**తాళ్లూరు, అక్టోబర్18, ప్రభాతవార్త**
శనగ విత్తనాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో వీఏఏ లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి బి. ప్రసాదురావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనగ విత్తనాలు క్వింటా ధర రూ.7,800 కాగా రాయితీ పోను రూ.5850కు రైతులకు అంద జేయనున్నట్లు పేర్కొన్నారు. ఎకరాకు 40 కేజీల చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాల వరకు విత్తన శనగలు ఇస్తామని స్పష్టం చేశారు.జెజ11,కాక్ రెండు రకాలు అందుబాటు లో ఉన్నాయి అన్నారు. నమోదు కోసం రైతు సేవా కేంద్రం వద్ద కు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్‌ను తీసుకువెళ్లి నమోదు చేయించుకోవాలని కోరారు.

## లక్కవరంలో వీధికుక్కలు పట్టివేత



**తాళ్లూరు, అక్టోబర్ 18,ప్రభాతవార్త**
మండలంలోని లక్కవరం గ్రామంలో వీధి కుక్కలను పట్టారు.గ్రామస్తులు ఉన్నతా ధికారులు, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన పంచాయతీ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు ఉన్నతాధికారులు సూచన మేరకు వీధి కుక్కలను పట్టించి అటవీ ప్రాంతానికి తరలించారు.గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉన్నతాధికారులను అభినందించారు.

## రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం రేపిన

### నరసరావుపేటలో కిడ్నాప్ జంట హత్యల కేసులో

#### - బాదం మాధవరెడ్డితో సహా 11 మందికి బెయిల్ మంజూరు 10 మంది విడుదల



**అద్దంకి రూరల్ , అక్టోబరు 18 ,ప్రభాతవార్త**
రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక రాష్ట్రంలో కూడా నాడు సంచలనంగా వినిపించిన నరసరావుపేటలో ఇరువురు కిడ్నాప్, సంతమాగులూరు మండలం పాతమాగులూరు శివారులోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లో కర్నాటకకు చెందిన వారీస్వామిరెడ్డి, ప్రశాంత్ రెడ్డిల జంట హత్యల కేసులో పోలీసులు ప్రధాన ముద్దాయిగా అభియోగం మోపిన బాదం మాధవరెడ్డి తోపాటు 11మందికి బెయిలు మంజూకాగా శనివారం నాటికి 10 మంది విడుదలయ్యారు.వివరాలలోకి వెళితే ఈ ఏడాది జులై 23న పల్నాడు జిల్లాకేంద్రమైన నరసరావుపేటలో బెంగుళూకు చెందిన వీరాస్వామిరెడ్డి, ఆయనకుమారుడు ప్రశాంత్‌రెడ్డి చెక్ బౌన్స్ కేసు వాయిదాకై నరసరావుపేట వచ్చారు. నరసరావుపేటలోని శ్రీనిధి హోటల్లో అల్పాహారం తీసుకుని బయటకు వస్తున్న వారి గుర్తుతెలియన 6గురు వ్యక్తులు కిడ్నాప్ చేశారు.అనంతరం కిడ్నాప్ కు గురైన వారు బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం పాతమాగులూరు శివారులో ఒక రియల్ ఎస్టేట్ వెంచర్‌లో దారుణ హత్యకు గురయ్యారు.ఈ హత్యలు జరిగిన విషయాన్ని పాతమాగులూరు వీఆర్వో రాధిక పిర్యాదు మేరకు పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులుగా కేసు నమోదు చేసుకున్నారు.ఈ హత్యలకు సంతమాగులూరుకు చెందిన బాధం మాధవరెడ్డితన అనుచరుల ప్రమేయం ఉందంటూ ఆయనతోపాటు మరో 12 మందిపై అప్పట్లో నరసరావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈకేసులో అదే నెల 27వ తేదీన బాధం మాధవరెడ్డిని మరో నలుగరు వ్యక్తులకు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా వారికి నరసరావుపేట న్యాయ స్థానం రిమాండ్ విధించింది.ఆతరువాత ఈ కేసులోని నిందులందరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఆతరువాత నిందితుల తరపున ప్రముఖ న్యావాది మేడపాటి బాల సత్యనారాయణరెడ్డి నిందుతుల తరపున బెయిల్ మంజూరుకు నరసరావుపేట జిల్లా న్యాయస్థానంలో వాదనలు వినింపించగా గతంలో ఆరుగురు వ్యక్తులకు న్యాయస్తానం బెయిలు మంజూరు చేయడంతో విడుదలయ్యారు. తాజాగా శుక్రవారం న్యాయ స్థానంలో మిగిలిన నిందులకు బెయిల్ మంజూరుకై న్యావాది మేడపాటి బాలసత్యనారాయణరెడ్డి వాదనలు వినింపించగా న్యాయమూర్తి ఎం.సత్యశ్రీ బాదితుల తరపున న్యావాది వానదలను ఏకీభివిస్తూ పోలీసులు ప్రధాన నిందితునిగా అభియోగం మోపిన బాదం మాధవరెడ్డితో సహ మరో నలుగురు వ్యక్తులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈనేపథ్యంలో న్యాయస్థాన నిభందనలకు అనుగుణంగా నిందితుల తరపున పూచీకత్తు తీసుకని శనివారం నాడు మాధవరెడ్డితో పాటు మరో ముగ్గురు నరసరావుపేట ప్రత్యేక సభ్ జైలు నుండి విడుదలయ్యారు.ఈ కేసులో పోలీసులు మొత్తం 13 మందిపై కేసు నమోదు చేయగా ఇప్పటి వరకు 11మందికి న్యాయస్థానం బెయిలు మంజూరు యేయగా 10మందివిడుదలయ్యారు. బెయిలు మంజూరైన ఒకవ్యక్తితోపాటు ఇప్పటి వరకు బెయిలు మంజూరుకాని మరో ఇద్దరు మొత్తం ముగ్గరు వ్యక్తులు నరసరావుపేట ప్రత్యేక ఉప కారాగారంలో ఉన్నారు.

## మైనంపాడులో ముమ్మరంగా మొక్కలు పంపిణీ



**సంతనూతలపాడు, అక్టోబ్ 18, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామంలో శనివారం నాడు స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వర్పంచ్ డి.రమణ, ఉప సర్పంచ్ జి.సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్, గ్రామస్తులకు ముమ్మరంగా మొక్కలను పంపినీ చేశారు. ఈ సందర్భంగా మొదట వారు మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్ పిలుపునిచ్చారు. గ్రామంలో 2500 మొక్కలను వీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సైకిళ్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

**అద్దంకి అక్టోబరు 18 ప్రభాతవార్త**




అద్దంకి టౌన్ కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురకాయపాలెం పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీ గొట్టిపాటి రవికుమార్ ఉచితంగా 356 సైకిళ్లు పంపిణీ చేశారు. అద్దంకి నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల సైకిళ్లు పంపిణీ చేయాలనే సంకల్పంతో, ఈ కార్యక్రమాన్ని దశలవారీగా కొనసాగిస్తున్నట్లు మంత్రిగొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సుదూర ప్రాంతాల్లో నివసించడం వల్ల పిల్లలు చదువుమధ్యలో మానేయకూడదనే సంకల్పంతో ,ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉచిత సైకిళ్లు అందజేస్తున్నామని మంత్రి తెలిపారు. గ్రామీణ విద్యా పురోభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి చిన్నారి విద్యావకాశంపొందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

## పట్టణంలోని మూడు వార్డులలో కోటి సంతకాల కార్యక్రమం




**అద్దంకి, అక్టోబరు 17, ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంలోని 7,8,9 వార్డులలో శనివారం మెడికల్ కళాశాల ప్రవేటి కరణకు వ్యతిరేకంగా నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కోటి సంతకాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కాకాని రాధకృష్ణమూర్తితోపాటు, పట్టణంలోని పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## అశోక్ కుమార్‌ను కలిసిన వైసిపి లీగల్ సెల్ నేత

**అద్దంకి ,అక్టోబరు 18, ప్రభాతవార్త**



అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్‌ను అద్దంకి నియోజకవర్గ వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షులు యర్రమోతు రమేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి బోకే అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

## మద్యం సేవించి వాహనాలను నడిపిన వారికి జరిమాన

**అద్దంకి ,అక్టోబరు 18, ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంలో మద్యం సేవించి, వాహనాలను నడిపిన నలుగురు వ్యక్తులను పట్టణ సి.ఐ. ఎ. సుబ్బరాజు అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఎజిఎఫ్‌సిఎం కోర్టు న్యాయమూర్తి బి. అఖిల ఒకరికి 4వేలు, మిగిలిన వారికి 3వేలు చొప్పున జరిమాన విధించారు. పేకాట ఆడిన వ్యక్తులను కూడ కోర్టుకు హాజరు పరచగా వీరికి కూడ ఒక్కొక్కరికి 300 రూపాయాలు ఫైన్ విధించినట్లు సి.ఐ. తెలిపారు.

## భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణం

**తాళ్లూరు, అక్టోబర్ 18,ప్రభాతవార్త**



భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణ కల్పన ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఒక మొక్కనాటి సంరక్షించాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో పి. అజిత ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర లో భాగంగా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యమైన జీవనం అనే అంశంపై ప్రతిజ్ఞ, మానవహారం, సైకిల్ తొక్కడం, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలితో మెరుగైన ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బస్సులు లేదా ఉమ్మడి ప్రయాణ సాధనాలలో ప్రయాణించడం వలన వాయు,శబ్ద కాలుష్యం నివారించవచ్చాన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ దగ్గర ప్రయాణాలు సైకిల్ పై చేయాలన్నారు . సైక్లింగ్ చేయడం వలన శారీరిక దారు ఢ్యంతో పాటు కాలుష్యం నివారణకు దోహదపడుతుందన్నారు. అనంతరం మొక్కలు నాటారు.సైకిల్ తొక్కారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఐదమా కంటి వెంకటేశ్వరరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు మేదగం వెంకటేశ్వర రెడ్డి,రాష్ట్ర నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిరెడ్డి ఒబులు రెడ్డి, సర్పంచ్ పోశం సుమలత (శ్రీకాంత్ రెడ్డి),సొసైటీ అధ్యక్షులు గొంది రమణా రెడ్డి (నమలి), వల్లభనేని సుబ్బయ్య, నాయకులు గొల్ల పూడి వేణు బాబు,ఐ. శ్రీనివాస రెడ్డి, నవులూరి విద్యా సాగర్, రాచకొండ వెంకట్రావు, పిన్నిక రమేష్, క్రైస్ రామకోటిరెడ్డి, తుమ్మ శివ నాగిరెడ్డి, వెంకటరెడ్డి, అధికారులు డిప్యూటీ ఎంపీడీవో దేవర కొండ మల్లేశ్వరి, ఎంఈఓ జి.సుబ్బయ్య, ఏ. బి. ప్రసాదు, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, ఏపీవో కె. వెంకటేశ్వర్లు,ఏపీఎం దేవరాజు, పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం,పోలీస్ సిబ్బంది,వివిధ శాఖల అధికారులు, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన డైరెక్టర్లు గోన చెన్నకేశవులు కటిక యోగానంద్

**రావ్వర్ల, అక్టోబరు 18, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన రావ్వర్ల లోని ఆదర్శ పాఠశాల జూనియర్ కాలేజ్ మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర విద్య మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ గోన చెన్నకేశవులు (గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్ మండల్ ఎంపీడీవో ఎస్ వెంకట్రామిరెడ్డిలు శనివారం సందర్శించారు. పాఠశాలల్లోని సమస్యలను ఇబ్బందులను ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్ లను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి తాము కృషి చేస్తామని వారికి తెలిపారు. గురుకుల పాఠశాలలో సింగిల్ ఫేస్ మోటార్ ఏర్పాటుకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారని వారి ఆదేశాల మేరకు పాఠశాలకు వెంటనే సింగిల్ ఫేస్ మోటార్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని అందుకు అవసరమైన మొక్కలను తాము అందిస్తామని వారన్నారు. విద్య వ్యవస్థలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది మనం కూడా ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తూ విద్యాభివృద్ధికి పాటుపడదామన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ కార్యక్రమాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు పరిశుభ్రత ముఖ్యమని దానిని ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని సిబ్బందికి విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల సిబ్బంది ఉపాధి హామీ సిబ్బంది స్థానిక నాయకులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న టిడిపి నాయకులు,సచివాలయ ఉద్యోగులు

**యర్రగొండపాలెం, అక్టోబరు 18, ప్రభాతవార్త**



స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అందరు భాగస్వాములు కావాలని యర్రగొండపాలెం నియోజక వర్గ మార్కెట్ యార్డు చైర్మన్ చేకూరి సుబ్బారావు తెలిపారు. ప్రతినెల మూడోశనివారంలో భాగంగా యర్రగొండపాలెంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయితీ కార్యదర్శి ఆధ్వర్యంలో జరిగింది. ప్రభుత్వ ఆదేశంతో భాగంగా సచివాలయ సిబ్బంది, విద్యార్థులతో కలిసి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీ మండల పరిషత్ కార్యాలయం నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు జరిగింది. ఈ ర్యాలీని మార్కెట్ యార్డుచైర్మన్ చేకూరి సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో తప్పని సరిగా పాల్గొనాలని కోరారు. పరిశుభ్రత స్వచ్ఛత కోసం ప్రతి విద్యార్థి కదలి రావాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా శుభ్రత పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ ర్యాలీలో మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగల్ రెడ్డి,కాపు నాయకులు తోటా మహేశ్ నాయుడు, ఆర్య వైశ్య నాయకులు కొత్తమాసు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## కోటి దీపోత్సవ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు, అక్టోబరు 18, ప్రభాతవార్త**



గిద్దలూరు పట్టణంలో నవంబర్ 2వ తేదీన కార్తీకమాసం సందర్భంగా ఒంగోలు రొడ్డులో పొలంరెడ్డి బాలకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న "కోటి దీపోత్సవం" కార్యక్రమ పోస్టర్‌ను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో 100 మంది హిమాలయ సాదువులు పాల్గొని మహా రుద్రాభిషేకం, మహా భస్మాభిషేకం నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పాలుగుళ్ల శివారెడ్డి, చేరెడ్డి ఎర్రారెడ్డి, శ్రీను, కృష్ణ, మురళీ, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

**గిద్దలూరు రూరల్, అక్టోబరు 18, ప్రభాతవార్త**



విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి పి స్వరూప రెడ్డి అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల ప్రశ్నపత్రాలను సూర్య విద్యానికేతన్ పాఠశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాలలో 4,60, వేల మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. మన జిల్లాలో సుమారు 30 వేల మంది విద్యార్థులు పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల కు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు ఈ పరీక్ష ఎంతగానో దోహదపడుతుందన్నారు. శాస్త్రీయతకుఖి ఖిహాయ్‌ఖి చెప్పండి. సూడో సైన్స్ కు ఖినోఖి చెప్పండి. సైన్స్ కుఖి సైఖిచెప్పండి. శాస్త్ర ప్రచార ఉద్యమానికి ఖిజైఖి చెప్పండి. దేశం కోసం ఖిసైన్స్‌ఖి అని చెప్పండి అనివిద్యార్థులకు పిలుపునిచ్చారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు జన విజ్ఞాన వేదిక నాయకులు డీజీ బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సైన్స్ టాలెంట్ టెస్ట్ ను నిర్వహిస్తూ, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి లో మనమందరము భాగస్వాములు కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యావేత్త, మాజీ సైంటిస్ట్ జి శ్యాంసుందర్ మాట్లాడుతూ నిత్యజీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలపై విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించాలన్నారు. గిద్దలూరు డివిజన్ అధ్యక్షులు డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో వస్తున్న మార్పులను గమనించాలన్నారు. విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకొని మూఢనమ్మకాలను విడనాడాలన్నారు. పాతాళ నాగేశ్వర స్వామి మాజీ చైర్మన్ శివాపురం ఆంజనేయులు మాట్లాడుతూ గత 36 సంవత్సరాలుగా జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించడం అనేది సాధారణ విషయం కాదన్నారు. ప్రవేట్ విద్యాసంస్థల అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కె. రామిరెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రభుత్వము చట్టం తీసుకొని రావాలని ద్వారా అందవిశ్వాసాలు, చాందస భావాలు తగ్గుతాయన్నారు. సైన్సును విస్తృతంగా ప్రచారం చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సాయి వోకేషనల్ మరియు రాజు పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ కొండేటి రాజ మాట్లాడుతూ మీరు ఏ స్థాయిలో ఉన్న కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు, సమాజానికి కృతజ్ఞత కలిగి ఉండాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ మదార్ భాష,టి.బిజు జాకబ్, ఎస్. వి. రమణ,కె.విశ్వనాథ్, పి నాగూర్‌వలి, ఎన్.వి.రంగారెడ్డి, రంగరాజన్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి

**త్రిపురాంతకం, అక్టోబర్ 18, ప్రభాతావార్త**



త్రిపురాంతకం మండలంలోని పలువురి వైఎస్ఆర్సిపి కార్యకర్తలను శనివారం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వారి గృహాల వద్దకు వెళ్లి పరామర్శించారు, ముందుగా మండల కేంద్రంలోని మిరియం పల్లి గ్రామంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకొని గృహానికి వచ్చిన మాలపోలు సుబ్బయ్య ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి, కుటుంబ సభ్యులతో కొద్దిసేపు గడిపి వారికి ఏ పరిస్థితుల్లోనైనా నేనున్నాను అనే భరోసా వారికి కల్పించారు. అనంతరం వెంటనే గణపవరం గ్రామానికి వెళ్లి ఇటీవల కాలంలోనే కంటి ఆపరేషన్ చేయించుకుని ఇంటికి తిరిగి వచ్చిన నూనె శరభారెడ్డి గృహం వద్దకు వెళ్లి ఆయనను పరామర్శించి కొద్దిసేపు వారితో గడిపారు. అనంతరం అదే గ్రామంలో ప్రమాదంలో తన కుమారుని కోల్పోయిన మంద పేరయ్య ఇంటి వద్దకు వెళ్లి వారికి కొన్ని ఆధారణ మాటలు చెప్పి వారికి దేర్యన్ని నింపారు. విషయం తెలుసుకున్న లేదా తెలిసిన వెంటనే అది శుభకార్యమా లేక అశుభ కార్యమా ఏదైనా సరే విషయం తెలిసిన వెంటనే తనకి ఎన్ని ముఖ్యమైన పనులు ఉన్నా సరే కార్యకర్తల శ్రేయసే పరమావధిగా భావించి వారి కుటుంబాల వద్దకు వెళ్లి వారిలో తాను కూడా ఒక కుటుంబ సభ్యుడి లాగా వారితో కలిసిపోవడం గొప్ప విశేషమే మరి. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సింగారెడ్డి పోలి రెడ్డి, ఎర్రగొండపాలెం మండల కన్వీనర్ ముసలారెడ్డి, ఎర్రగొండపాలెం జడ్పిటిసి విజయభాస్కర్, బాలకోటిరెడ్డి, త్రిపురాంతకం సర్పంచుల సంఘం అధ్యక్షులు శేషం రంగబాబు నాయుడు, మాజీ సర్పంచ్ మురారి గాలయ్య, వైఎస్ఆర్సిపి నాయకులు నక్క రామారావు, తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## యర్రగొండపాలెం నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన అజయ్ కుమార్

**యర్రగొండపాలెం, అక్టోబరు 18, ప్రభాతవార్త**




యర్రగొండపాలెం నూతన సీఐగా రీ.అజయ్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా వచ్చిన సిఐ అజయ్ కూమార్‌ను పోలీసు స్టెషను సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ యర్రగొండపాలెం సర్కిల్ పరిధిలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామాలలో పల్లె నిద్ర నిర్వహించి ప్రజలకు సైబర్ నేరాలు పట్ల అవగాహన కల్పిస్తామన్నారు. ఇప్పటి వరకు యర్రగొండపాలెం సిఐగా బాధ్యరహతలు చేపట్టిన ప్రభాకర్ రావు విఆర్‌కు బదిలీ అయినట్లు తెలుస్తుంది.

## శ్రీ గౌతమి డిగ్రీ కాలేజ్‌లో మెగా జాబ్ మేళా ...

### - 244 మందికి ఉద్యోగ అవకాశాలు

**మార్కాపురం, అక్టోబర్ 18, ప్రభాతవార్త**



పట్టణంలోని స్థానిక శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల మరియు వికాస సంస్థ సంయుక్తంగా స్థానికంగా నిర్వహించిన మెగా జాబ్ మేళా శనివారం విజయవంతంగా ముగిసింది. దేశంలోని ప్రముఖ 16 కంపెనీలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మొత్తం 244 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ గౌతమి విద్యా సంస్థల అధినేత కనుమర్ల గుండా రెడ్డి హాజరై విద్యార్థులకు నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగటానికి, ఉద్యోగ అవకాశాలను అందించడమే మా సంస్థ యొక్క ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ జాబ్ మేళాలోని అన్ని కంపెనీలను సమర్థంగా సమన్వయం చేసిన సుధీర్ విద్యార్థులకు సరైన అవకాశాలను కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. సీఈఓ నాగేంద్రబాబు, ప్రిన్సిపాల్స్ కే కాశీశ్వర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి,రవికుమార్,రవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ప్రకృతి రక్షణే.. ప్రజల రక్షణ..

### - మార్కాపురంలో మొక్కల నాటింపు కార్యక్రమం

**మార్కాపురం, అక్టోబర్ 18, ప్రభాతవార్త**



పట్టణంలోని స్థానిక మండల తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం పర్యావరణ పరిరక్షణకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా మొక్కల నాటింపు కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవిలు పాల్గొని తమ చేతులమీదుగా మొక్కలు నాటారు. ప్రకృతిని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరికి బాధ్యత ఉందని గుర్తుచేస్తూ "ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్క నాటి, భవిష్యత్ తరాల కోసం ఆక్సిజన్ సంపదను కాపాడాలి" అనే సందేశాన్ని ప్రజలకు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ రెవిన్యూ సిబ్బందితో పాటు, స్థానిక ప్రజలు, విద్యార్థులు కూడా పాల్గొని ఉత్సాహంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తాము సిద్ధంగా ఉన్నామన్న సంకేతాన్ని ఇచ్చారు. అధికారులు మాట్లాడుతూ, మొక్కల నాటకమే కాదు, వాటి సంరక్షణకు కూడా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు, వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా పోరాడటానికి ఇది మంచి మార్గమని పేర్కొన్నారు.

## ఎట్టకేలకు ఆర్‌అండ్‌బి శాఖ వారు దెబ్బతిన్న

### రెండు వంతెనలకు కోటి 34 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం




**సంతనూతలపాడు, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం ఏండ్లూరు డొంక వద్ద గల పూర్తిగా దెబ్బతిన్న వంతెన, అదే విధంగా సంతనూతలపాడు సమీపంలోని పెద్దగచ్చులు వద్ద తీవ్ర రంధ్రం ఏర్పడిన వంతెనలకు ఒంగోలు ఆర్‌అండ్‌బి శాఖ వారు కోటి 34 లక్షల రూపాయల వ్యయంతో ఎస్టిమేట్ తయారు చేసి, ఈఎన్‌సీ కార్యాలయానికి పంపించారు. సంతనూతలపాడు సమీపంలోని దెబ్బతిన్న వంతెనకు కోటి 12 లక్షల రూపాయలను, అదే విధగా ఎండ్లూరు డొంక దెబ్బతిన్న మరొక వంతెనకు 22 లక్షల రూపాయలు వ్యయంతో ఎస్టిమేట్స్ తయారు చేసినట్లు ఒంగోలు డివిజన్ ఆర్‌అండ్‌బి జేఈ దాసరి మాధవరావు తెలిపారు. దీనిపై ఈఎన్సీ కార్యాలయానికి ఎస్టిమేట్స్ నివేదికను పంపించినట్లు త్వరలో శాంక్షన్స్ కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే 2016, 17 సంవత్సరంలో సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక వద్ద దెబ్బతిన్న వంతెనకు అప్పటి ఆర్‌అండ్‌బి శాఖ అధికారులు 20 లక్షల రూపాయలను ఎస్టిమేట్స్ వేసి టెండర్లు వేయగా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఈ వంతెన నిర్మాణానికి ముఖ్యంగా డైవర్షన్ రోడ్డు వేయాల్సి ఉంది. ప్రస్తుతం మరలా అధికారులు కొత్తగా ఈ వంతెన నిర్మాణానికి 22 లక్షల రూపాయలను ఎస్టిమేట్స్ వేశారు. వీటికి వర్కు మంజూరు అయిన తదుపరి టెండర్ పిలిస్తే గతంలో లాగా మరలా యధాస్థితి కొనసాగుతుందని అంటున్నారు. ఆర్‌అండ్‌బి శాఖ నిబంధనల మేరకు 20 లక్షల రూపాయల వర్క్‌కు డైవర్షన్ రోడ్డు ఉండదని చెబుతున్నారు. అయితే ఈ వర్క్‌కు కాంట్రాక్టర్లు ముందుకు వస్తారో లేదో వేచి ఉండాల్సి ఉంది.

## స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా

### మొక్కల నాటిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు సంతనూతలపాడు హైస్కూల్లో శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎమ్మెల్యే విజయ్ కుమార్ కోరారు. తదుపరి సంతనూతలపాడు హైస్కూల్లో హెచ్‌ఎం ప్రమోదతో హైస్కూల్ అభ్యున్నతిపై సమీక్షించారు. స్థానిక హైస్కూల్లో అసంపూర్తిగా భవన నిర్మాణాలు ఉన్నట్లు, అదే విధంగా హైస్కూల్ తూర్పు వైపున ప్రహరి గోడ నిమిత్తం సర్వే చేయించి వాటి నిర్మాణం, ఆర్ఓ ప్లాంటు నిర్మాణం, క్లాస్ రూమ్‌లకు బెంచీలు, ఆవశ్యకత కలదని, హైస్కూల్ రూములకు స్లాబులు దెబ్బతిన్నట్లు ఎంఈఓ డి.వెంకారెడ్డి, హెచ్‌ఎం ప్రమోద, ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు. ఇందు నిమిత్తం ఎస్టిమేట్ వేయాలని మండల పరిషత్ పంచాయతీ అసిస్టెంట్ ఇంజనీర్ వీరాంజనేయులను ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఆదేశించారు. సంతనూతలపాడు సమీపంలో దెబ్బతిన్న పెద్ద గచ్చులు వంతెన, ఎండ్లూరుడొంక వద్ద నున్న దెబ్బతిన్న మరొక వంతెనలు వల్ల ఆర్‌అండ్‌బి రహదారి మరింత ప్రమాదకరంగా మారినట్టు పలువురు ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు వివరించారు. వంతెనలు నిర్మాణానికి అధికారులు ఎస్టిమేట్లు వేసి ఉన్నతాధికారులకు పంపించినట్లు త్వరలో మంజూరు కాగలరని ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ, స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, ఎంపీడీవో డి.సురేష్‌బాబు, తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, మండల విద్యాశాఖాధికారి డి.వెంకారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని సురేష్‌బాబు, పంచాయతీకార్యదర్శి ఎన్.ప్రతాప్ కుమార్, వెలుగు ఏపీఎం టి.బాబురావు, ఆర్‌డబ్ల్యూఎస్ పంచాయతీరాజ్ ఇంజనీర్లు మధుసూదన్‌రావు, వీరాంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు పబ్బిశెట్టి శ్రీనివాసరావు, వీఆర్వో దాసరి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, సంతనూతలపాడు, గుమ్మలంపాడు గ్రామాల టీడీపీ అధ్యక్షులు బొడ్డు శంకర్‌బాబు, బొడ్డపాటి చంద్రశేఖర్‌లు మార్కెట్ కమిటీ డైరక్టర్ కేవి శ్రీలత, మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్ధన్, సొసైటీ డైరక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి, త్రిపురాంతకం స్వామి దేవస్థానం చైర్మన్ శిఘాకొల్లి ఉమామహేశ్వరరావు, టీడీపీ నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, బి.యల్లమంద, సీహెచ్ వెంకటసుబ్బయ్య, మట్టా పోలిశెట్టి, పావులూరి నారాయణస్వామి చౌదరి, మద్దిరాల సుబ్బారావు, తన్నీరు భువన్న శ్రీనివాసరావు, నల్లగట్ల సుబ్బారావు, మార్పుడి అంజయ్య, కొప్పులుశ్రీనివాసరావు,రావులసుబ్బారావు,నల్లూరిర్ఘూన్సీ,అంగన్‌వాడీసిబ్బంది,హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.మొదటి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ హైస్కూల్‌కి రాగానే ఎంపీడీవో డి.సురేష్‌బాబు,తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి,ఎంఈఓ డి.వెంకారెడ్డి,హైస్కూల్ హెచ్‌ఎంప్రమోద,వెలుగుఏపీఎంటి.బాబురావు,పుష్పగుచ్చం అందజేసిశుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

## సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై మండల స్థాయిలో అవగాహన

**సంతనూతలపాడు, అక్టోబర్ 18, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నాడు మండల స్థాయిలో కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, సచివాలయ సిబ్బందికి, ఎంపీడీవో డి.సురేష్‌బాబు పర్యవేక్షణలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన ఈ సూపర్ జీఎస్టీని ప్రజలు సద్వినియోగపరుచుకునేందుకు చైతన్య పరచాలని ఎంపీడీవో సురేష్‌బాబు పిలుపునిచ్చారు. ముఖ్యంగా ట్రాక్టర్‌కు 50 వేల రూపాయల వరకు తగ్గినట్టు ఆయన పేర్కొన్నారు. అదే విధంగా కార్లు, బైకులు, మెడికల్స్, నిత్యవసర వస్తువులు తగ్గినట్లు ఆయన తెలిపారు. దీపావళిలో భాగంగా ఈ సూపర్ జీఎస్టీని ప్రజలు సంబరాలు చేసుకోవాలని ఎంపీడీవో సురేష్ బాబు పిలుపునిచ్చారు. ప్రజలను అన్ని విధాల ఈ సూపర్ జీఎస్టీ పట్ల చైతన్య పరచాలనిఆయన ఈ సందర్భంగా కోరారు.ఉపాధి కూలీలందరిచే నూరుశాతం మేరకు ఈకేవైసీ చేయించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందిని ఎంపీడీవో సురేష్‌బాబు ఆదేశించారు. ఈ సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, డిప్యూటీ ఎంపీడీవో పి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## 25న సంతనూతలపాడులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**సంతనూతలపాడు, అక్టోబర్ 18, ప్రభాతవార్త**



ఈ నెల 25వ తేదీన శనివారం ఉదయం 10గంటల 30 నిమిషాలకు సంతనూతలపాడులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ ఈ సమావేశానికి అధ్యక్షత వహించనున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలు రంగాల అభ్యున్నతిపై సమీక్షించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, కార్యదర్శులు తదితరులు హాజరు కావాల్సిందిగా ఎంపీడీవో సురేష్‌బాబు కోరారు. సంతనూతలపాడు మండలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నేటి వరకు 18 పంచాయతీలకు సంబంధించి మూడు రోజుల్లో 23 వేల, 756 మొక్కలు పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో సురేష్ బాబు వెల్లడించారు. మండలానికి 28 వేల 420 టేకు, గాను, వేప, మునగ, చింత, రుద్ర, గన్నీరు తదితర మొక్కలను కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ప్రజలకు వీటిని పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు వెల్లడించారు.

## జనసేన నేత దేవకి వెంకటేశ్వర్లుకు ఆహ్వానం

**కనిగిరి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరు కావాల్సిందిగా శ్రీశైలం పాలకమండలి సభ్యుడు, కనిగిరి జనసేన నాయకుడు దేవకి వెంకటేశ్వర్లును ఆహ్వానించారు. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి రాచపూటి వెంకటేశ్వర్లు శనివారం మర్యాదపూర్వకంగా వెంకటేశ్వర్లును కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. మంగళగిరిలో ఆదివారం ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది.

8_8.qxd 10/19/2025 12:17 AM Page 1



## వర్షాల వల్ల దెబ్బతిన్న రహదారి పునరుద్ధరించిన సర్పంచ్ వెంకటయ్య

### - స్పందనతో విద్యార్థుల ప్రశంసలు పొందిన యేరువారిపల్లి సర్పంచ్



**కనిగిరి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
కనిగిరి మండలం యేరువారిపల్లిలో పాఠశాలలు, అంగన్‌వాడీకి వెళ్లే రహదారి వర్షాల కారణంగా గుంతల మయంగా మారి, విద్యార్థులకు నడవడం కష్టంగా మారింది. ప్రతి రోజు ఈ దారిలో ప్రయాణించే విద్యార్థులు, చిన్నారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన హైస్కూల్ హెడ్ మాస్టర్ ఈ సమస్యను సర్పంచ్ వెంకటయ్య దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన వెంకటయ్య స్వయంగా స్థలాన్ని సందర్శించి మూడు ట్రక్కుల మట్టిని తరలించి రహదారి సరి చేసి పనులను పర్యవేక్షించారు. పనులు పూర్తయ్యే వరకు తానే అక్కడ ఉండి పర్యవేక్షించిన ఆయన తక్షణ చర్యతో గ్రామ ప్రజల ప్రశంసలు పొందారు. సమస్య పరిష్కరించినందుకు స్కూల్ హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సర్పంచ్ వెంకటయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ భారీ ర్యాలీ

### - జీఎస్టీ తగ్గింపుతో లబ్ది పొందండి.. విద్యుత్ శాఖ పిలుపు






**కనిగిరి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ కనిగిరి డివిజన్, నెడ్‌క్యాప్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమం కనిగిరి పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఆర్టీసీ డిపో వద్ద ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం నుండి పామూరు బస్టాండ్ సెంటర్ వరకు విద్యుత్ శాఖ ఉద్యోగులు నినాదాలతో భారీ ర్యాలీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమాకాంత్ పాల్గొని మాట్లాడుతూ ఉమాకాంత్ సోలార్ పలకలపై జీఎస్టీ 12 శాతం నుంచి 7 శాతానికి తగ్గించడంతో వినియోగదారులు ఒక్కొక్కరు సుమారు రూ.9వేల నుంచి రూ.12వేల వరకు లబ్ది పొందవచ్చని తెలిపారు. అదే విధంగా జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా కేంద్ర ప్రభుత్వం రీ న్యూయాబుల్ సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణకు దోహదపడే విధానాలను అమలు చేస్తోందని చెప్పారు. సహజ ఇంధన వనరుల వాడకాన్ని తగ్గించడానికి రూపకల్పన చేసిందన్నారు. ప్రధానమంత్రి సోలార్ పథకం ద్వారా ప్రతి వినియోగదారుడు గరిష్టంగా రూ.78వేల వరకు లబ్ది పొందడంతో పాటు జీఎస్టీ సేవింగ్స్ ద్వారా లబ్దిదారుడు అదనంగా రూ.12వేల వరకు లబ్ది చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నెట్ కాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అశోక్ ఏడీ కృష్ణారెడ్డి, ఏఈ పవన్ కుమార్, కనిగిరి డివిజన్ ఏఈలు, లైన్‌మెన్‌లు, ఇతర ఉద్యోగులు పాల్గొని వినియోగదారులు విద్యుత్ శాఖ అందిస్తున్న ఈ జీఎస్టీ సేవింగ్స్ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకుని, సోలార్ వినియోగాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ నాయకుడు షేక్ ఫిరోజ్, కొండా కృష్ణారెడ్డి, బజాజ్ ఓబుల్‌రెడ్డి, అచ్చాల రవి,మురళి, పెన్నా వెంకటేశ్వర్లు, పచ్చవ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 15వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**కనిగిరి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు శనివారం కనిగిరి టౌన్ 15వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, వార్డు అధ్యక్షులు కే.జకరయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి రెహమాన్, బూత్ ఇన్‌చార్జిలు షేక్ జిలాని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా హాజరై ప్రజలకు రేషన్ కార్డులను అందజేశారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సమయానుకూలంగా అందేలా చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారు.

## ప్రజల కంటి వెలుగుకు ఉగ్ర ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**కనిగిరి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా జననీ చారిటబుల్ ట్రస్టు, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అమరావతి గ్రౌండ్స్ వద్ద జరిగింది. కంటి వైద్యులు శృతిక, మనోజ్ మొత్తం 125 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 94 మంది రోగులు ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారిని ఉగ్ర నరసింహారెడ్డి ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో ఈనెల 21వ తేదీన శంకర కంటి ఆసుపత్రికి తరలించనున్నారు. ఈ సేవా కార్యక్రమంలో మహిళా నాయకులు టౌన్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు.

## తగు జాగ్రత్తలతో బాణసంచా కాల్చాలి

### - ఉషా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వై సునీల్ కిషోర్



**ఒంగోలు, ప్రభాతవార్త**
దీపావళి బాణసంచా కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఒంగోలు అంజయ్య రోడ్డులోని ఉష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ వై సునీల్ కిషోర్ పేర్కొన్నారు. హాస్పిటల్ ఆవరణంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డాక్టర్ సునీల్ కిషోర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. బాణసంచా కాల్చే సమయంలో చర్మం కాలే ముప్పు ఎక్కువగా ఉంటుందన్నారు. కాళ్లు, చేతులు, వీళ్ళ ప్రాంతంలోని చర్మం గాయపడే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఆరు బయట ప్రాంతాలలోనే టపాసులు కాల్చడం మంచిదంటారు. ఇంటి కారిడార్, ఇంటి పై ప్రాంతాలలో టపాసులు కాల్చవద్దన్నారు. బాణసంచా కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించడం మంచిదన్నారు. సిల్క్ దుస్తులు ధరిస్తే ప్రమాదం అన్నారు. టపాసులను దూరంగా ఉండి వెలిగించాలన్నారు. టపాసులు వెలిగించేటప్పుడు కళ్ళజోడు పెట్టుకోవడం మంచిది అన్నారు. చిన్నపిల్లల్ని ఎత్తుకొని టపాసులు కాల్చవద్దన్నారు. టపాసులు కాల్చే వారి పక్కన చిన్నపిల్లలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చర్మం గాయపడితే ప్రథమ చికిత్స బాణసంచా కాల్చేటప్పుడు పొరపాటున చర్మం కాలితే కంగారు పడకూడదన్నారు. చర్మం మంట తగ్గేవరకు చల్లని నీరును గాయం పై ధారగా పోయాను అన్నారు. అనంతరం వైద్యుడిని సంప్రదించాలన్నారు. గాయం అయిన వెంటనే పేస్టులు పుయ్యడం, ఇంకు రుద్దటం, పసుపు పోయటం వంటి పనులు చేయవద్దని సూచించారు. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే దగ్గర్లోని ప్లాస్టిక్ సర్జన్ ను సంప్రదించాలన్నారు. ఎక్కువగా పొగ వచ్చే టపాసులు కాల్చడం వల్ల శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది అన్నారు. చేతిలో టపాసులు పేలితే. వెంటనే వైద్యున్ని సంప్రదించాలన్నారు. పెద్ద పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు వల్ల చెవి, కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. టపాసులు కాల్చేటప్పుడు కళ్ళజోడు పెట్టుకొని కాల్చాలని సూచించారు. తమ హాస్పిటల్ లో కాలిన గాయాలకు ప్రత్యేక చికిత్స ఉందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9293949335, 986670 0420, హాస్పిటల్ మేనేజర్ కొండరాజు వెంకట సాయి కృష్ణ సెల్ నెంబర్ 6303653004లను సంప్రదించాలన్నారు.

## స్వచ్ఛ కనిగిరి కోసం సైకిల్ తొక్కిన అధికారులు, నేతలు





**కనిగిరి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
వాయు కాలుష్యాన్ని తగ్గించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని కనిగిరి మున్సిపాలిటీ కమీషనర్ పిల్లి కృష్ణ మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల నిర్వహించే మూడవ శనివారం పర్యావరణ అవగాహన కార్యక్రమం ఈసారి క్లీన్ ఎయిర్ ఇతి వృత్తంతో కనిగిరిలో జరిగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయం నుండి సైకిల్ ర్యాలీకి కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి, చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు ప్రారంభం పలికారు. ర్యాలీలో మున్సిపల్ అధికారులు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణ ప్రధాన వీధులలో సైకిళ్లతో తిరుగుతూ స్వచ్ఛ కనిగిరి – శుభ్రమైన గాలి మన అందరి లక్ష్యం అంటూ నినాదాలు చేశారు. తరువాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని రైతు బజార్లో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్ మొక్కలు నాటి, పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కార్యాలయాలకు లేదా సమీప ప్రాంతాలకు వెళ్లే వారు నడుచుకుంటూ లేదా సైకిల్‌పై వెళ్లడం అలవాటు చేసుకోవాలి. దూర ప్రయాణాలకు ప్రజా రవాణా వినియోగిస్తే వాయు కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చు అని సూచించారు. ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగ్వాములు కావాలని, శుభ్రమైన గాలి కోసం బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్, మున్సిపల్ టీడీపీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి, తమ్మినేని వెంకటరెడ్డి, మోహన మురళి, షేక్ రెహమాన్, మస్తాన్‌బాబు, కోటా సురేష్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ బుల్ల బాలబాబు, యువరాజ్, రామసుబ్బారెడ్డి, ఇస్మాయల్, మహిళా నాయకులు, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఖోఖోలో మెరిసిన కనిగిరి క్రీడాకారిణులు





**కనిగిరి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
కనిగిరి ప్రతిభ మరోసారి జాతీయ స్థాయిలో వెలుగులు నింపబోతుంది. ఈ నెల 24 నుండి 26వరకు కర్ణాటకలోని దావనగరిలో జరగనున్న 31వ సౌత్ ఇండియా ఖోఖో ఛాంపియన్ షిప్‌లో పాల్గొననున్న ఆంధ్రప్రదేశ్ మహిళా జట్టులో కనిగిరి ప్రాంతానికి చెందిన ఏడుగురు క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఈ విషయంను జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షులు కే.భాస్కరరావు, కార్యదర్శి బి.కాశీవిశ్వనాథ్‌రెడ్డి శనివారం వెల్లడించారు.ఎంపికైన వారిలో ఎంఎన్‌ఎంకళాశాలకు చెందిన ఉ.నాగ మల్లేశ్వరి, ఎం.సఖియా, ఉ.శశికళ, ఎస్.పావని, ఆర్.యశోద ఉన్నారు.అదే విధంగా ఎంఎస్‌ఆర్ కళాశాలకు చెందిన బి.గుణవతి, పి.అమృత కూడా రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. వీరు ప్రస్తుతం కృష్ణా జిల్లా గన్నవరంలో జరుగుతున్న స్టేట్ ట్రైనింగ్ క్యాంప్‌లో శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా ఈ రోజు వీరిని ఎంఎన్‌ఎం కళాశాల అడ్వైజర్ పి.కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ టి.వెంకటరెడ్డి, రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్షులు టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి, కోశాధికారి కే.హనుమంతరావు, పీడీ బి.కాశీ విశ్వనాథ్‌రెడ్డి అభినందించారు.

## విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించాలి

### - ఎంఈఓ గుర్రం పెద్దరాజు



**హనుమంతునిపాడు, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
మండల పరిధిలోని సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఉపాధ్యాయుల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సీతారాంపురం క్లస్టర్ కాంప్లెక్స్ పరిశీలకుడు మండల విద్యాశాఖాధికారి గుర్రం పెద్దిరాజు పాల్గొని మాట్లాడుతూ వందశాతం విద్యార్థులు హాజరు అయ్యేటట్లుగా చూడాలని సీ అండ్ డీ గ్రేడ్ పిల్లల పట్ల శ్రద్ధ వహించి ప్రగతి సాధించేటట్లు అలాగే పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేటట్లు చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు కే.పద్మావతి, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, సీఆర్పీ బాదుర్ల తదితరులు పాల్గొన్నారు.

## జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టు



**దర్శి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం జనవిజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ పరీక్షలో 30 మంది విద్యార్థులు పరీక్ష రాయడం జరిగింది. పరీక్ష ఫలితాలు వెంటనే ప్రకటించబడ్డాయి. ప్రథమ బహుమతి, చిన్నయి, ద్వితీయ బహుమతి భారతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాదర్ మస్తాన్, కబీర్, జైహింద్‌రెడ్డి, ఉమాదేవి, అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్ బదులు సైకిల్ వాడాలి

### - చైర్మన్, తహసీల్దార్, ఎస్సై, కమీషనర్




**దర్శి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
దర్శి నగర మున్సిపాలిటీ పరిధిలోని శివరాజ్‌నగర్ వద్ద గల ఏపీ మోడల్ స్కూల్ నందు స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో మొక్కలు నాటి అనంతరం కాలుష్య నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతూ మోటారు సైకిల్ బదులు సైకిల్‌ను వాడాలని తెలియజేస్తూ మోడల్ స్కూల్ నుండి దర్శిలోని గడియారస్తంభం సెంటర్‌వరకు సైకిల్ తొక్కి సైకిల్ వాడుట వలన కాలుష్య నివారణ మాత్రమే కాకుండా ఆరోగ్యానికి కూడా మంచి వ్యాయామమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీనర్ మహేష్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎస్సై మురళి, మెప్మా ఆఫీసర్ రవికుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హసీనా భాను, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ గోపిశెట్టి అనూష, ఇత్తడి దినకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ



**దర్శి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ కేంద్ర ప్రభుత్వం అందించే అభివృద్ధి ఫలాల్లో ఒకటైన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ లో భాగంగా ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్ దర్శి డివిజన్ అధికారి ఈఈ పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో బహిరంగ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ దర్శి డివిజన్ ఆఫీసు నుండి మొదలై డీఎస్పీ ఆఫీసు, పీజీఎన్ కాంప్లెక్స్, క్లాక్ టవర్ సెంటర్ మీదుగా ఎంపీడీవో ఆఫీసుకు చేరింది. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ ద్వారా విద్యుత్ వినియోగదారులకు అందించే రాయితీలను వివరించడం జరిగింది. పీఎం సూర్య ఘర్‌లో భాగంగా గృహాలపై సోలార్ ప్యానెల్ అమర్చుకునే వారికి జీఎస్టీని 12 శాతం నుండి 5 శాతంకి తగ్గించడమైంది. తద్వారా క్లీన్ ఇండియా ఎన్విరాన్‌మెంట్ పొల్యూషన్, వికసిత్ భారత్, మేక్ ఇన్ ఇండియాలో భాగస్వాములం అయ్యే అవకాశం ఉందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జీఎస్టీ ఆఫీసర్ సుధాకర్, ఎమ్మార్వో, మండల మెజిస్ట్రేట్ శ్రావణ్, మున్సిపల్ కమీషనర్ మహేశ్వరరావు, ఎంపీడీవో కల్పన, మున్సిపల్ చైర్మన్ ఎన్.పిచ్చయ్య, అలాగే వినియోగదారులు, సబ్ డివిజన్ పరిధిలోని దర్శి టౌన్, దర్శి రూరల్, ముండ్లమూరు, తాళ్లూరు, కురిచేడు, సెక్షన్‌లలోని అందరూ ఏఈలు, ఇతర విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర



**దర్శి, అక్టోబర్18, ప్రభాతవార్త**
దర్శి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారంను స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టాలని ఇచ్చిన ప్రభుత్వ ఆదేశాల అమలులో భాగంగా శనివారం దర్శి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ నందు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. ఈ వారం నినాదమైన స్వచ్ఛమైన గాలి నినాదాన్ని పాటిస్తూ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కే.శ్రీనివాసరావు, ఎస్సై, సిబ్బంది, దర్శి పట్టణంలోని వారి వారి నివాసాల నుండి బైక్‌ల పైన గాని, స్టేషన్ వాహనంలో గాని రాకుండా కాలి నడకన నడుచుకుంటూ వారి వారి వీధుల కొరకు స్టేషన్‌కు చేరుకున్నారు. దీనిలో భాగంగా స్టేషన్‌లోని రికార్డులను ఫర్నిచర్‌ను ఎక్సైజ్ స్టేషన్ ఆవరణ లోని పరిసరాలను పరిశుభ్రం చేయటం జరిగింది.

## చిన్నమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ




**దర్శి, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
సత్తెనపల్లి నియోజకవర్గం నకరికల్లు మండలం తురకపాలెం గ్రామంలో నాగోతు చిన్నమ్మ దశదిన కార్యక్రమానికి దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ, రాష్ట్ర టీడీపీ డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, పువ్వాడ సూర్యనారాయణ, వెనిగండ్ల మధుసూదన్‌రావులు పాల్గొని చిన్నమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## కుర్రా శ్రీనివాసులు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే కందుల



**కొనకనమిట్ల, అక్టోబర్ 18, ప్రభాతవార్త**
మండలంలోని చిన్నారికట్లలో ఇటీవల మృతి చెందిన తెలుగుదేశం కార్యకర్త కుర్రా శ్రీనివాసులు కుటుంబానికి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మీకు అండగా ఉంటానని, తన అండదండలు ఎప్పుడూ ఉంటాయని అన్ని వేళలా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వీరితో పాటు మండల కన్వీనర్ ఎం.బాబురావు, నాయకులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముప్పా కాటమరాజు, వరికూటి వెంకట్రామిరెడ్డి, గొట్లగట్టు సర్పంచ్ పెరికే సుఖదేవ్, చిన్నారికట్ల నీటి సంఘం అధ్యక్షులు దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సెల్ నాయకులు అంకాల రోశయ్య, బి.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం, పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

- జీఎస్టీ సంస్కరణలతో ప్రజలందరికీ లబ్ధి
- విద్యారంగంలో సంస్కరణలకు మంత్రి లోకేశ్ శ్రీకారం
- పాఠశాల విద్య బలోపేతానికి మంత్రి లోకేశ్ కృషి
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్







**అద్దంకి , అక్టోబరు 18,ప్రభాతవార్త**
పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం నాడు అద్దంకి నియోజకవర్గం కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తో కలిసి మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. మేదరమెట్ల గ్రామ పంచాయతీలో దీనికి సంబంధించిన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కార్యక్రమంలో భాగంగా మేదరమెట్ల సెంటర్లోని గాంధీ విగ్రహానికి మంత్రి పూలమాల వేశారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్ నుంచి స్మార్ట్ బజార్ వరకు ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. ర్యాలీ అనంతరం అందరితో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మేదరమెట్ల గ్రామ పంచాయతీలో ఇంకుడు గుంతలను ప్రారంభించారు. మేదరమెట్ల నుంచి తమ్మవరం వరకు రూ. 1.44 కోట్లతో నిర్మించిన బీ.టీ రోడ్డును మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమానికి పెద్ద పీట వేసిందని అన్నారు. పరిసరాల పరిశుభ్రతను ప్రజలు తమ కర్తవ్యంగా భావించాలని మంత్రి గొట్టిపాటి కోరారు. ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెలలో మూడో శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర గా తీసుకొచ్చిందని తెలిపారు. మహిళలు ఇంట్లో పనికిరాని వ్యర్థాలను తడి చెత్త, పొడి చెత్తగా పంచాయతీకి అప్పగిస్తే.. సిబ్బంది వ్యర్థాలను వర్మీ కంపోస్టు ఎరువులుగా తయారు చేసి రైతులకు అందించడానికి చర్యలు తీసుకుంటారని మంత్రి వివరించారు. మేదరమెట్ల గ్రామ పంచాయతీలో అవసరం మేర పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మేదరమెట్ల గ్రామంలో రూ. 80 లక్షలతో సైడ్ డ్రైన్లను నిర్మించామని.. రెండవ దశలో మరో రూ. 2 కోట్లతో సీసీ రోడ్లను, సైడ్ కాలువలను ఏర్పాటు చేయాడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే మేదరమెట్ల ఎస్టీ కాలనీలో సైడ్ కాలువలు నిర్మాణం కోసం రూ.25 లక్షలు మంజూరు చేశామని చెప్పారు. మేదరమెట్ల జిల్లా పరిషత్ హైస్కూల్ లో 400 మంది విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశామని ఆయన చెప్పారు. జలజీవన్ మిషన్ క్రింద మూడు కోట్ల రూపాయలతో త్రాగునీరు అందించడానికి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మేదరమెట్ల గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సైడ్ కాలువ నిర్మించడానికి అంచనాలు తయారు చేయవలసిందిగా అధికారులను ఆదేశించామని త్వరలో నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ప్లాస్టిక్ రహిత జిల్లాగా బాపబ్లాపట్ల జిల్లాలో ప్లాస్టిక్ నిషేధించడానికి చర్యలు చేపడుతున్నామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఇందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అద్దంకి మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో ప్లాస్టిక్ నిషేధించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మేదరమెట్ల గ్రామ పంచాయతీలో విద్యుత్ సమస్యను తొలగించడానికి 700 కరెంటు స్తంభాలను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. పర్యావరణ పరిరక్షణ దిశగా అటవీ శాఖ అధికారులు ప్రతి ఇంటికి ఒక మొక్కను పంపిణీ చేయాలని ఆదేశించారు. మొక్కలను పెంచే విధంగా మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. మొక్కల పెంపకానికి అవసరమైన గ్రీన్ గార్డులను అందజేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉంటామని గుర్తు చేశారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కొరిశపాడు మండలం మేదరమెట్ల, అద్దంకి టౌన్ బంగ్లా రోడ్ ప్రాంతాల్లో జరిగిన "సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్" అవగాహన కార్యక్రమాల్లో రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పాల్గొన్నారు. అమలులోకి వచ్చిన కొత్త జీఎస్టీ స్లాబులపై వ్యాపారులకు, వినియోగదారులకు అవగాహన కల్పిస్తూ, ప్రతి దుకాణం ముందు జీఎస్టీ వివరాలు బోర్డులపై ప్రదర్శించాలని సూచించారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జీఎస్టీ శాతాన్ని తగ్గించిందని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు.

19-10Pg5 9_19-10Pg5.qxd 10/18/2025 11:31 PM Page 1



# అఫ్ఘాన్‌పై పాక్ వైమానిక దాడులు

**- ముగ్గురు క్రికెటర్లతో సహా 8 మంది మృతి - మరో ఏడుగురికి గాయాలు - పిరికిపంద చర్యగా అభివర్ణించిన అఫ్ఘాన్ - భారత్ సహా ప్రపంచ దేశాలు ఖండన - దాడులు మా పనే: పాక్ అంగీకారం - తీరుమారని పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ - భారత్‌పై మళ్లీ అణు బెదిరింపులు**



**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ పాకిస్తాన్, అఫ్ఘన్‌పై వైమానిక దాడులకు పాల్పడింది. ఈస్ట్రన్ పాక్టికా ప్రావిన్స్‌పై శుక్రవారం రాత్రి జరిపిన వైమానిక దాడుల్లో 8 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ఏడుగురు గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు అఫ్ఘన్ క్రికెటర్లు ఉన్నారు. ఆ ముగ్గురిని కబీర్, సిగ్బతుల్లా, హరూన్‌లుగా గుర్తించినట్లు అఫ్ఘన్ క్రికెట్ బోర్డు తెలిపింది. పాక్ సరిహద్దులోని తూర్పు పాక్టికా ప్రావిన్స్‌లోని షరానా నుంచి ఉర్గున్‌కు తిరిగొచ్చి సమావేశమై ఉండగా దాడి జరిగిందని అఫ్ఘన్ అధికార వర్గాలు వెల్లడించాయి. పాక్ దాడిని పిరికిపంద చర్యగా తాలిబన్ ప్రభుత్వం అభివర్ణించింది. భారత్ సహా ప్రపంచ దేశాలన్నీ ముక్తకంఠంతో ఖండించాయి. ఈ దాడికి నిరసనగా, పాకిస్థాన్‌తో జరగాల్సి న త్రైపాక్షి క టీ20 సిరీస్ నుంచి తప్పుకుంటున్నట్లు అఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు(ఎసిబి) ప్రకటించింది. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు నిర్ణయంతో నవంబర్ 5 నుంచి 29 వరకు లాహోర్, రావల్పిండిలలో జరగాల్సి న ఈ ట్రైసిరీస్ అనిశ్చితిలో పడింది. అయితే, ఆఫ్ఘన్ సరిహద్దుల్లోని టీటీపీ అనుబంధ సంస్థ అయిన హాఫీజ్ గుల్ బహదూర్ గ్రూప్‌ను లక్ష్యంగా చేసుకుని కచ్చితత్వంతో కూడిన వైమానిక దాడులు చేశామని పాక్ అంగీకరించింది. ఈ ఘటనపై ఆఫ్గన్ క్రికెట్ కెప్టెన్ రషీద్ ఖాన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక పాకిస్తాన్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. పాక్ చర్యను పూర్తిగా అనైతికంగా, అమానుషంగా ఆయన పేర్కొన్నారు. పౌరులు, మహిళలు, పిల్లలు, దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కలలు కంటున్న యువ క్రికెటర్లు ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పౌరులను లక్ష్యంగా చేసుకోవడం పూర్తిగా అనైతికం, అమానుషమని, పాకిస్థాన్ చట్టవిరుద్ధమైన చర్యలతో మానవ హక్కులను తీవ్రంగా ఉల్లంఘించిందంటూ ఫైర్ అయ్యాడు. ఈ మానవ హక్కుల ఉల్లంఘనలను అంతర్జాతీయ వేదికపై లేవనెత్తాలని రషీద్ ఖాన్ డిమాండ్ చేశారు. భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో తోక ముడిచిన పాక్ ఇప్పటికీ తన వక్రబుద్ధిని మార్చుకోవడం లేదు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ తాజాగా మరోసారి భారత్‌ను అణ్వాయుధాల పేరుతో బెదిరించే ప్రయత్నం చేశారు. కాకుల్‌లోని పాకిస్థాన్ మిలటరీ అకాడమీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆసిమ్ మునీర్ రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. అణ్వాయుధ ప్రపంచంలో పోరాటాలకు తావులేదని అంటూనే భారత్‌పై విషం కక్కారు. భారత్ నుంచి రెచ్చగొట్టే చర్యలు చిన్నగా ఉన్నా పాకిస్తాన్ ఊహించని విధంగా నిర్ణయాత్మకమైన జవాబు ఇస్తుందని అన్నారు. పాక్ తన శక్తి సామర్థ్యాలను పెంచుకుంటోందని, భారత భౌగోళిక భద్రతను దెబ్బతీయగలమని అన్నారు. యుద్ధం తర్వాత పరిణామాలకు భారత్ బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. భారత్ ఏదైనా రెచ్చగొట్టే చర్యకు పాల్పడితే తమ నుంచి నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించారు. పాక్‌లో ఉంటున్న అఫ్ఘనిస్తానీలు వెంటనే దేశాన్ని వీడాలని పాక్ రక్షణ శాఖ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ తేల్చి చెప్పారు. పాక్ భూభాగం, ఇక్కడి వనరులు 250 మిలియన్‌ల మంది పాక్ పౌరులకేనని స్పష్టం చేశారు. ఆత్మగౌరవం ఉన్న ఏ దేశం విదేశీ భూమి, వనరులపై ఆధారపడదని అన్నారు. అఫ్ఘనిస్తానీల కోసం కాబుల్‌లో ఇస్లామిక్ ప్రభుత్వం ఒకటి ఉందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఖవాజా ఆసిఫ్ సోషల్ మీడియా వేదికగా మాట్లాడుతూ... "ఒకప్పుడు మా ఆశ్రయంలో తలదాచుకున్న కాబూల్ పాలకులు, ఇప్పుడు భారత్ ఒడిలో కూర్చుని మాపై కుట్ర చేస్తున్నారు. ఇకపై శాంతి చర్చలు, విజ్ఞప్తులు ఉండవు. ఉగ్రవాదం ఎక్కడి నుంచి పుట్టుకొచ్చినా, వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది" అని హెచ్చరించారు. మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఇప్పటికే ఎనిమిది యుద్ధాలను పరిష్కరించానని, ఇప్పుడు పాకిస్తాన్- అఫ్ఘనిస్తాన్ మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించడమే తన తదుపరి లక్ష్యమని ఆయన ప్రకటించారు. ఆ వివాదాన్ని పరిష్కరించడం తనకు చాలా సులువైన పని అని ఆయన అభివర్ణించారు. శుక్రవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో లంచ్ సందర్భంగా ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. పాక్ దాడి చేసిందో లేదా అఫ్గాన్ నుంచి దాడి జరుగుతుందో నాకు అర్థమైంది. నేను గానీ దానిని పరిష్కరించాల్సి వస్తే, దాన్ని పరిష్కరించడం నాకు సులభం అని వ్యాఖ్యానించారు.

## మీరు రగిలించిన నిప్పు.. మీ ఇంటినే కాలుస్తోంది!

### పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్‌పై అఫ్ఘాన్ మాజీ ఎంపి తీవ్ర విమర్శలు



**కాబూల్, అక్టోబరు 18:** పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్ మధ్య ఘర్షణలు మళ్లీ భగ్గుమన్నాయి. అఫ్ఘాన్‌లోని పాక్టికా ప్రావిన్స్‌పై పాక్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో ముగ్గురు యువ క్రికెటర్లుసహా పలువురు మృతి చెందారు. ఈ క్రమంలో పాక్ ఆర్మీ చీఫ్ అసీంమునీర్‌పై అఫ్ఘాన్ మాజీ ఎంపి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మునీర్ ఎగదోస్తున్న ఉగ్రవాదం అనే మంట.. ఆయన ఇంటినే (పాక్‌ను ఉద్దేశిస్తూ) కాల్చేస్తోందని వ్యాఖ్యానించారు. తాజా దాడులపై అఫ్ఘాన్ మాజీ ఎంపి మరియం సోలైమాంఖిల్ ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. పాక్‌ది పిరికిచర్య అంటూ దాడులను తీవ్రంగా ఖండించారు. భారత్, అఫ్ఘాన్‌లపై పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, దాని సైన్యం దశాబ్దాలుగా ఇదే హింసకు పాల్పడుతోందన్నారు. వాళ్లు చేసే దాడుల్లో యువ క్రికెటర్లు, చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకరమన్నారు. ఈ క్రమంలోనే ఆమె పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దశాబ్దాలుగా ఉగ్రవాదుల్ని పెంచి, వారిని ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారన్నారు. 'మీరు ఎగదోసిన మంటే.. మీ సొంత ఇంటిని కాల్చేస్తోందని గుర్తు పెట్టుకోండి' అని వ్యాఖ్యానించారు. ఇక, అఫ్ఘాన్‌కు భారత్ మద్దతును ఆమె ప్రశంసించారు. ఇటీవల అఫ్ఘాన్ విదేశాంగ మంత్రి ఆమీర్ ముత్తాఖీ ఇక్కడ పర్యటించిన విషయాన్ని ప్రస్తావించారు. భారత్‌కు అఫ్ఘాన్ దగ్గరవ్వడాన్ని పాక్ సహించలేకపోతుందని విమర్శించారు. మా ఇరుదేశాల మధ్య శాంతిని చూడలేకపోతుందని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా తీవ్రవాద భావజాలానికి వ్యతిరేకంగా భారత్-అఫ్ఘాన్ మధ్య బలమైన సహకారం ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. శుక్రవారం అర్థరాత్రి అఫ్ఘాన్‌పై పాక్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది. ఇందులో ముగ్గురు క్రికెటర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో పాకిస్థాన్, శ్రీలంక జట్లతో తలపడబోయే ముక్కోణపు సిరీస్ నుంచి వైదొలుగుతున్నట్లు అఫ్ఘానిస్థాన్ క్రికెట్ బోర్డు (ఎసిబి) ప్రకటించింది. 48 గంటపల కాల్పుల విరమణ పూర్తయిన వెంటనే ఈ దాడులు జరగడం గమనార్హం.



## ట్రంప్‌తో భేటీ వేళ పుతిన్‌ను అరెస్టు చేస్తారా?

**వాషింగ్టన్, అక్టోబరు 18:** అమెరికా రాష్ట్రం అలాస్కాలో భేటీ తర్వాత.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మరోసారి సమావేశమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధాన్ని ముగించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోన్న ట్రంప్.. ఈసారి ఐరోపాకు చెందిన హంగరీ దేశంతో పుతిన్‌తో భేటీ కానున్నారు. దీనికి సంబంధించి ఇంతవరకు తేదీలు ఖరారు కాలేదు. ఈ సమావేశం వేళ.. అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిసి) జారీ చేసిన వారెంట్ కింద పుతిన్‌ను అరెస్టు చేస్తారంటూ వార్తలు వస్తున్నాయి. ఐసిసికి ప్రత్యేకంగా పోలీసు దళం అంటూ ఏదీ లేకపోవడంతో సొంతంగా అరెస్టులు చేయలేదు. అరెస్టు వారెంటును అమలు చేయడానికి సభ్య దేశాలపై అధారపడుతుంది. దీని ప్రకారం.. రష్యా అధ్యక్షుడి విమానం తమ గగనతలంలోకి ప్రవేశించగానే హంగరీ, దాని పొరుగు దేశాలు సెర్బియా, రొమేనియా ఆయనను అరెస్టు చేసేందుకు వీలుంటుంది. దీనికి సంబంధించి జర్మనీ నుంచి హంగరీకి రిక్వెస్ట్ కూడా వచ్చింది. ఐసిసిలో హంగరీ సభ్యదేశమే అయినప్పటికీ.. ఆ సభ్యత్వాన్ని వదులుకోవాలని ప్రధాని విక్టర్ ఒర్బన్ నిర్ణయం తీసుకున్నారు. ఏప్రిల్‌లోనే దానికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది. అయినాసరే, అరెస్టు చేయడానికి అవకాశం ఉంటుంది. అధ్యక్షుడు ట్రంప్‌నకు ఒర్బన్ చిరకాల మిత్రుడు. అదే సమయంలో రష్యాతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పుతిన్ రక్షణకు హంగరీ హామీ ఇస్తోంది.

## రిజర్వుబ్యాంకు బంగారం నిల్వలు రూ.9 లక్షలకోట్లు!

**న్యూఢిల్లీ,అక్టోబరు 18:** భారత రిజర్వ్ బ్యాంక్ పెద్ద ఎత్తున బంగారం కొనుగోళ్లు జరుపుతోంది. ఇప్పుడు చరిత్రలో తొలిసారి భారత్‌లో బంగారం నిల్వలు 100 బిలియన్ డాలర్ల మార్కును అధిగమించాయి. చరిత్రలో ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ఈ మేరకు ఆర్బీఐ ఇటీవల విదేశీ మారకపు నిల్వలకు సంబంధించిన డేటా విడుదల చేసింది. బంగారం ధరలు విపరీతంగా పెరుగుతుండటం వల్ల కూడా ఆర్బీఐ గోల్డ్ కొనుగోలు చేస్తోంది. మొత్తం భారత్‌లో బంగారం నిల్వలు ఇటీవల వారం వ్యవధిలోనే 3.595 బిలియన్ డాలర్లు పెరిగి విలువ అక్టోబర్ 10 నాటికి 102.365 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది భారత కరెన్సీలో చూస్తే ఏకంగా రూ. 9 లక్షల కోట్లకుపైనే ఉంటుంది. అయితే ఇక్కడ బంగారం నిల్వలు పెరిగినా ఓవరాల్‌గా విదేశీ మారకం నిల్వలు మాత్రం తగ్గాయి. ఇది 2.18 బిలియన్ డాలర్లకుపైగా తగ్గి 697.784 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. మొత్తం ఫారెన్ ఎక్స్చేంజ్ రిజర్వ్‌ల్లో బంగారం నిల్వలు 14.7 శాతానికి చేరగా 1996-97 తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి కావడం విశేషం. గత దశాబ్ద కాలంలో భారత్.. బంగారం నిల్వల్ని వేగంగా పెంచుకుంటూ వస్తోంది. ఈ క్రమంలో విదేశీ మారకంలో అప్పుడు 7 శాతంగా ఉండగా ఇప్పుడు రెట్టింపు చేస్కొని ఏకంగా 15 శాతానికి పెంచుకోవడం విశేషం. ఇది కేంద్ర బ్యాంక్ బంగారం కొనుగోలు చేయడాన్ని ధరల పెరుగుదలను ప్రతిబింబిస్తుందని చెప్పొచ్చు. ఏదేమైనా గతేడాది కంటే ఈ సంవత్సరం.. ఆర్బీఐ బంగారాన్ని ఎక్కువగా కొనుగోలు చేయలేదు.

## ప్రపంచ మార్కెట్లను శాసించే సత్తా భారత్‌కే

### కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్



**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** భారతదేశపు సాంకేతిక సత్తాను ప్రపంచానికి చాటిచెబుతూ కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. అత్యంత సంక్లిష్టమైన 2 నానోమీటర్ల సెమీకండక్టర్ చిప్‌లను మన దేశంలోనే డిజైన్ చేస్తున్నామని, ఈ రంగంలో ప్రపంచ మార్కెట్‌ను శాసించే సత్తా భారత్‌కు ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన వరల్డ్ సమ్మిట్‌లో ప్రసంగించిన ఆయన, స్వదేశీయంగా అభివృద్ధి చేసిన ఒక సెమీకండక్టర్ వేఫర్‌ను చేతిలోకి తీసుకుని ప్రదర్శించారు. ప్రపంచంలోని మొత్తం గ్లోబల్ చిప్ డిజైన్ ఇంజనీర్లలో ఇప్పటికే 20 శాతం మంది మన దేశంలోనే ఉన్నారు. ఇది మనకు ఒక ప్రత్యేకమైన బలాన్ని ఇచ్చింది. గతంలో 5 లేదా 7 నానోమీటర్ల చిప్‌లను డిజైన్ చేసేవాళ్ళం. కానీ ఇప్పుడు అత్యంత చిన్నవి, సంక్లిష్టమైనవి అయిన 2 నానోమీటర్ల చిప్‌లను ఇక్కడే డిజైన్ చేస్తున్నాం అని వివరించారు. చిప్ తయారీ అనేది ఎంత క్లిష్టమైన ప్రక్రియో ఆయన సులభంగా పోల్చి చెప్పారు. ఒక చిన్న వేఫర్‌పై ఒక పూర్తి నగరాన్ని నిర్మించడం లాంటిది ఈ ప్రక్రియ. దానికి దాని సొంత ప్లంబింగ్, హీటింగ్, ఎలక్ట్రికల్ నెట్‌వర్క్, సర్క్యూట్‌లు అన్నీ ఉంటాయి. చిప్‌లోని సర్క్యూట్‌లు మానవ వెంట్రుక కంటే 10,000 రెట్లు చిన్నవిగా ఉంటాయని తెలిపారు. చిప్ తయారీ పరిశ్రమలో ఐదు నిమిషాలు విద్యుత్ సరఫరా నిలిచిపోతే 200 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతుందని ఒకరు తనతో చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా, డేటా సార్వభౌమాధికారం ప్రాముఖ్యతను వైష్ణవ్ నొక్కిచెప్పారు. "డేటాయే కొత్త ఆయిల్. డేటా సెంటర్లు కొత్త రిఫైనరీలు. నేటి ఆర్థిక వ్యవస్థలో రూపుదిద్దుకుంటున్న ఈ కొత్త ఆర్థికశక్తిపై మనకే నియంత్రణ ఉండాలి.

## 27 నెలలుగా జీతాలే లేవు..

### పంచాయితీ ఆఫీసు ముందే వాటర్ మ్యాన్ ఆత్మహత్య!



**కాలాబురాగి, అక్టోబరు 18:** 27 నెలలుగా జీతం రావడం లేదన్న మనస్తాపం ఓపక్క.. అధికారుల వేధింపులు మరోపక్క. తాళలేక ఓ వాటర్ మ్యాన్ తాను పనిచేస్తున్న పంచాయతీ కార్యాలయం ముందే ఆత్మహత్య చేసుకున్నాడు. కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. హుంగనూరు గ్రామ పంచాయతీలో 2016 నుంచి వాటర్ మ్యాన్‌గా పనిచేస్తున్న చికూస నాయక అనే వ్యక్తి, తనకు రావాల్సి న జీతాల కోసం ఏళ్లుగా పోరాడుతున్నాడు. తన ఆవేదనను వివరిస్తూ రాసిన సూసైడ్ నోట్‌లో పలు కీలక విషయాలను వెల్లడించాడు. నాకు 27 నెలలుగా జీతం రాలేదు. ఈ విషయంపై పంచాయతీ అభివృద్ధి అధికారి (పీడీఓ), గ్రామ పంచాయతీ అధ్యక్షురాలికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. చివరికి జిల్లా పంచాయతీ సీఈఓను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేగాక పీడీఓ రామే గౌడ, పంచాయతీ అధ్యక్షురాలి భర్త మోహన్ కుమార్ తనను మానసికంగా తీవ్రంగా వేధించారని చికూస నాయక ఆరోపించాడు. సెలవు అడిగితే నా స్థానంలో వేరే వ్యక్తిని చూసుకుని వెళ్లమనేవారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆఫీసులోనే ఉండమని బలవంతం చేసేవారు. వారి వేధింపుల వల్లే నేను చనిపోతున్నాను. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూసైడ్ నోట్‌లో కోరాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. సూసైడ్ నోట్ ఆధారంగా పీడీఓ, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు, ఆమె భర్తపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు. ఘటన జరిగిన వెంటనే జిల్లా పంచాయతీ సీఈఓ స్పందించి, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పీడీఓ రామే గౌడను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ దురదృష్టకర సంఘటనపై కర్ణాటక బీజేపీ, సిద్ధరామయ్య ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ ప్రభుత్వ ఆత్మహత్యల భాగ్యంలో మరో ప్రభుత్వ ఉద్యోగి బలి అయ్యాడు.

## సంక్షిప్తంగా..

### విమానం గాలిలో ఉండగా లగేజీలో మంటలు



**బీజింగ్, అక్టోబరు 18:** విమానం గాల్లో ఉన్న సమయంలో ఓ ప్రయాణికుడి లగేజీలో మంటలు చెలరేగిన ఘటన చైనాలో చోటుచేసుకుంది. లగేజీలోని బ్యాటరీ పేలడంతో ప్రయాణికులంతా భయభ్రాంతులకు గురయ్యారు. విమానంలో పొగ చేరడంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఎయిర్ చైనా విమానయాన సంస్థకు చెందిన విమానం శనివారం తూర్పు చైనాలోని హాంగ్‌జౌ నుంచి కొరియాలోని సియోల్ సమీపంలోని ఇంచియాన్‌కు బయల్దేరింది. విమానం గాలిలోకి లేచిన కొంత సేపటికే ఓ ప్రయాణికుడి లగేజీలోని లిథియం బ్యాటరీ పేలడంతో మంటలు అంటుకున్నాయి. మంటలు ఓవర్‌హెడ్ బిన్ నుంచి బయటకు రావడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు.

### సమీర్ వాంఖడే కేసులో కేంద్రానికి రూ.20 వేలు జరిమానా


**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** ఐఆర్ఎస్ ఆఫీసర్, మాజీ ఎన్సీబీ జోనల్ డైరెక్టర్ సమీర్ వాంఖడే కేసులో కేంద్రానికి 20 వేల జరిమానా విధించింది ఢిల్లీ హైకోర్టు. సమీర్ వాంఖడే ప్రమోషన్‌కు చెందిన కేసులో దాఖలు చేసిన పిటీషన్‌లో కొన్ని వాస్తవాలను దాచిపెట్టిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఫైన్ వేసింది. జస్టిస్ నవీన్ చావ్లా, మధు జైన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. అభ్యర్థన దాఖలు చేయడానికి ముందు కేంద్రం అన్ని అంశాలను వాస్తవికంగా చెప్పాలని ధర్మాసనం పేర్కొన్నది. షారూక్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్‌ను ఓ రేవ్ పార్టీ కేసులో అరెస్టు చేసిన సమయంలో సమీర్ వాంఖడే అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రస్తుతం సమీర్ వాంఖడే ఆర్థిక శాఖకు చెందిన రెవెన్యూ డిపార్టమెంట్‌లో అదనపు కమిషనర్‌గా చేస్తున్నారు. షారూక్ కుమారుడిని అరెస్టు చేసిన సమయంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోలో ముంబై జోనల్ డైరెక్టర్‌గా చేశారు. ఒకవేళ అర్హుడైతే వాంఖడేను జాయింట్ కమిషనర్‌గా ప్రమోట్ చేయాలని కేంద్రానికి క్యాట్ ఇచ్చిన ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు ఆగస్టు 29వ తేదీన తన తీర్పులో సమర్థించింది.

### శబరిమలై ఆలయ ప్రధాన పూజారిగా ఇడి ప్రసాద్



**పతనంతిట్ట, అక్టోబరు 18:** కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామి ఆలయానికి ప్రధాన పూజారిగా ఈడీ ప్రసాద్ ఎంపికయ్యారు. ఆయన స్వగ్రామం త్రిసూరు జిల్లాలోని చాలకుడి. సంప్రదాయ పద్ధతిలో డ్రా విధానంలో మేల్‌సంతిని ఎంపిక చేశారు. ఇవాళ ఉదయం 8 గంటలకు సన్నిధానంలో ప్రధాన పూజారి ఎంపిక ప్రక్రియ జరిగింది. ప్రస్తుతం ఆరేశ్వరం శ్రీ ధర్మ శాస్త ఆలయంలో ప్రసాద్ పూజారిగా చేస్తున్నారు. పాండలం రాచ కుటుంబానికి చెందిన కశ్యప వర్మ ఆధ్వర్యంలో శబరిమల మేల్‌సంతి డ్రా జరిగింది. శబరిమల మేల్‌సంతి ఎంపిక ప్రక్రియను పాండలం రాచ కుటుంబీకుల చిన్నారులతో చేపట్టాలని 2011లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం డ్రా నిర్వహించారు. కశ్యప్ ప్రస్తుతం అయిదో గ్రేడ్ చదువుతున్నాడు. నెదర్లాండ్స్‌లోని అల్మేర్‌లో ఆ పిల్లోడు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నాడు.

### మంటల్లో చిక్కుకున్న గరీబ్‌రథ్‌కోచ్



ఫతేఘర్‌సాహిబ్, అక్టోబరు 18: అమృత్‌సర్ సహర్సా గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లోని ఒక బోగీకి హటాత్తుగా మంటలు అలుముకున్నాయి. సమీపంలోని సిర్‌హింద్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఈ మంటలు ఉన్న బోగీ దగ్ధం అవుతుండటంతో ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు తెలిపారు. రైల్వేబోర్డు వివరాలప్రకారం ఒక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతున్నట్లు రైల్వేబోర్డు ప్రకటన విడుదలచేసింది. ఉదయం 7.30 గంటలకు మంటలు అలుముకున్నాయి. అమృత్‌సర్‌నుంచి వస్తున్న ఈ రైలు సిర్‌హింద్ స్టేషన్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. జీఆర్‌పి పోలీసులు మాత్రం ఒక ఎసి కోచ్‌నుంచి పొగరావడాన్ని గమనించామని చెప్పారు ప్రయాణీకుడు ఒకరు అలారమ్ చైన్ లాగారు. దీనితో ప్యాసింజర్లు అందరూ సురక్షితంగా కోచ్‌నుంచి బయటపడ్డారు.

## ప్రశాంత్‌కిశోర్‌కు రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ ప్రశంసలు!


**పాట్నా, అక్టోబరు 18:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంటున్న తరుణంలో జన్ సూరజ్ పార్టీ అధినేత, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌పై రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రశాంత్ కిశోర్ చేపట్టిన ఉద్యమం రాష్ట్ర రాజకీయాలపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతుందని, ఈ ఎన్నికల్లో ఆయన పార్టీ కచ్చితంగా కొన్ని స్థానాలను గెలుచుకుంటుందని జోస్యం చెప్పారు. హరివంశ్ మాట్లాడుతూ, ప్రధాన రాజకీయ పక్షాలు పట్టించుకోవడం మానేసిన కీలకమైన ప్రజా సమస్యలను ప్రశాంత్ కిశోర్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నారు. అయితే, ఈ సమస్యలకు పరిష్కారం దొరకడానికి చాలా సమయం పడుతుందని అభిప్రాయపడ్డారు. పీకే లేవనెత్తుతున్న అంశాలను ప్రస్తుతం ఇతర పార్టీలు కూడా ప్రస్తావిస్తున్నప్పటికీ, వాటికి తగినంత ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కిశోర్ రాజకీయ విధానాన్ని ఆయన ప్రముఖ సోషలిస్టు నేతలు జయప్రకాశ్ నారాయణ్, డాక్టర్ రామ్ మనోహర్ లోహియాలతో పోల్చారు. 1967 నాటికి ఆ నేతలు లేవనెత్తిన ప్రజా సమస్యలు రాజకీయాలను ఎలా ప్రభావితం చేశాయో గుర్తుచేశారు. అదేవిధంగా, ప్రశాంత్ కిశోర్ ప్రస్తావిస్తున్న అంశాలు కూడా భవిష్యత్తులో బీహార్ రాజకీయాలపై గణనీయమైన ప్రభావం చూపుతాయని ఆయన అంచనా వేశారు. బీహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు.

## స్వదేశీ పరిజ్ఞానంతో శ్వాసకోశ వ్యాధులకు ఔషధం తయారీ

### కొత్త యాంటీ బయాటిక్ 'నాఫిథ్రోమైసిన్' అభివృద్ధి

**న్యూఢిల్లీ,అక్టోబరు 18:** వైద్య పరిశోధన రంగంలో భారత్ ఒక కీలక మైలురాయిని అందుకుంది. దేశంలోనే తొలిసారిగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో 'నాఫిథ్రోమైసిన్' అనే కొత్త యాంటీబయాటిక్‌ను అభివృద్ధి చేసినట్లు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) డాక్టర్ జితేంద్ర సింగ్ శనివారం ప్రకటించారు. మొండిగా మారిన శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను ఎదుర్కోవడంలో ఈ యాంటీబయాటిక్ అత్యంత సమర్థవంతంగా పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఒక వైద్య సదస్సులో ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా క్యాన్సర్ రోగులు, మధుమేహం అదుపులో లేని వారికి ఈ కొత్త ఔషధం ఎంతో మేలు చేస్తుందని వివరించారు. ఈ ఔషధానికి సంబంధించిన ఆలోచన, అభివృద్ధి, క్లినికల్ ప్రయోగాలు అన్నీ పూర్తిగా భారత్‌లోనే జరగడం ఫార్మా రంగంలో ఆత్మనిర్భరతకు నిదర్శనమని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఇదే సందర్భంలో, హీమోఫిలియా వ్యాధికి జన్యు చికిత్సలో కూడా భారత్ చరిత్రాత్మక విజయం సాధించిందని మంత్రి వెల్లడించారు. దేశీయంగా నిర్వహించిన తొలి క్లినికల్ ట్రయల్ విజయవంతమైందని, ఈ చికిత్స ద్వారా 60 నుంచి 70 శాతం వరకు వ్యాధిని సరిదిద్దగలిగామని ఆయన చెప్పారు. ప్రయోగాల ఫలితాలను న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురించారని, వైద్య పరిశోధనల సత్తాను ప్రపంచానికి చాటిందని అన్నారు.

## మొజాంబిక్ తీరంలో పడవ బోల్తా ముగ్గురు భారతీయులు మృతి



**మపుటో, అక్టోబరు 18:** మొజాంబిక్‌లోని బీరా పోర్టు తీరంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భారతీయులతో ప్రయాణిస్తున్న ఒక బోటు బోల్తా పడటంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. ఈ దురదృష్టకర సంఘటనను మొజాంబిక్‌లోని భారత హైకమిషన్ అధికారికంగా ధ్రువీకరించింది. అసలేం జరిగిందంటే సముద్రంలో లంగరు వేసి ఉన్న ఒక ఆయిల్ ట్యాంకర్‌లోకి సిబ్బందిని తరలించేందుకు 14 మంది భారతీయులతో ఒక బోటు బయలుదేరింది. బీరా పోర్టు సమీపంలో ఈ సిబ్బంది బదిలీ ప్రక్రియ జరుగుతుండగా, అనుకోని రీతిలో బోటు నీటిలో బోల్తా పడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.



## ఉక్రెయిన్ అధ్యక్షుడితో అమెరికా అధ్యక్షుడి భేటీ!

### అందంగా ఉన్నారంటూ జెలెన్‌స్కీకి ట్రంప్ కితాబు

**వాషింగ్టన్, అక్టోబరు 18:** గాజాపై హమాస్ ఇజ్రాయెల్‌లమధ్య ఒప్పందం పూర్తిచేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ఉక్రెయిన్‌రష్యా యుద్ధంపై పూర్తిగా దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ భేటీ అయ్యారు. తోమహాక్ క్షిపణులు, ఇతర ఆయుధాల కోసం జెలెన్‌స్కీ అమెరికా చేరుకున్నారు. వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అక్కడ ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. క్యాబినెట్ రూమ్‌లో జరిగిన లంచ్ మీటింగ్‌కి జెలెన్‌స్కీ స్టైలిష్ షూట్ ధరించి వచ్చారు. ఆ సూట్ అధ్యక్షుడి దృష్టిని ఆకర్షించింది. జాకెట్ నిజానికి చాలా స్టైలిష్‌గా ఉంది. ఇందులో మీరు చాలా అందంగా కనిపిస్తున్నారు అంటూ అధ్యక్షుడు కితాబిచ్చారు. అక్కడితో ఆగకుండా అవును, చాలా అందంగా అంటూనే ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తారని ఆశిస్తున్నానని అన్నారు.

19-10pg6exHMNWJQE 10_19-10pg6exHMNWJQE.qxd 10/18/2025 11:17 PM Page 1





## 21న కేదారగౌరీ వ్రతం

**శ్రీకాళహస్తి, అక్టోబరు 18 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో కేదారగౌరీ వ్రతాన్ని మంగళ వారం నిర్వహించనున్నట్లు ఆలయాధికారి డి.బాపిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పూజలు మహిళల మనోభావాలకు అనుగుణంగా నిర్వహిస్తామన్నారు. ఈ ఏర్పాట్లకు సంబంధించి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచనలతో అధికారులు, అర్చకులు, వేదపండితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏర్పాట్లకు సంబంధించి దిశా నిర్దేశం చేసారన్నారు. సామూహిక కేదారగౌరీ వ్రతాన్ని రాయలవారి మండపంలో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఇళ్ళలో నిర్వహించుకోలేని వారు ఆలయం లో పాల్గొంటున్నారు. ఈ వ్రతంలో పాల్గొనే మహిళలకు ఆలయం తరఫున వాయనాలు అందించటమే కాకుండా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసా మన్నారు. ఆలయంలో నిర్వహించే సేవలు, రాహుకేతు దోష నివారణ పూజలు యథావిధిగా జరుగుతాయని వివరించారు. ఈ నెల 25న నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఇఒ డి.బాపిరెడ్డి తెలిపారు.

## మోడీపై పొగడ్తలు ఆపి ఎపికి నిధులు తెండి

**- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**



**విజయవాడ, అక్టోబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాని నరేంద్రమోడీ మాటలతో బురిడీ కొట్టిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వడం లేదన్నారు. మోడీ రాష్ట్రంలో సభలకు వచ్చినప్పుడల్లా రూ.200ల నుంచి రూ.300కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇటీవల జిఎస్‌టి సభ పేరుతో ఏపీ ప్రభుత్వం రూ.300 కోట్లు ఖర్చు చేసినా రాష్ట్రానికి రూపాయి పెట్టుబడి ప్రకటించలేదన్నారు. ఆత్మనిర్భర్ భారత్ పేరుతో పేదలను దోచుకుని పెద్దలకు రాయితీలు ఇస్తున్నారని, ఇటువంటి విధానాలను ప్రజలు అంగీకరించరని, తిరగబడతారని హెచ్చరించారు. విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకరరెడ్డితో కలిసి శ్రీనివాసరావు మాట్లాడారు. బిజెపి నాయకులు చెప్పే అభివృద్ధి బూటకం, రాయలసీమ డిక్లరేషన్ నాటకం అన్నారు. దాన్ని కప్పిపుచ్చుకునేందుకు జిఎస్‌టి పేరుతో సభలు జరుపుతున్నారని పేర్కొన్నారు. జిఎస్‌టి వల్ల పెద్దగా మిగిలేదేమీ లేదని, మనిషికి రూ.1600 మాత్రమేనని అన్నారు. రూ.5000 కోట్లు పెడితే మెడికల్ కళాశాలలు పూర్తవుతాయని, అయినా చేయకుండా గూగుల్‌కు రూ.22 వేల కోట్లు మినహాయింపులు ఇచ్చారని ప్రపంచ చరిత్రలో ఇంత పెద్దమొత్తంలో సబ్సిడీ ఇచ్చింది లేదన్నారు. బిజెపి అధికారంలోకి ఉండి రాయలసీమ డిక్లరేషన్ అమలు చేయకపోవడంపై ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ పొగడటం మాని రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టాలని సూచించారు.

# నకిలీ మద్యం నిరోధంలో దూకుడు

**● ఎక్సైజ్ సురక్ష యాప్‌కి విశేష స్పందన ● 79వేల మందికి పైగా డౌన్‌లోడ్ ● 1,81,738 స్కాన్లు... 174,687 లేబుల్స్ నిజమైనవిగా గుర్తింపు ● 3,152 స్కాన్ల పరంగా డ్యామేజ్ లేబుల్స్... ఆ మద్యం వెనక్కి ● స్కాన్ చేసిన తరువాతే మద్యం విక్రయాలు: ప్రభుత్వం ఆదేశాలు**

**విజయవాడ, అక్టోబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** నకిలీ మద్యం నియంత్రణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ మద్య నిషేధ, ఎక్సైజ్ శాఖ చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ఇటీవల ప్రారంభించిన ఏపీ ఎక్సైజ్ సురక్ష" మొబైల్ యాప్ ప్రజల్లో విశేష ఆదరణ పొందింది. ఈ యాప్ ద్వారా వినియోగ దారులు తమకు అందిన మద్యం బాటిల్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి దాని ప్రామాణికతను నిర్ధారించుకునే అవకాశం కలిగింది. మరోవైపు స్కాన్ చేసిన తరువాతే మద్యం విక్రయాలు జరపాలని ఎక్సైజ్ కమీషనర్ ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్ 13 నుండి 18 వరకు యాప్‌ను 79 వేల మందికి పైగా డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ కాలంలో మొత్తం 1,81,738 స్కాన్లు జరగగా, వాటిలో 1,74,687 లేబుల్స్ నిజమైనవిగా తేలాయి. మిగిలిన 3,152 స్కాన్ల పరంగా డ్యామేజ్ లేబుల్స్, తప్పు అక్షరసంఖ్య కోడ్లు వంటి కారణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని వియోగదారులకు విక్రయించ కుండా వెనక్కి పంపించారు.

ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, యాప్ ద్వారా సేకరించిన సమాచారం నకిలీ మద్యం కదలికలను గుర్తించడంలో ముఖ్యపాత్ర పోషిస్తోంది. ఈ యాప్ వినియోగదారుల ద్వారా వచ్చిన నివేదికలను విశ్లేషిస్తూ, అధికారులు ప్రతి ప్రాంతంలో లేబుల్స్‌ను ధృవీకరిస్తున్నారు. నకిలీ లేదా చెల్లని కోడ్ కనుగొనబడిన వెంటనే సిస్టమ్ స్వయంచాలకంగా అలర్ట్ ఇస్తుందని అధికారులు పేర్కొన్నారు. యాప్



స్కాన్ చేసి చూస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర(ఫైల్ ఫోటో)

పారదర్శకతను పెంచడమే కాకుండా, వినియోగ దారుల అవగాహనను కూడా పెంచుతోంది.

రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం దందా నియంత్రణలో భాగంగా ఇప్పటి వరకు 5000 శాంపిల్స్‌ను ఎక్సైజ్ శాఖ తనిఖీ చేసింది. అన్ని సక్రమంగానే ఉన్నట్లు గుర్తించారు. మొలకల చెరువు, ఇబ్రహీంపట్నంకు సంబంధించి గుంటూరులోని ప్రయోగశాలకు 45 మద్యం శాంపిళ్లను పంపించింది. ల్యాబ్‌లో నిర్వహిం చిన రసాయన పరీక్షల్లో కొన్ని నమూనాలు నాణ్యత ప్రమాణాలు అందుకోలేకపోయినట్లు తేలింది. ఆల్కహాల్ శాతం తక్కువగా ఉన్న విషయాన్ని గుర్తించారు. ఈ ఫలితాల ఆధారంగా మరింత లోతుగా పరిశోధనలు కొనసాగుతాయని, నాణ్యత ప్రమాణాలు ఉల్లంఘించిన తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని శాఖ ప్రకటించింది.

అధికారికంగా సీల్ చేయబడిన బాటిల్స్ మాత్రమే కొనుగోలు చేయాలని, అనుమానాస్పద బాటిల్ కనిపించినప్పుడు వెంటనే సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేయాలని సూచించింది. నకిలీ లేదా చెల్లని కోడ్ గుర్తిస్తే దాన్ని వెంటనే తిరస్కరించాలని ప్రజలను కోరింది. నకిలీ మద్యం తయారీ, నిల్వ, సరఫరా లేదా అమ్మకాలలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పారదర్శకతను పెంచే దిశగా ఎక్సైజ్ శాఖ తీసుకున్న ఈ చర్య రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు పొందుతోంది. సురక్ష యాప్ ద్వారా ప్రజల భాగస్వామ్యం పెరగడం, వ్యవస్థపై నమ్మకం మరింత బలపడడం మద్యం నియంత్రణలో పెద్ద ముందడుగుగా పరిగణించ బడుతోంది.

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

**మంత్రులు అచ్చెం నాయుడు, వాసంశెట్టి సుభాష్, నిమ్మల రామానాయుడు**

**పాలకొల్లు, అక్టోబరు 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతాంగానికి, ప్రజలకు మేలు జరిగేలా వ్యవసాయ మార్కెట్ కమిటీకి సెస్ ద్వారా వచ్చే ఆదాయం పాలకవర్గాలే నిర్ణయం తీసుకోవడంతో పాటు స్వయంప్రతిపత్తి కలిగేలా సంబంధిత శాఖ అధికా రులకు ఆదేశాలు ఇచ్చామని తద్వారా పాలకవర్గాలకు గౌరవం పెరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కె టింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెం నాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో శనివారం జరిగిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకా రోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధ్యక్షత వహించారు. సభలో రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు పీతల సుజాత, కుడిపూడి సత్తిబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, వలవల బాబ్జి, పొత్తూరి రామరాజు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, ఉన్నమట్ల కబర్ది తదితరులు పాల్గొని మాట్లాడారు. ముందుగా కమిటీ పాలకవర్గ అధ్యక్షునిగా కోడి విజయభాస్కర్, ఉపాధ్యక్షునిగా రాపాక రత్నంరాజు, డైరెక్టర్లతో మంత్రి రామానాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రి అచ్చెం నాయుడు మాట్లాడుతూ వచ్చే 26వ తేదీ నుంచి రబీ ధాన్యం కొనుగోలు మొదలవుతాయని, 24 గంటల్లో రైతులు ఖాతాల్లో సొమ్మును ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ హామీలన్నిటిని అమలు చేసామన్నారు. రాష్ట్రాన్ని చిన్నా భిన్నం చేసిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారంలోకి రావడం, ఆయనకు తోడుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాన మోడీ ఈ ముగ్గురి కలయిక రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. మరో మంత్రి సుభాష్ మాట్లాడుతూ బీసీలకు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా మేలు జరిగిందంటే టిడిపిలో మాత్రమే అన్నారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చరిత్రలో మొట్టమొదటిసారిగా బలహీనవర్గాలైన బీసీలకు చైర్మన్ పదవి కట్టబెట్టడం బీసీల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్నా నిబద్ధత అని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 50శాతం రాయితీతో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను అందిస్తే గత ప్రభుత్వంలో కనీసం బరకం ముక్క కూడా ఇవ్వలేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో మళ్లీ రాయితీతో యాంత్రికరణ పరికరాలు అందజేయడం జరుగుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం లో రైతులు ధాన్యం అమ్ముకోవాలంటే రైస్ మిల్లుల వద్ద రెండు మూడు రోజులు పడిగాపులు పడడంతో పాటు ధాన్యం సొమ్ము అందేది కాదు. నేడు ఆ పరిస్థితి లేదు. రైతులు తమకిష్టమైన రైస్ మిల్లు వద్ద అమ్ముకోవడంతోపాటు 24 గంటల్లోపు ధాన్యం సొమ్ము జమ జరిగిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా మేలు జరిగే కార్యక్రమాలతోనే ముందుకు వెళుతుందన్నారు. సభలో చైర్మన్ విజయభాస్కర్, ఇతర పాలకవర్గ సభ్యులను మంత్రులు సత్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ తరఫున మంత్రి అచ్చం నాయుడు, సుభాష్, పితాని సత్యనారాయణ తదితరులను మంత్రి రామానాయుడుతో కలిసి విజయభాస్కర్ సత్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఓ పండుగ వాతావరణం లో సాగింది. వేలాది మంది రైతులతో పాటు టిడిపి జనసేన, బిజెపి శ్రేణులు, మహిళలు పెద్ద సంఖ్యలో నియోజకవర్గ నలుమూలల నుంచి పాల్గొన్నారు.

# చేతిలో చిల్లిగవ్వ లేదు.. పండగ ఎలా జరుపుకునేది?

**సామాన్యుడి బతుకు దుర్భరం**



వర్షంతో వెలవెలబోతున్న బాణాసంచా దుకాణాలు

**శ్రీకాళహస్తి, అక్టోబరు 18 ప్రభాతవార్త:** చేతిలో చిల్లి గవ్వ లేదు. అప్పు అడుగదామంటే అప్పు ఇచ్చే దాత కరువయ్యాడు. మరి పండగ ఎలా చేసుకోవాలి? మార్కెట్లో చూస్తే ధరల దరువు దడ పెట్టిస్తుంది. ఈ పరిస్థితిలో పండగలు ఎలా జరుపుకోవాలనే మీమాంశంలో సామాన్యుడు కొట్టుమిట్టాడుతున్నాడు. ఇక గ్రామాల్లో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. మూడు రోజులుగా ఎడతెరపిలేని వానలతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితి. ఈ స్థితిలో పండగ ఏం చేసుకుంటామనే నిరాశ నిస్రృహలు చోటు చేసుకున్నాయి. దాంతో పండగలకు రద్దీగా కళకళ లాడే దుకాణాలు జనం లేక వెలవెల బోతున్నాయి. ఇక టపాసుల ధరలు ఆకాశాన్ని అంటాయి. దాంతో టపాకాయల చిటపటలు కూడా వినబడటం లేదు. దీపావళి చిటపటలు దేవుడెరుగు నిత్యావసర సరకుల ధరలు దడపుట్టిస్తున్నాయి. నూనెల ధరలు తగ్గినట్లు అనిపిస్తుండగా అనుకున్న స్థాయిలో తగ్గలేదు. దీపావళి పండగను చేసుకోవాలనే తపన ఉన్నా పనుల్లేక తల్లడిల్లుతున్నారు. దాంతో దీపావళి, నోములు ఏం చేసుకోవాలని మదనపడుతున్నారు. పండగలంటే చేతి నిండా డబ్బులుంటే ఉత్సాహం కానీ చిల్లి గవ్వ లేకుండా ఏం చేస్తారు?

### మార్కెట్‌లో ధరల మాయాజాలం

మార్కెట్‌లో ధరల మాయాజాలం సామాన్యుల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. వారం రోజుల క్రితం, రెండు రోజుల క్రితం ఉన్న ధరలు ప్రస్తుతం లేదు. దాంతో కొనుగోలు దారుడు ఏం చేయాలో తెలియక తికమక పడుతున్నారు. వారం క్రితం ఉన్న ధరలకు నేటి ధరలకు ఎంతో వ్యత్యాసం చోటుచేసుకుంది. ముఖ్యంగా నిత్యావసరంగా ఉపయోగించే వస్తువుల ధరలు పెరుగుతుండటంతో పండగలు, పబ్బాలు, వివాహాలు, శుభ కార్యక్రమాల్లో నిరాశ నిస్రృహలు చోటు చేసుకుంటున్నాయి. అప్పులు చేసి సంబరాలు చేయాలన్నా భరించలేక చివరకు 'క్యాటరింగ్ వైపు' దృష్టి మరల్చుతున్నారు. మార్కెట్లో ధరలు కంటనీరు తెప్పిస్తున్నాయి.



బాధిత కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న కెనరా బ్యాంక్, రైల్వే అధికారులు

## రైల్వే కార్మిక కుటుంబాలకు కెనరా బ్యాంక్ చేయూత

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 18 ప్రభాతవార్త:** దక్షి ణ మధ్య రైల్వేలో పనిచేస్తూ మృతి చెందిన రైల్వే సిబ్బంది కుటుంబాలకు రైల్వే, కెనరా బ్యాంకు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని అధైర్యపడకుండా ఆత్మస్థైర్యంతో నిలబడాలని ప్రిన్సిపల్ సిపిఒ సిద్దార్థ్ కట్టి, డిప్యూటీ సిపిఒ ఎం.బాల మురళీధర్, కెనరా బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దిబ్యలోచన్ స్వరం, రైల్ నిలయం శాఖ మేనేజర్ రాధికలు భరోసా ఇచ్చారు. రైల్ నిలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఈఏడాది జనవరి 8న సహజంగా మృతి చెందిన సీనియర్ మాలీ ఖాన్ జహాంగీర్ బేగం కుటుంబానికి రూ.10 లక్షలు, అలాగే ఈ ఏడాది ఫిబ్రవరి 22న ప్రమాదంలో అకాలమరణం గావించిన పిఎఫ్ఏ జోనల్ ప్రధాన కార్యాలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న దుర్గేశ్వరరావు కుటుంబానికి రూ.1.04 కోట్లు చెక్కులను వారు ఈసందర్భంగా బాధిత కుటుంబాలకు అందజేశారు.

రైల్వే సిబ్బంది కెనరా బ్యాంకులో ఎలాంటి బీమా పథకాలు తీసుకోకపోయినా, కేవలం కెనరా బ్యాంకులో ఖాతా కలిగి ఉండి, రైల్వే సాలరీ ప్యాకేజీ పథకంలో ఉన్న రైల్వే సిబ్బంది ప్రమాదవశాత్తు మరణిస్తే కోటి రూపాయలు బీమా, సహజ మరణము గావించిన వారికి పదిలక్షల రూపాయల బీమా పథకాన్ని కెనరా బాధిత కుటుంబాలకు చెల్లిస్తుందని వెల్లడించారు. బాధిత రైల్వే కుటుంబాలకు రైల్వేశాఖ చెల్లించే సెటెల్మెంట్ బకాయిలకు ఇది (కెనరా బ్యాంక్ ఇన్సురేన్సు పథకం) అదనం అని రైల్వే అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దక్షి ణ మధ్య రైల్వే, కెనరా బ్యాంక్ అధికారులు బాధిత కుటుంబాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణిరేవులో యువకుడి మృతదేహం లభ్యం

**డ్రోన్ కెమెరాల గాలింపుతో ఫలించిన వ్యూహం**



**పలమనేరు, అక్టోబరు 18 ప్రభాత వార్త:** చిత్తూరు జిల్లా పలమనేరు రూరల్ మండలం కాలువపల్లె వద్ద అటవీ ప్రాంతంలోని కల్యాణిరేవు లో గల్లంతైన యువకుడు యూనస్ (23) మృతదేహం లభ్యమైంది. మూడో రోజు డ్రోన్ కెమెరాలతో గాలించడంతో రెండు కి.మీల దూరంలో బండల మధ్య చిక్కు కున్న మృతదేహం బయటపడింది. పలమనేరు పాతపేటకు చెందిన యూనిస్ తన స్నేహితులతో కలిసి ఈ నెల 16న సాయంత్రం కల్యాణి రేవులో ఈతకు వెళ్ళడం, ప్రవా హం ఉధృతంగా ఉండడంతో స్నేహితులు తిరిగి రావడం, యూనస్ ప్రవాహంలో దూకి గల్లంతు కావడం తెలిసిందే. విషయం తెలుసుకున్న సిఐ మురళీమోహన్, ఎస్ఐ లోకేష్ సిబ్బందితో వెళ్ళి అదే రోజు సాయంత్రం గాలించారు. అయితే చీకటిపడడంతో తిరిగి రెండో రోజు ఈనెల 17న ఉదయం పోలీసులు, అటవీ శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులతో ఉదయం నుండి నుండి సాయంత్రం వరకు గజ ఈతగాళ్ళలతో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో చివరి ప్రయత్నంగా మూడో రోజు శనివారం డ్రోన్ కెమెరాలతో గాలింపు చేపట్టారు. దీంతో సంఘటనా స్థలం నుండి రెండు కిలో మీటర్ల దూరంలో బండల మధ్య చిక్కుకున్న మృతదేహం బయటపడింది. అతికష్టం మీద మృతదేహాన్ని వెలికి తీసి శవపరీక్షకు అంబులెన్స్‌లో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

**కుప్పం, అక్టోబరు 18 ప్రభాతవార్త:** గ్రామాల్లో కారులో రెక్కీ నిర్వహించి ఇళ్లల్లో ఎవరూ లేరని గుర్తించి చోరీలకు పాల్పడే ఓ అంతర్ రాష్ట్ర దొ ంగను అరెస్ట్ చేసినట్లు కుప్పం డిఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. శనివారం కుప్పం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్‌తో కలసి స్థానిక డిఎస్పీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం ఆంబూరు తాలూకా ఉదిఎందిరం గ్రామంకు చెందిన గోడి వ్రన్ మోసెస్ రాజే ం ద్రన్ (32)కు వివాహమై భార్య ఉందన్నారు. అయితే చోరీలకు అలవాటు పడిన ఇతను ఇంటికి కూడా వెళ్లక దొంగతనాలకు పాల్పడేవాడని చెప్పారు. ఇప్పటికే ఇతనిపై తమిళనాడులో 30 కేసులు నమోదై ఉన్నాయ న్నారు. ఈనెల 11వ తేది రామకుప్పం మండలం చెల్దిగానిపల్లిలో ఓ ఇంట్లో ఎవరూలేని సమయంలో చోరీ జరిగిందన్నారు. ఈ విషయంగా కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాలతో తమ బృందాలు దర్యాప్తు చేసు_ం డగా శుక్రవారం మధ్యాహ్నం విజలాపురం సంతమిట్ట జంక్షన్‌లో రాజేంద్రన్ అనుమానాస్పదంగా కన్పించడంతో అతన్ని అదుపులో తీసుకుని విచారించాం. చెల్దిగానిపల్లితో పాటు వి.కోట మండలంలో సైతం ఓ ఇంట్లో చోరీకి పాల్పడి నట్లు అంగీకరించాడన్నారు. నిందితుడి నుంచి 125 గ్రాముల బంగారంతో పాటు ఓ కారు, కత్తి, ఇనుప రాడ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం కేసును ఛేదించిన రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సైలు వెంకట మోహన్, నరేష్, శ్రీనివాసులు, సిబ్బందికి డిఎస్పీ క్యాష్ రికార్డులు అంద జేశారు. ప్రజలు కూడా తమ ఇళ్లల్లో విలువైన నగలు, నగదు ఉంచకుండా బా ్యంకు లాకర్లలో భద్రపరచుకోవాలన్నారు. ఇళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటుచేసుకుంటే నిందితుల్ని త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు.

# జిఎస్‌టి వెసులుబాటుతో ప్రజలకు భారీ ఊరట

**రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

**ఆత్మకూరు (నెల్లూరు), అక్టోబరు 18 ప్రభాతవార్త:** ప్రభుత్వం జిఎస్‌టి తగ్గించడం ద్వారా ప్రజలకు భారీగా ఊరట లభించిందని, ధరలు అధికంగా తగ్గాయని, నిత్యావసర సరుకులపైనే రూ.2 వేల వరకు ఆదా అవుతుందని, వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రయోజనకరమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరులో జిఎస్టీ సంస్కరణల వలన కలిగే ప్రయోజనాలను వివరించేందుకు జిఎస్‌టి, రవాణాశాఖల ఆధ్వర్యంలో చేపట్టిన భారీ ర్యాలీని మంత్రి ఆనం ప్రారంభించారు. అనంతరం స్థానిక మున్సిపల్ బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మంత్రి రామనారాయణరెడ్డి ప్రసంగించారు. జిఎస్‌టి ప్రవేశపెట్టేముందు ఆర్థికశాఖ మంత్రిగా తాను కూడా అధ్యయనం కోసం పలుదేశాల్లో పర్యటించానని ఆయన గుర్తుచేసుకున్నారు. జిఎస్‌టి 2.0తో అన్నివర్గాలకు మేలు చేకూరుతుందని, ప్రతి కుటుంబానికి 2వేల రూపాయల వరకు ఆదా అవుతుందని, ప్రభుత్వాలు చేసే మంచిని ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం ఉపయోగపడే నిత్యావసర సరుకులపై జిఎస్‌టి 18నుండి 5శాతానికి తగ్గినందున ధరలు బాగా తగ్గాయన్నారు. మందులపై, రైతులకు ఉపయోగపడే పరికరాలపై శాతానికి తగ్గిందన్నారు. ప్రధానంగా రవాణారంగంలో జిఎస్టీ సవరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని ఆయన తెలిపారు. ఒక్కో వాహనంపై ఎనిమిది వేల నుండి 2లక్షల రూపాయల వరకు తగ్గుతుందన్నారు, ప్రతి ఇంటికి జిఎస్‌టి ఫలాలు అందేలా, ప్రతి కుటుంబంలో ఆనందం నింపిన ప్రధాని నరేంద్రమోడీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రామనారాయణరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని ట్రాక్టర్ల, స్కూటర్ల షోరూమ్‌లను మంత్రి ఆనం సందర్శించారు. జిఎస్‌టి తగ్గింపు వలన ధరలు తగ్గిన వాహనాల వివరాలను షోరూమ్ యజమానులనడిగి మంత్రి ఆనం తెలుసుకున్నారు. నూతనంగా స్కూటర్లు, ట్రాక్టర్లు కొనుగోలు చేసిన వినియోగదారులకు మంత్రి ఆనం చేతులమీదుగా తాళాలు అందజేశారు. ఒక్కో ట్రాక్టర్ ధరలో 40వేలరూపాయలు తగ్గిందని, తమకెంతో మేలు జరిగిందని యజమానులు మంత్రి ఆనంకు తెలిపారు. ఈ కార్యక్రమంలో




ఆర్డీవో భూమిరెడ్డి పావని, జిఎస్‌టి జాయింట్ కమీషనర్ కిరణ్‌కుమార్, రవాణాశాఖ ఉపకమీషనర్ చందర్, మున్సిపల్ చైర్మన్ వెంకటరమణమ్మ, కమీషనర్ గంగాప్రసాద్, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, తెలుగుదేశం నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, కేతా వేణుగోపాల్‌రెడ్డి, సుంకర పెంచలచౌదరి, కౌన్సిలర్లు, పలువురు నాయకులు, ప్రజలు ,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు నిబద్ధత, చిత్తశుద్ధితో వృత్తికి వన్నె తేవాలి

**● నేటి పరిస్థితులకు అనుగుణంగా వార్తాంశాలను కొత్తగా తెలియజేయాలి ● రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**

**అనంతపురము, అక్టోబరు 18 ప్రభాతవార్త బ్యూరో:** జర్నలిస్టులు నిబద్ధత, చిత్తశుద్ధితో వృత్తికి వన్నె తేవాలని, తద్వారా జర్నలిస్టుకు విలువ ఉంటుందని, ప్రతి పౌరుడు పాత్రికేయుడవుతున్న నేటి ఆధునిక యుగంలో సామాజికాంశాలను కొత్తగా, సమాజానికి ఉపయోగపడే విధంగా రాయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో సిఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహించిన "గ్రామీణ విలేకరులకు పునశ్చరణ తరగతులు" శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సభకు కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పాత్రికేయులకు వృత్తి ధర్మంలో విశ్వసనీయత ముఖ్యమని, అది ఒక్కరోజులో వచ్చేది కాదని, నిరంతరం శ్రమించడం వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్క జర్నలిస్టు నైపుణ్యంతో ఎదగాలని, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు అందుకు బాగా దోహదపడతాయని అన్నారు. పాత్రికేయులకు అక్రిడిటేషన్ ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం, ఆరోగ్య పథకం, విశ్రాంతి జర్నలిస్టులకు పెన్షన్ వంటి వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, సంబంధిత సమాచార శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా అందించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి కొండప్ప, ఏపీ ఎల్రక్టానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు ఏచూరి శివ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు, పాత్రికేయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జర్నలిస్టులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కాలవ శ్రీనివాసులు

19-10pg7exHMNWJQE 11_19-10pg7exHMNWJQE.qxd 10/18/2025 11:58 PM Page 1





## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవం

**రాపూరు (నెల్లూరు), అక్టోబరు 18 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు, వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహ, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.



బంగారు హారం దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

## దుర్గమ్మవారికి బంగారు హారం కానుక


**ఇంద్రకీలాద్రి, అక్టోబరు 18 ప్రభాతవార్త:** శ్రీ కనకదుర్గ అమ్మవారికి శనివారం వరంగల్‌కు చెందిన దాతలు జి.రామకృష్ణ తమ కుటుంబసభ్యులతో కలిసి రూ.4 లక్షల విలువైన 34 గ్రాముల బంగారు హారం కానుకగా అందించారు. దాతలకు దుర్గమ్మ వారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు.

### దుర్గమ్మ వారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

దుర్గమ్మవారిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి మల్లికార్జునరావు కుటుంబంతో సహా దర్శించుకున్నారు. శ్రీ అమ్మవారి దర్శనం అనంతరం వేద పండిత ఆశీర్వచనం పండితులు అందించగా, శ్రీ అమ్మ వారి చిత్రపటం, ప్రసాదం అందించారు.



### నిత్యాన్నదానానికి విరాళాలు



విజయవాడకు చెందిన బత్తుల బాల త్రిపుర సుందరి రూ. 1,01,116ల విరాళాన్ని శనివారం ఇఓ వికె శీనా నాయక్‌కు అందిం చారు. మరో దాత తూర్పుగోదావరి జిల్లా వెంకటాయపాలెంకు చెందిన ముక్కామల నారాయణమూర్తి, విజయలక్ష్మి దంపతులు రూ.1,81,500ల విరాళాన్ని ఇఓకు అందించారు. దాతలకు దుర్గమ్మ వారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు.



## యాదాద్రి లక్ష్మీనరసింహ సేవలో భారత షట్లర్ పివి సింధు

**భువనగిరి, అక్టోబరు 18 ప్రభాతవార్త:** ప్రముఖ బ్యాడ్మింటన్ ఛాంపియన్ పీవీ సింధు కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లాలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. సాంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి విచ్చేసిన సింధు కుటుంబం, మొక్కులు చెల్లించుకుని స్వామివారి కళ్యాణోత్సవాన్ని వీక్షించారు. అనంతరం ప్రధాన ఆలయంలో స్వయంభు నరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించి, వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు సాంప్రదాయ రీతిలో స్వాగతం పలికి ప్రసాదం అందజేశారు. తరువాత సింధు కుటుంబం క్షేత్రపాలక ఆంజనేయ స్వామి వారిని, ధ్వజస్తంభం దర్శించారు. స్వామివారి దర్శనంతో ఆనందభరితులైన పీవీ సింధు కుటుంబ సభ్యులు, యాదగిరిగుట్టలోని పవిత్ర వాతావరణం, భక్తుల ఉత్సాహం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## దీపావళి బహుమతిగా ఫాస్ట్‌ట్యాగ్ పాస్ గిఫ్ట్

- టోల్‌ప్లాజా అపరిశుభ్ర మరుగుదొడ్ల ఫోటో తీయండి వెయ్యి కొట్టండి
- ఎన్‌హెచ్ఏఐ పండుగవేళ బోనాంజా

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** దీపావళి పండగ వేళ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఫాస్ట్‌ట్యాగ్ పాస్ బహుమతి కూపన్ల తోపాటు టోల్‌ప్లాజ్‌లో మరుగుదొడ్ల నిర్వహణలో శుభ్రతస్థాయిని పెంపొందించే దిశగా చర్యలు చేపట్టింది. దేశ జాతీయ రహ దారులపై అతి తక్కువ ఖర్చుతో ప్రయా ణించేందుకు వీలుగా కేంద్రం తీసుకొచ్చిన ఫాస్టాగ్ వార్షిక టోల్ పాస్ మీకు నచ్చిన వారికి గిఫ్ట్ గానూ ఇచ్చేలా కొత్త పథకం అందుబాటులోకి తెచ్చినట్లు జాతీయ రహదారుల ప్రాధి కార సంస్థ ప్రకటించింది. రాజమార్గ్ ద్వారా ఈ పాస్‌ను బహూకరించొచ్చని తెలిపింది. యాప్‌లోని యాడ్ పాస్ విభాగంలోకి వెళ్లి మీరు గిఫ్ట్‌గా ఇవ్వాలనుకుంటున్న వ్యక్తి వాహన నంబర్, కాంటాక్ట్ వివరాలు ఇవ్వాల్సి ఉంటుందని గిఫ్ట్‌కూపన్ పొందే విధానం వివరించింది. వన్‌టైమ్ పాస్‌వర్డు వెరిఫికేషన్ తర్వాత్ వార్షిక పాస్ యాక్టివేట్ అవుతుందని ఎన్‌హెచ్ఏఐ గిఫ్ట్ పాస్ట్‌ట్యాగ్ నమోదు ఉపయోగ విధానంను వివరించింది. దేశ వ్యాప్తంగా 1150 టోల్ ప్లాజ్‌వద్ద టోల్ ప్లాజాల వద్ద ఈ ఫాస్టాగ్ వార్షిక పాస్ చెల్లు బాటు అవుతుంది.





ఒక్కసారి రూ.3 వేలు చెల్లించి ఈ పాస్ తీసుకుంటే ఏడాది పాటు 200 సార్లు మించకుండా టోల్‌ప్లాజాలు దాటొచ్చు. యేడాదిలో 201వ టోల్ ప్లాజ్ దాటడానికి మాత్రం వార్షిక పాస్ ఉపయోగపడదు. ఏడాదిలోగా 200 టోల్ ప్లాజాలు దాటకపోయినా 365రోజు తరువాత ఎన్ని టోల్‌ప్లాజాలు దాటడానికి అవకాశం ఉన్నా అది నిరుపయోగమౌతుంది. ఇది కేవలం ప్రైవేటు వ్యక్తిగత వాహనాలకు మాత్రమే వర్తి స్తుంది. వాణిజ్య అవసరాలకు ఉపయోగించే వాహనాలకు ఇది జారీ చేయరు. రాజమార్గ యాప్‌లో యాక్టివేట్ చేసుకున్న రెండు గంటల్లో

ఏడాది ఆగస్టు 15న ఈ పాస్‌ను అందుబాటులో తీసుకొచ్చారు. రెండు నెలల్లో 25 లక్షల మంది వార్షిక టోల్‌ప్లాజాను కొనుగోలు చేశారు. 5.67 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయని ఎన్‌హెచ్ఏఐ అధికారులు గణాంకాలతో వివరించారు. టోల్‌ప్లాజా అపరిశుభ్రంగా ఉన్న మరుగు దొడ్లపై ఫిర్యాదు చేసే వాహనదారుల ఫాస్టాగ్ అకౌంట్లకు రూ.1,000 బహుమతి రూపంలో జమచేస్తామని ఎన్‌హెచ్ఐ ప్రకటించింది. ఈ రివార్డు అక్టోబరు 31 వరకు మాత్రమే అమలు లో ఉంటుందని స్పష్టంచేసింది. జాతీయ రహదారుల వాడకందారులు "రాజమార్గ్ యాత్ర" యాప్‌ను ఉపయోగించి తమ యూజర్‌నేమ్, లొకేషన్, వాహన రిజిస్ట్రేషన్ నంబర్, మొబైల్ నంబర్ వంటి వివరాలతో పాటు అపరిశుభ్రంగా ఉన్న టోల్ ప్లాజా శౌచాలయాల చిత్రాలను అప్లోడ్ చేయవచ్చని అధికారిక ప్రకటన తెలియజేసింది. టోల్ ప్లాజా టాయిలెట్ల అపరిశుభ్రతపై ఈ పద్ధతిలో ఫిర్యాదు చేసే అర్హత గల వాహనదారులకు రూ.1,000 ఫాస్ట్‌టాగ్ రీఛార్జి రూపంలో అందిస్తామని ప్రకటన తెలిపింది.

## పిఎం కిసాన్‌లో అక్రమాలు





- అక్రమంగా 31 లక్షల ఖాతాల్లో నగదు జమ
- మరో 33.34 లక్షల అనుమానిత కేసులు
- భార్యాభర్తలిద్దరికీ పీఎం కిసాన్
- అనర్హులను గుర్తించాలని రాష్ట్రాలకు కేంద్రం లేఖ

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఇచ్చే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం ద్వారా దేశవ్యాప్తంగా కోట్లాది మంది లబ్ది పొందుతున్నారు. ఇప్పటికే 20 సార్లకు పైగా కేంద్రం ఈ నిధుల్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. కేంద్రం ఇస్తున్న డబ్బులకు తమ వంతుగా కొంత డబ్బులు జమ చేసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహ పలు రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇస్తున్నాయి. అయితే ఇందులోనూ అక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంతో కేంద్రం అప్రమత్తమైంది. దీంతో పీఎం కిసాన్ నిధుల లబ్దిదారుల ఖాతాల్ని పరిశీలిస్తోంది. ఇందులో 31 లక్షల ఖాతాలపై కేంద్రం అనుమానాలు వ్యక్తం చేసింది. వీటిలో తాజాగా దాదాపు 19.02 లక్షల మంది లబ్దిదారుల ఖాతాల్ని తనిఖీ చేయగా వీటిలో దాదాపు 93 శాతం ఖాతాల్లో అంటే 17.87 లక్షల మంది అనర్హత లేని భార్యాభర్తలైన లబ్దిదారులు ఇద్దరూ వేర్వేరుగా ఈ పథకం కింద వస్తున్న డబ్బుల్ని అక్రమంగా తీసుకుంటున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఇప్పుడు రాష్ట్రాలకు లేఖలు పంపి ధృవీకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరింది. కాగా పీఎం కిసాన్ పథకం కింద కేంద్రం సంవత్సరానికి 6 వేల రూపాయలను మూడు దఫాలుగా 2 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో భూమి రికార్డుల ప్రకారం సాగు భూమిని కలిగి ఉన్న "భర్త, భార్య, మైనర్ పిల్లల్ని ఓ కుటుంబంగా నిర్వచించాయి. అయితే కేంద్ర



మార్గదర్శకాల ప్రకారం ఇందులో ఎవరో ఒకరికి మాత్రమే ఈ పథకం ప్రయోజనం లభిస్తుంది. కానీ ఇప్పుడు ఒక్కో కుటుంబంలో ఇద్దరు చొప్పున తీసుకుంటున్న కేసులు 1.76 లక్షలుగా తేలింది. వీటితో పాటు గత భూ యజమానుల వివరాలు చెల్లనివి లేదా ఖాళీగా గుర్తించబడిన 33.34 లక్షల అనుమానిత కేసులను కూడా కేంద్రం గుర్తించింది. ఫిబ్రవరి 1, 2019 తర్వాత భూమి బదిలీతో నమోదైన రైతులకు, పీఎం కిసాన్ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ సమయంలో గత భూ యజమాని వివరాలను అందించాలి. గత భూ యజమాని ఈ పథకం ప్రయోజనాలను పొందకూడదు. అయితే ఇద్దరూ ఈ పథకం ప్రయోజనం పొందుతున్న కేసులు 8.11 లక్షలుగా గుర్తించింది. అలాగే ఈ పథకంలో వారసత్వంగా మ్యుటేషన్ అనుమతించినా పరిశీలన సమయంలో 8.83 లక్షల కేసుల అర్హత లేనివిగా నిర్ధారించింది. వీటిలో వారసత్వంగా కాకుండా మ్యుటేషన్‌కు ఇతర కారణం నమోదు చేసినట్లు తెలుస్తోంది. కాగా దేశ వ్యాప్తంగా దాదాపు 9.80 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు 22 వేల కోట్ల రూపాయలను పిఎం ఇకసాన్ ఇన్‌పుట్ సబ్సిడీగా కేంద్రం జమ చేస్తోంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 41,22,499 మందికి 836.31 కోట్ల రూపాయలు, తెలంగాణలో 30,77,426 మందికి 627.46 కోట్ల రూపాయలు ఈ పథకం కింద నిధులు విడుదల చేస్తోంది.

## కానిస్టేబుల్‌ను కత్తితో పొడిచి చంపిన బైక్ దొంగ

- నిజామాబాద్‌లో దారుణం
- ఘటనపై డిజిపి సీరియస్
- నేరగాడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు

**హైదరాబాద్, అక్టోబరు 18 ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనాలను దొంగిలించే ఓ నేరగాడు కానిస్టేబుల్‌ను కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన నిజామాబాద్ పట్టణంలో శుక్రవారం రాత్రి వెలుగు చూసింది. ఈ ఘటనలో ఓ ఎస్ఐతో పాటు నేరగాడి మేనల్లుడికి కూడా గాయాలయ్యాయి. వీరిలో మేనల్లుడి పరిస్థితి తీవ్రంగా వుంది. కాగా ఈ ఘటనపై డిజిపి శివధర్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. కానిస్టేబుల్‌ను చంపిన నేరగాడిని వెంటనే పట్టుకోవాలని జిల్లా పోలీసు కమిషనర్ సాయి చైతన్యను ఆదేశించారు. వివరాలు ఇలావున్నాయి. నిజామాబాద్ పట్టణంలోని హాష్మీ కాలనీకి చెందిన రియాజ్ (24) ఓ దొంగ. బైకులతో పాటు చిన్నాచితక నేరాలు చేయడం ఇతని వృత్తి. కొంతకాలంగా రియాజ్ కోసం జిల్లా సిసిఎస్ పోలీసులుగా లిస్తున్నారు. రియాజ్ తన ఇంట్లో వున్నట్లు సమాచారం అందుకున్న సిసిఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ (42) మోటార్ సైకిల్‌పై రియాజ్ ఇంటికి వెళ్లాడు. ఈ సమయంలో రియాజ్ మేనల్లుడు ప్రమోద్ వెంట వున్నాడు. కాగా రియాజ్‌ను అదుపులోకి తీసుకున్న సిసిఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ తన మోటార్ సైకిల్‌పై అతని మేనల్లుడితో పాటు



రియాజ్ దాడిలో చనిపోయిన కానిస్టేబుల్ ప్రమోద్





నేరగాడు రియాజ్

పోలీసు స్టేషన్‌కు వస్తుండగా మార్గమధ్యలో గల వినాయక్ నగర్ వద్ద రియాజ్ ఒక్కసారిగా తన జేబులో వున్న కత్తితో రెప్పపాటులో కానిస్టేబుల్ ప్రమోద్ ఛాతిలో పొడిచాడు. తన మామను ఆపేందుకు ప్రయత్నించిన అతని మేనల్లుడిపైనా రియాజ్ కత్తితో దాడి చేశాడు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన సిసిఎస్ ఎస్ఐ విఠల్‌పైనా రియాజ్ కత్తితో దాడిచేశాడు. దీని తరువాత మరో బైక్‌పై వచ్చిన తన అనుచరులతో కలిసి రియాజ్ పారిపోయాడు. కాగా ఈ విషయం తెలిసిన వెంటనే మూడవ టౌన్ సిఐ శ్రీనివాసరాజ్ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని రియాజ్ దాడిలో గాయపడ్డ సిసిఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌తో పాటు ఎస్ఐ విఠల్‌ను రియాజ్ మేనల్లుడిని జిజిహెచ్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి తరలించేలోపే ప్రమోద్ మరణించాడు. కాగా కత్తిపోట్ల కారణంగా గాయపడ్డ విఠల్ పరిస్థితి నిలకడగా వుండగా రియాజ్ మేనల్లుడి పరిస్థితి ఆందోళనకరంగా వుంది. నేరగాడి కత్తిపోట్లకు బలైన ప్రమోద్‌కు భార్య ముగ్గురు పిల్లలు వున్నారు. కాగా ఘటనాస్థలికి మల్టీజోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఉదయం వెళ్లి సమీక్షించారు. నేరగాడి చేతిలో చనిపోయిన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబీకులను ఆయన పరామర్శించారు.

### ఘటనపై డిజిపి సీరియస్...

ఇదిలావుండగా నిజామాబాద్ పట్టణంలో కానిస్టేబుల్ ప్రమోద్‌ను పాత నేరగాడు రియాజ్ కత్తితో పొడిచి చంపిన ఘటనపై డిజిపి శివధర్ రెడ్డి తీ వ్రంగా స్పందించారు. ఈ ఘటనకు పాల్పడ్డ రియాజ్‌ను వెంటనే పట్టుకోవాలని జిల్లా పోలీసు కమిషనర్ సాయి చైతన్యను ఆదేశించారు. డిజిపి ఆ దేశాల దరిమిలా రియాజ్‌ను పట్టుకునేందుకు ఎనిమిది ప్రత్యేక బృందాలను పోలీసులు రంగంలో దింపారు. ఈ కేసులో రియాజ్ అనుచరులను పో లీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## రిజర్వేషన్లు సాధించేదాకా పోరాడుతాం

### తెలంగాణ వ్యాప్తంగా బంద్ విజయవంతం

### బిసి జెఎసి చైర్మన్ ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 18, ప్రభాతవార్త:** బిసిల రాష్ట్ర వ్యాప్త బంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని 42 శాతం రిజర్వేషన్‌తోపాటు చట్ట సభలలో రాజకీయ రిజర్వేషన్‌లు సాధించేంతవరకు ఉద్యమి స్తామని, నిద్రపోయేది లేదని, తెగించి పోరాడుతామని బిసి జెఎసి ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన బిసిల బంద్ విజయవంతం అయ్యిందని, చరిత్రలో నిలిచిపోతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేయా ల్సిన అవసరం ఉందని, ఒకటి, రెండు రోజుల్లో ఫలితాలు వస్తాయన్న ఆశా భావాన్ని ఆయన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఒకటి, రెండు చిన్న పాటి సమస్యలు మినహా రాష్ట్ర బిసిల బంద్ సంపూర్ణంగా విజయవంతం అయ్యిందని స్పష్టం చేశారు. ఈ బంద్ యొక్క ప్రభావం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి, ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దృష్టికి వెళుతుందని, బిసిలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వాలు దిగిరావాలన్నారు. 76 సంవత్సరాలుగా బిసిలకు అన్యాయం జరుగుతున్నదని, కేవలం తమకు రావాల్సిన వాటా గురించి మాత్రమే అడిగామని, 42 శాతం బిసి రిజర్వేషన్‌లపై హైకోర్టులో కేసు ఎందుకు వేశారని, పరోక్షంగా రెడ్డి సంఘం నాయకులను ఆయన ప్రశ్నించారు. బంద్ గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర రాజధాని స్థాయి వరకు విజయవంతంగా కొనసాగిందని, అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, వివిధ సంఘాలు సంపూర్ణంగా మద్దతు తెలిపినందుకు వారికి ప్రత్యేకంగా ఆర్.కృష్ణయ్య కృతజ్ఞతలు చెప్పారు. ఒకప్పుడు బిసిలు



బిసిల బంద్ విజయవంతమైనందుకు అభివాదం తెలుపుతున్న ఆర్.కృష్ణయ , నారగోని, దాసు సురేష్, గుజ్జ కృష్ణ తదితరులు

అధికారులను చూస్తే భయపడేవారిని నేడు వారిని బెదిరించస్థాయికి ఎదిగారని తెలిపారు.

ఈ సమావేశానికి బిసి జెఎసి వైస్-ఛైర్మన్ వి.జి.ఆర్. నారగోని అధ్యక్షత వహించగా, సమావేశంలో కో-ఛైర్మన్ దాసు సురేష్, మీడియ ఇన్‌చార్జి గుజ్జ కృష్ణ, నాయకులు నీల వెంకటేష్, భరత్, రాంకోఠి తదితరులు పాల్గొన్నారు.



## వైసిపివన్నీ అసత్య ఆరోపణలు

**విజయవాడ, అక్టోబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోందని మంత్రి పార్థసారథి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. గోబెల్స్ సిగ్గుపడేలా అభివృద్ధి జరుగుతోందన్నారు. వైసీపీ అసత్య ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. గత ఐదేళ్లు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని... ప్రజలు ఎలా బుద్ధి చెప్పారో ఎన్నికల్లో చూశామన్నారు మంత్రి. మద్యం కుంభకోణాల్లో వాస్తవాలు బయటపడుతున్నాయని.. దీనితో కల్తీ మద్యం పేరిట డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. నాటి వైసీపీ పాలనలో మద్యంలో కూడా హానికర పదార్థాలు ఉన్నాయని రిపోర్ట్ వచ్చిందని వెల్లడించారు. అయితే ఈరోజు మద్యం పరీక్షల్లో హానికర పదార్థాలు లేవని రిపోర్ట్ వచ్చిందని.. అది కూటమి ప్రభుత్వ నిస్పక్ష ధోరణి అని చెప్పుకొచ్చారు. కల్తీ మద్యంపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. టీడీపీ నేతలున్నా పార్టీ నుంచి ఇప్పటికే సస్పెండ్ చేశామని అన్నారు. కల్తీ మద్యాన్ని అరికట్టాలని ప్రభుత్వ సురక్ష యాప్ తీసుకొచ్చిందని తెలిపారు. యాప్ ద్వారా హోలో గ్రామ్ నుంచి సమాచారం తెలుసుకోవచ్చని.. దీనిపై తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో స్కూటర్స్‌లో మద్యం డోర్ డెలివరీ చేశారని.. నేడు నేతి బీరకాయ మాటలు చెప్పటం హాస్యాస్పదమంటూ ఎద్దేవా చేశారు. డిజిటల్ పేమెంట్స్‌కే ఎక్కువ ప్రాధాన్యత అని తేల్చిచెప్పారు. ప్రభుత్వ అధికారులతో తాము మద్యం అమ్మడం లేదని స్పష్టం చేశారు. తక్కువ ధరకు లిక్కర్‌ను అన్ని నియోజకవర్గాల్లో అందిస్తున్నామని అన్నారు. బార్లలో 15 శాతం ఎక్కువ ట్యాక్స్‌తో లిక్కర్ అమ్మే దానిపై కమిటీ వేయనున్నట్లు తెలిపారు. పీపీపీ విధానంపై వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో మాట్లాడేవారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కుంభకోణాలు లేకుండా పాలన సాగుతోందన్నారు. తక్కువ ధరకు నాణ్యమైన మద్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. అధికారుల మనోధైర్యం దెబ్బతీసేలా వైసీపీ ప్రవర్తిస్తోందని విమర్శించారు. చట్టపరంగా పని చేసే అధికారులకు అండగా ప్రభుత్వం ఉంటుందని తెలిపారు. వైసీపీ అధికారంలోకి వస్తామని కలలు కంటోందని ఎద్దేవా చేశారు. దళిత, బడుగు వర్గాల అధికారులే టార్గెట్‌గా వైసీపీ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిట్ త్వరలో కల్తీ మద్యంపై వాస్తవాలు బహిర్గతం చేస్తుందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.



## కుమురం భీం జిల్లాలో పరువు హత్య

### 8 నెలల గర్భిణిని గొడ్డలితో నరికి చంపిన మామ

**దహెగాం, అక్టోబరు 18, ప్రభాతవార్త:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. దహెగాం మండలం గెర్రే గ్రామంలో పరువు హత్య జరిగింది. కొడుకు కులాంతర వివా హం చేసుకున్నాడని 8 నెలల గర్భిణి అయిన కోడలిని గొడ్డలితో చంపాడు మామ. శనివారం జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి పోలీసులు, తహసీల్దార్ మునవీర్ షరీఫ్ తదితరులు చేరుకుని ఘటనపై ఆరాతీశారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలిం చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగజ్ నగర్ డిఎస్‌పి వాహిదోద్దిన్ తెలి పిన వివరాల ప్రకారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని గెర్రే గ్రామానికి చెందిన సత్తయ్య కుమారుడు కుమార్ ప్రేమ వివాహం చేసుకున్నాడని, ఇష్టంలేని పెళ్లి చేసుకు న్నాడని కారణంతో కోడలు రాణి (శ్రావణి)ని మామ గొడ్డలితో హత్య చేసాడని తెలియజేసారు. మృతు రాలు తండ్రి చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్తయ్య, కుమార్, కవితపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు. సీఐ కుమారస్వామి, పెంచికల్ పేట్ మండల ఎస్ఐ అనిల్, తహసీల్దార్ మునవీర్ షరీఫ్‌లు ఉన్నారు.

## టిజి పిక్స్‌గా తెలంగాణ పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్

**హైదరాబాద్, అక్టోబరు 18, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ లిమిటెడ్ పేరు తెలంగాణ పోలీసు హౌసింగ్ ఇన్ఫ్రాటెక్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజి పిక్స్)గా మారుస్తూ శనివారం సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. టిజిపిక్స్ ఎండి పోలీసు శాఖలో సీనియర్ ఐపిఎస్ అధికారి రమేష్ ఈ మేరకు ఒక ప్రకటన విడు దల చేశారు. భవిష్యత్తులో టిపిపిక్స్ సంస్థ ప్రభుత్వ సంస్థలకు సాంకేతిక ఆధారిత, వ్యాపార కార్యకలాపాల విస్తరణ, సాంకేతిక సదుపాయాలు అందిస్తుంది. దీంతో పాటు ఇంజినీరింగ్, ప్రాజెక్టుల నిర్వహణ, డిజైన్ల నిర్మాణ సేవలు, క్రీడా సంబంధిత మౌలిక సదు పాయాల ప్రాజెక్టులు, లాజిస్టిక్స్ రంగాలలో సేవలను అందిస్తుంది.

19-10pg10exHMNWJQECK 12 ONG_19-10pg10exHMNWJQECK.qxd 10/18/2025 11:23 PM Page 1



## ఏథెన్స్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో..
# సంధుకు కాంస్యం



**న్యూఢిల్లీ:** ఏథెన్స్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల ట్రాప్‌లోజోరావర్ సింగ్ సంధు కాంస్యం గెలుచుకున్నాడు. గ్రీస్‌లోని ఏథెన్స్‌లోని మలకాసా షూటింగ్ రేంజ్‌లో శనివారం తొలి జూనియర్ ప్రపంచ ఛాంపియన్, తొలి సీనియర్ ప్రపంచ టైటిల్‌ను సాధించిన ఈ భారత ఆటగాడు 50 షాట్‌ల ఫైనల్‌లో మొదటి 40 లక్ష్యాలలో 31 లక్ష్యాలను చేధించాడు. గత రెండు రోజులుగా జరిగిన మొదటి నాలుగు రౌండ్ల అర్హతలో 100 లక్ష్యాలలో ఒక లక్ష్యాన్ని మాత్రమే కోల్పోయాడు. అతను ఏడవ లక్ష్యాన్ని తప్పిపోయినా మొదటి 22లో 21 సాధించి, 23వ లక్ష్యాన్ని కోల్పోయి ఐదవ, చివరి రౌండ్‌కు 23 పాయింట్లు సాధించాడు. ఐదు రౌండ్లలో మొత్తం 122 (24,25,25,25,23) పాయింట్లు దక్కించుకున్నాడు. జోరావర్ గార్సియా మరియు ఫ్రెంచ్‌కు చెందిన ఆంటోనిన్ డెజర్ట్‌తో త్రీవే షూట్‌ఆఫ్‌లోకి వెళ్లి మొదటగా మిస్ అయ్యాడు. ఆ తర్వాత ఫైనల్‌లో సంధు మొదటగా గోల్ చేయడంలో తప్పిదానికి పాల్పడినా, తన రెండవ లక్ష్యాన్ని చేధించాడు. మొదటి 10లో తొమ్మిది గోల్స్ చేసి ప్రారంభ దశలో ఐదవ స్థానంలో నిలిచాడు. జోసిప్ మొదటి గోల్స్ 12వ గోల్స్‌ను మిస్ చేశాడు, మరియు మూడు రోజుల పాటు గోల్స్ మిస్ కాకుండా ఉన్న ఆంటన్ మొదటి 15 గోల్స్ తర్వాత నాలుగు గోల్స్ చేశాడు. ఈ దశలో వర్షం ప్రారంభం కావడంతో మైదానంలో గోల్స్ మిస్‌అయి జోరావర్ 13 హిట్‌లతో రెండవ స్థానంతో సరిపెట్టాల్సి వచ్చింది. భారత ఆటగాడు తరువాతి 10 హిట్‌లలో వరుసగా మూడు గోల్స్ మిస్ అయ్యాడు, కానీ హింటన్ 25 టార్గెట్‌ల తర్వాత మొదట నిష్క్రమించడంతో అతను బయటపడ్డాడు.



## ఆర్చరీ ప్రపంచకప్
## తొలి మహిళా పతక
# విజేత జ్యోతి
## షాంఘై ప్రపంచ కప్‌లో మధుర ఓటమి

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్-2025 ఫైనల్‌లో భారతదేశపు తొలి మహిళా కాంపౌండ్ పతక విజేతగా వెన్నం జ్యోతి సురేఖ నిలిచింది. నాన్జింగ్‌లో శనివారం జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ ఫైనల్‌లో జ్యోతి చరిత్ర సృష్టించి భారతదేశపు తొలి మహిళా కాంపౌండ్ పతక విజేతగా నిలిచింది. గత రెండు ఎడిషన్ల నుండి వరుసగా రెండు క్వార్టర్ ఫైనల్ నిష్క్రమించగా, ఈసారి మహిళల కాంపౌండ్‌వ్యక్తిగత విభాగంలో ఆమె కాంస్య పతకాన్ని గెలుచుకుంది. 9 సార్లు ప్రపంచ పతక విజేత అయిన ఈమె కాంస్యపతక పోరులో తనప్రతిభను ప్రదర్శించి, గ్రేట్ బ్రిటన్‌కుచెందిన ప్రపంచ నం.2ఎల్లాగిబ్సన్‌ను 150/150 తో ఓడించింది. క్వార్టర్ ఫైనల్లో భారీ వర్షంలో చాలా గాలులతో కూడిన పరిస్థితుల్లో యుఎస్‌ఎ కి చెందిన అలెక్సిస్ రూయిజ్ పై 143-140 తేడాతో జ్యోతి విక్టరీతో ప్రారంభించినా, సెమీఫైనల్లో అధిగమించలేక పోయింది. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ మెక్సికోకు చెందిన ఆండ్రియా బెకెరాపై 143-145 తేడాతో వెనుకబడింది. అయితే కాంస్య పతక పోటీలో అద్భుతమైన స్కోరును సాధించి ఎల్లా యొక్క 145 పాయింట్లను సులభంగా అధిగమించి తన చారిత్రాత్మక పతకాన్ని నిర్ధారించింది. మరోవైపు షాంఘై ప్రపంచ కప్ ఛాంపియన్ మధుర ధమన్ గోంకర్ క్వార్టర్ ఫైనల్‌లో మెక్సికోకు చెందిన మరియానా బెర్నాల్ చేతిలో ఓడిపోయింది. 25 ఏళ్ల ఆమె ఫైనల్‌లో నెమ్మదిగా ఆరంభించింది, మొదటి తొమ్మిది షాట్‌లలో 83 స్కోరు చేసింది. కానీ ఆమె అరంగేట్రంలోనే బెర్నాల్ చేతిలో 142-145 తేడాతో ఓడిపోయింది.



## ప్రపంచ ఛాంపియన్‌షిప్..
# స్వర్ణ పోరుకు తన్వి
### సెమీస్‌లో చైనా టాప్ సీడ్ ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్-2025, భారత్ బ్యాడ్మింటన్ స్టార్ తన్వి శర్మ ఫైనల్‌కు చేరుకుంది. దీంతో ఈ ఘనత సాధించిన మూడవ భారతీయ మహిళగా నిలిచింది. గౌహతిలోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శనివారం జరిగిన వరల్డ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ సెమీఫైనల్లో 15-11, 15-9 తేడాతో చైనాకు చెందిన లియు సి యాను ఓడించి 16 ఏళ్ల టాప్ సీడ్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. 17 ఏళ్ల తర్వాత బాలికల సింగిల్స్ విభాగంలో భారత్‌కు తొలిసారి పతకం ఖాయమైన తన్వి ఇప్పుడు స్వర్ణ పతక పోరులో థాయిలాండ్‌కు చెందిన రెండవ సీడ్ అన్యాపట్ ఫిచిత్‌ప్రీచాసక్‌తో తలపడనుంది. మరో సెమీఫైనల్లో అన్యాపట్ 10-15, 15-11, 15-5 తేడాతో యాటవీమిన్ కెట్క్లియెంగ్‌ను ఓడించింది. తొలినుంచే తన్వి పూర్తి నియంత్రణలో కనిపించింది. లియు బ్యాక్‌హ్యాండ్ వైపు నైపుణ్యంతో కూడిన ఫ్లిక్‌లు, పదునైన క్రాస్‌కోర్ట్ పుష్‌లతో దాడి చేసింది. ఆమె ప్రారంభ గేమ్‌లో 7-3 ఆధిక్యాన్ని సంపాదించింది. తన ట్రేడ్‌మార్క్ క్రాస్‌కోర్ట్ స్మాష్‌తో తన్వి మొదటి గేమ్‌ను కేవలం 13 నిమిషాల్లోనే ముగించింది. రెండవ గేమ్‌లో, తన్వి తన పూర్తి అటాకింగ్ రేంజ్‌ను ప్రదర్శించి 12-4 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. క్విక్ డ్రైవ్‌లు మరియు డౌన్‌ది లైన్ స్మాష్‌ల కలయికతో తన ప్రత్యర్థిని కోర్టు అంతటా తిరిగేలా చేసింది. కొద్దిసేపు తప్పిదాలు చేసిన లియుకి కొన్ని పాయింట్లు లభించినా కానీ లియు ఫోర్‌హ్యాండ్ డ్రైవ్ వైడ్‌గా వెళ్లడంతో తన్వి తిరిగి నియంత్రణ సాధించి మ్యాచ్‌ను ముగించింది.

# ఆసిస్‌తో నేడే తొలివన్డే
## భారత్ ప్లేయింగ్ ఎలెవన్ ఫైనల్
### రోహిత్, కోహ్లీ ఎంట్రీ.. కొందరు బెంచ్‌కే పరిమితం



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు ఆస్ట్రేలియాను ఎదుర్కోవడానికి సిద్ధమైంది. ఈ రెండు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్ ఈ నెల 19న పర్త్‌లో జరగనుంది. దాదాపు 9 నెలల తర్వాత విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వస్తున్నారు. వీరు ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే ఆడుతున్నారు. గిల్ కెప్టెన్సీలో తొలి వన్డేకు భారత్ ప్లేయింగ్ ఎలెవన్ దాదాపు ఖరారైంది. తొలి వన్డేలో శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ ఓపెనింగ్ చేయడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. దీంతో యువ బ్యాట్స్‌మెన్ యశస్వి జైస్వాల్‌కు తొలి మ్యాచ్‌లో చోటు దక్కకపోవచ్చు. రోహిత్ తన చివరి వన్డే ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ఆడి, 76 పరుగుల మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. నంబర్ 3 స్థానంలో స్టార్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ ఆడటం పక్కా. కోహ్లీ తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత ఇదే. ఆస్ట్రేలియాలోని బౌన్సీ పిచ్‌లపై కోహ్లీ బ్యాట్ పరుగులు చేసే అవకాశం ఉంది. నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్ వచ్చే వీలుంది, ఆయన మిడిల్ ఆర్డర్ స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్. వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ ఆడనున్నాడు. ఆయన ఐదో స్థానంలో బ్యాటింగ్ చేయవచ్చు. దీంతో ధ్రువ్ జురెల్‌ను తొలి వన్డేకు బెంచ్‌కే పరిమితం చేయనున్నారు. గాయం కారణంగా హార్దిక్ పాండ్యా జట్టుకు దూరంగా ఉండగా, రవీంద్ర జడేజాను జట్టు నుంచి తొలగించారు. దీంతో ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ ఆరో స్థానంలో ఆడవచ్చు.

అతను డెత్ ఓవర్లలో దూకుడుగా ఆడగలడు. అంతేకాక స్పిన్, పేస్ బౌలింగ్‌ను కూడా సమర్థవంతంగా ఎదుర్కొని మీడియం పేస్ బార్ట్‌టైమ్ బౌలింగ్ కూడా చేయగలడు. స్పిన్నర్లుగా అక్షర్ పటేల్, కులదీప్ యాదవ్ జట్టులోకి రానున్నారు. అక్షర్ దూకుడైన బ్యాటింగ్ కూడా చేయగలడు. కుల్దీప్ యాదవ్ ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. కాబట్టి వాషింగ్టన్ సుందర్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కకపోవచ్చు. జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇచ్చారు, కాబట్టి పేస్ బౌలర్లుగా మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ ఆడవచ్చు. పర్త్ పిచ్‌పై సిరాజ్ ప్రభావవంతంగా ఉండే అవకాశం ఉంది. హర్షిత్ రాణాకు తొలి వన్డేలో చోటు దక్కకపోవచ్చు.




## రంజీ ట్రోఫీలో ఆంధ్రపై
# ఉత్తరప్రదేశ్‌దే పైచేయి

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీలో భాగంగా ఎలైట్ గ్రూప్ ఎలో ఆంధ్ర జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్‌దే (యుపి) పై చేయి అయింది. కాన్పూర్ వేదికగా శనివారం టాస్ గెలిచిన ఆంధ్ర తొలుత బ్యాటింగ్ చేసింది. ఓపెనర్, వికెట్ కీపర్ శ్రీకర్ భరత్ (142), వన్‌డౌన్ బ్యాటర్ రషీద్ (136) భారీ శతకాలతో సత్తా చాటారు. ఈ క్రమంలో ఆంధ్ర జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 143 ఓవర్లలో 470 పరుగులకు ఆలౌట్ అయింది. యుపి బౌలర్లలో విప్రజ్ నిగమ్ 4 వికెట్లు, అకీబ్ ఖాన్ 2, శివం మావి, వివం శర్మ, కెప్టెన్ కరణ్ శర్మ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం తొలి న్నింగ్స్ మొదలుపెట్టిన యుపి శుభారంభమే అందుకుంది. ఓపెనర్లలో అభిషేక్ గోస్వామి (24) నిరాశపరచగా, మాధవ్ కౌశిక్ (54), వన్‌డౌన్ బ్యాటర్ అర్యన్ జుయాల్ (66) అర్ధ శతకాలతో రాణించారు.

అయితే కెప్టెన్ కరణ్ శర్మ (2) విఫలం కాగా, లోయర్ ఆర్డర్‌లో ప్రియమ్ గార్గ్ (18), ఆరాధ్య యాదవ్ (17) ఇలా వచ్చి అలా వెళ్లారు. ఇలాంటి దశలో ఐద నంబర్ బ్యాటర్ రింకూ సింగ్ పట్టుదలగా క్రీజులో నిలబడ్డాడు. మొత్తంగా 273 బంతులు ఎదుర్కొని 13 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 165 పరుగులు సాధించి ఆఖరి వరకూ అజేయంగా నిలిచాడు. అతడికి తోడుగా విప్రజ్ నిగమ్ 42, శివం శర్మ 38, శివం మావి 20 (నాటౌట్) రాణించారు.

ఫలితంగా 169 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి యుపి 471 పరుగుల సాధించింది. శనివారం ఆఖరిరోజు ఆటకావడంతో ఫలితం తేలకుండానే మ్యాచ్ ముగిసిపోయింది. అయితే తొలిఇన్నింగ్స్‌లో ఆంధ్రకంటే ఒక్కపరుగు ఆధిక్యం సంపాదించిన ఉత్తరప్రదేశ్ 3 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. మరోవైపు ఆంధ్రకు ఒక పాయింట్ దక్కింది.

# బంగారం,వెండి ధరలకు కళ్లెం
## ధన్‌తేరాస్‌రోజు పసిడిప్రియులకు ఊరట




**న్యూఢిల్లీ, అక్టోబరు 18:** ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన బంగారం, వెండి ధరలకు ఒక్కసారిగా కళ్లెం పడింది. శనివారం బులియన్ మార్కెట్లో పసిడి, వెండి రేట్లు భారీగా పతనమయ్యాయి. ముఖ్యంగా ఇటీవల రికార్డులు సృష్టిస్తూ సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరిన వెండి ధర, అనూహ్యంగా ఒక్కరోజే కిలోపై ఏకంగా రూ. 13,000 తగ్గడం గమనార్హం. ఈ పరిణామంతో పండగ సీజన్‌లో కొనుగోళ్లు చేయాలనుకుంటున్న వారికి పెద్ద ఊరట లభించింది. హైదరాబాద్ మార్కెట్లో పసిడి, వెండి ధరలు ఇలాఉన్నాయి.హైదరాబాద్ మార్కెట్లో శనివారం నాటి ధరలను పరిశీలిస్తే, కిలో వెండి ధర రూ. 13,000 పతనమై రూ. 1,90,000 వద్ద స్థిరపడింది. శుక్రవారం ఈ ధర రూ. 2,03,000గా ఉంది. ఇక, బంగారం ధరలు కూడా వెండి బాటలోనే నడిచాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములపై రూ. 1,910 తగ్గి రూ. 1,30,860కి చేరింది. అదేవిధంగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం తులంపై రూ.1,750తగ్గి రూ. 1,19,950కి దిగొచ్చింది. ఈ ఆకస్మిక ధరల పతనానికి అంతర్జాతీయ పరిణామాలు, ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణ ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. చైనాపై విధించిన దిగుమతి సుంకాలు తాత్కాలికమేనని, త్వరలో ఆ దేశ అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో చర్చించి ఒక గొప్ప ఒప్పందం కుదుర్చుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి తొలగిపోయి, సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం, వెండిపై డిమాండ్ తగ్గింది. పెద్ద ఎత్తున అమ్మకాలు జరపడంతో మార్కెట్లో ఒక్కసారిగా సప్లై పెరిగి ధరలు కుప్పకూలాయి. అంతర్జాతీయ మార్కెట్లో కూడా స్పాట్ గోల్డ్ ఔన్సుపై 100 డాలర్లకు పైగా తగ్గగా, వెండి ధర దాదాపు 3 డాలర్ల వరకు పతనమైంది. రానున్న రోజుల్లో ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు ధంతేరస్‌ను ధనలక్ష్మి ఆరా ధించే పవిత్రమైన రోజుగా అభివర్ణిస్తారు. భక్తుల కోరికలను తీర్చడానికి 'అదృష్ట లక్ష్మి' తనను పూ జించే ప్రతి ఇంటికీ ఈ రోజు అతిథిగా విచ్చేస్తుం దన్నది ఒక నమ్మకం. అందుకే ఈ పండుగ రోజు బంగారం, వెండి వంటి వస్తువులు కొను గోలు చేయడం శుభప్రదమని ప్రజల విశ్వాసం. ఈ క్రమంలో నేడు బంగారం ధరలు తగ్గడంతో ప్రజల్లో ఉత్సా హం నెలకొంది. మరోవైపు మార్కెట్లో బంగారం కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి.

# క్షేత్రస్థాయికి జిఎస్టీ కుదింపు ప్రయోజనాలు
## కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పియూష్ గోయల్, అశ్విని వైష్ణవ్‌లు వెల్లడి



**న్యూఢిల్లీ,అక్టోబరు 18:** జిఎస్టీ హేతుబద్ధీకరణ ఫలితాలు దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయికి వెళ్లాయని, అన్నివర్గాలకు అందుతున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. జిఎస్టీ రేట్‌కట్‌వల్ల ఇపుడు సామాన్య మధ్యతరగతి ప్రజలకే కాదని, అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరిందన్నారు. కేంద్ర వాణిజ్యమంత్రి పియూష్‌గోయల్, ఐటిశాఖమంత్రి అశ్వినివైష్ణవ్‌లతో కలిసి మీడియామీట్‌లో మాట్లాడిన సీతా రామన్ ప్రభుత్వం మొత్తం 54కీలక వస్తువులను మరింత నిశితంగాపరిశీలిస్తోందని, ఈపన్న ప్రయోజనాలు వినియోగదారునికి చేరుతున్నాయా లేదా అన్నది పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క వస్తు వును తాను స్వయంగా పరిశీలించానని, ప్రజల దైనందిన జీవితంలో జీఎస్టీ బాగం అయిందని, అందు వల్లనే రేట్‌కట్‌ప్రయోజనాలు వారికి చేర్చాలన్నదే మా లక్ష్యమని ఆమె అన్నారు. హైఎండ్ పోర్ట్ ల్యాండ్ సిమెంట్ అనూహ్యంగా ప్రయోజనాలిచ్చిందన్నారు. వినియోగారులకు తక్కువధరలకే అందాయని అన్నారు. తాజా జిఎస్టీ తగ్గింపులు 12నుంచి ఐదుశాతం, 28 నుంచి 18శాతానికి మార్చడంవల్ల 90శాతం వస్తువు లన్నీ ఈ కేటగిరీలకిందకే వచ్చాయ న్నారు. స్వాతంత్ర్యం జరిగిన తర్వాత జరిగిన అతిపెద్ద పన్నుల సంస్కరణ జిఎస్టీ హేతు బద్ధీకరణ అని వాణిజ్యమంత్రి పియూష్‌గోయల్ అన్నారు.ఐటి మంత్రి అశ్విని వైష్ణవ్‌మాట్లా డుతూ 20నుంచి 25శాతంఅధిక విక్రయాలు జరిగా యని, మొబైళ్లు, ఎయిర్‌కండిషనర్లు, వాషింగ్ మెషిన్లు, సెట్‌టాప్‌బాక్సులు అత్యధికంగా అమ్ముడయ్యాయన్నారు. దేశంలో రెండో సెమి కండక్టర్ ప్లాంట్ గతవారం నుంచే పనిచేస్తోందని, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిరంగం రెండంకెల వృద్ధిని సాధిస్తోందన్నారు.

## బ్యాంకు కస్టమర్లకు హాలీడే బ్రేక్..

**ముంబయి, అక్టోబరు 18:** దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 18 నుండి అక్టోబర్ 23 వరకు బ్యాంకులకు వరుస సెలవులు ఉంటాయి. ఈ సెలవులు ప్రాంతాన్ని బట్టి వ . దీపావళి పండుగ మొదటి రోజున ధంతేరస్ సందర్భంగా గౌహతి వంటి నగరాల్లో బ్యాంకులు మూసి ఉంటాయి. అయితే ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, జైపూర్ వంటి ఇతర ప్రధాన నగరాలలో బ్యాంకులు తెరిచే ఉంటాయి. ఆదివారం సహజంగానే బ్యాంకులకు సెలవు. సోమవారం 20వ తేదీ దీపావళి, లక్ష్మీ పూజ దీపావళి పం డుగ యొక్క ప్రధాన రోజు సందర్భంగా దేశంలోని అత్యధిక నగరాల్లో బ్యాంకులకు సెలవు ఉంటుంది. హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, జైపూర్, అగర్తల, పాట్నా, రాయ్‌పూర్, రాంచీ, తిరువనంతపురం వంటి నగరాల్లో బ్యాంకులు క్లోజ్ ఉంటాయి. కేవలం బేలాపూర్, భువనేశ్వర్, ఇంఫాల్, జమ్మూ, ముంబై, నాగ్‌పూర్, శ్రీనగర్ వంటి కొన్ని నగరాల్లో మాత్రమే బ్యాంకులు తెరిచిఉంటాయి. మంగళవారం21వ తేదీ అమావాస్య, దీపావళి రెండోరోజు. ఈ రోజున ముంబై, నాగ్‌పూర్, భోపాల్, భువనేశ్వర్, గ్యాంగ్‌టక్, ఇంఫాల్, జమ్మూ, శ్రీనగర్, బేలాపూర్ వంటి నగరాల్లో బ్యాంకులకు సెలవు. అయితే ఈ రోజు హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, జైపూర్,విజయవాడ, మిగిలిన అనేక నగరాల్లో బ్యాంకులు తెరిచే ఉంటాయి. బుధవారం22న గోవర్ధన పూజ/అన్నకూట్, ఈ రోజు గోవర్ధన పూజ,గుజరాతీ నూతన సంవత్సరం. ప్రధానంగా అహ్మదాబాద్, ముంబై, నాగ్‌పూర్, జైపూర్, లక్నో, కాన్పూర్, డెహ్రాడూన్, బేలాపూర్ వంటి నగరాలలో బ్యాంకులకు సెలవు ఉంటుంది. మిగిలిన నగరాల్లో బ్యాంకులు సాధారణంగా తెరుచుకుంటాయి.గురువారం 23వ తేదీ భాయ్ దూజ్‌సోదర సోదరీమణుల బంధాన్ని జరుపుకునే భాయ్ దూజ్ పండుగ సందర్భంగా అహ్మదాబాద్, కోల్‌కతా, ఇంఫాల్, లక్నో,కాన్పూర్, సిమ్లా వంటి నగరాలలో బ్యాంకులు క్లోజ్ చేసిఉంటాయి.ఆర్బీఐ జాబితా ప్రకారం మిగిలిననగరాల్లో బ్యాంకులు తెరిచి ఉంటాయి.బ్యాంకు సెలవురోజులలో కూడా నెట్ మొబైల్,ఎటిఎం సేవల అందుబాటులో ఉంటాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps